బుధవారం
13-8-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 323
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అంతర్జాతీయ ఉగ్రసంస్థగా బలూచ్ ఆర్మీ

వాషింగ్టన్: పాకిస్థాన్‌లో ప్రత్యేక దేశం కోసం పోరాడుతూ అక్కడి సైన్యానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ), దానికి చెందిన మజీద్ బ్రిగేడ్‌ను విదేశీ ఉగ్రవాద సంస్థలుగా అమెరికా గుర్తించింది. 2019లోనే 'స్పెషల్లీ డెజిగ్నేటెడ్ గ్లోబల్ టెర్రరిస్ట్ (ఎస్‌డీజీటీ)' జాబితాలో బీఎల్‌ఏని చేర్చింది. ఇప్పుడు మజీద్ బ్రిగేడ్‌ను బీఎల్‌ఏలో భాగంగా పరిగణించింది. ఈ మేరకు యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఒక ప్రకటన చేశారు. మజీద్ బ్రిగేడ్ ఇటీవల కాలంలో పాక్ సైన్యమే లక్ష్యంగా ఆత్మాహుతి దాడులు చేస్తోంది. 2024లో కరాచీ ఎయిర్‌పోర్ట్, గ్వాదర్ పోర్ట్ అథారిటీపై బీఎల్‌ఏ దాడులు చేసింది. ఈ ఏడాది జాఫర్ ఎక్స్‌ప్రెస్ హైజాక్ చేసింది. 300 మందిని బంధించింది.

124 నాటౌట్

- మన ఓటు, మన హక్కు మన పోరు
- పార్లమెంటు వద్ద మార్మోగిన నినాదం
- ఎస్ఐఆర్-నిశ్శబ్ద రిగ్గింగ్ బ్యానర్లు, ప్లకార్డులు
- మింతా దేవి టీషర్టులతో 'ఇండియా' నిరసన
- ఓట్ల చోరీపై 15వ రోజు ఎంపీల ఆందోళన
- ఈసీపై పోరు ఆగదని ప్రతిపక్షాల స్పష్టీకరణ

న్యూఢిల్లీ: ఇండియా ఐక్య సంఘటన ఎంపీల నిరసనలతో పార్లమెంటు ఆవరణ దద్దరిల్లింది. ఎన్నికల సంఘంపై సమరంలో భాగంగా బీహార్ ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఆందోళన మంగళవారం (15వరోజు) కొనసాగింది. ఓటర్ జాబితాల్లో అవకతవకలను ఎండగట్టే విధంగా '124 ఏళ్ల ఓటరు' పేరిట టీషర్టులు ధరించి 'ఇండియా' ఎంపీలు పార్లమెంటు హౌస్ కాంప్లెక్స్ వద్ద నిరసన తెలిపారు. 'మింతా దేవి 124 నాటౌట్' నినాదాలతో ఆ ప్రాంగణాన్ని మార్మోగించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్లమెంటరీ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ, ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, టీఎంసీ ఎంపీ డెరెక్ ఓ బ్రెయిన్, డీఎంకే ఎంపీ టీఆర్ బాలు, ఎన్‌సీపీ (ఎస్‌పీ) ఎంపీ సుప్రియా సూలే, సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్ సహా వామపక్షాలతో పాటు ఇతర భాగస్వామ్య పార్టీల నాయకులు మకర ద్వారం వద్ద ఆందోళనలో పాల్గొన్నారు. ఎస్ఐఆర్ రద్దు కోసం డిమాండ్ చేస్తూ పోస్టులు ప్రదర్శించారు. ఈసీకి వ్యతిరేకంగా నినాదాలిచ్చారు. 'మన ఓటు, మన హక్కు, మన పోరు', 'ఎస్ఐఆర్-సైలెంట్ ఇన్‌విస్బిబిల్ రిగ్గింగ్ (నిశ్శబ్ద రిగ్గింగ్)' అన్న బ్యానర్లతో ఎంపీలు నిరసన తెలిపారు. 'ఎస్ఐఆర్ ఆపండి,' 'ఓట్ చోరీ' అని రాసిన ప్లకార్డులు, ఎన్నికల సంఘం, కేంద్రం కుమ్మక్కైనట్లు ఆరోపించే పోస్టర్లు ప్రదర్శించారు. పార్లమెంటు సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా

- మిగతా 2 లో

జస్టిస్ వర్మపై విచారణకు ముగ్గురు సభ్యుల కమిటీ

న్యూఢిల్లీ: ఇంట్లో నోట్ల కట్టలు దొరికిన ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై అభిశంసన తీర్మానాన్ని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా స్వీకరించారు. ఘటనపై విచారణకు ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు స్పీకర్ మంగళవారం ప్రకటించారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్, మద్రాస్ హైకోర్టు సీజే జస్టిస్ మణీందర్ మోహన్, సీనియర్ న్యాయవాది బీవీ ఆచార్య ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. అభిశంసన తీర్మానంపై రవిశంకర్ ప్రసాద్,

- మిగతా 2 లో

ఇంకెంతకాలం జైలులో... సుప్రీం

న్యూఢిల్లీ: వివిధ కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు సంబంధించి భారత సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. నిర్ణీత శిక్ష పూర్తి చేసుకొని మరే ఇతర కేసులో దోషిగా లేదా నిందితులుగా లేని ఖైదీలను తక్షణమే విడుదల చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. 2002లో ఢిల్లీలో నితీశ్ కటారా అనే వ్యాపారవేత్త హత్య కేసులో దోషిగా తేలిన సుఖ్‌దేవ్ పహిల్వాన్ శిక్షాకాలం పూర్తయినందున అతడిని విడుదల చేయాలని ఆదేశాలు జారీ

- మిగతా 2 లో

'జమిలి'పై జేపీసీ గడువు పొడిగింపు

న్యూఢిల్లీ: జమిలీ ఎన్నికలపై పార్లమెంటరీ కమిటీ నివేదిక గడువును శీతాకాల సమావేశాల చివరి వారం వరకు కేంద్రం పొడిగించింది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి ఎన్నికలు నిర్వహించే విధానాన్ని అమలు చేసే రెండు బిల్లులను పార్లమెంటరీ కమిటీ పరిశీలిస్తోన్న సంగతి తెలిసిందే. జేపీసీ చైర్మన్ పీపీ చౌదరి ప్రతిపాదించిన తీర్మానాన్ని సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఈ తీర్మానం ప్రకారం 2025 శీతాకాల సమావేశాల చివరి వారం మొదటిరోజు వరకు ప్యానెల్ తన

- మిగతా 2 లో

34 ప్యాకేజీల ద్వారా

రహదారుల అభివృద్ధి

రూ.45 వేల కోట్ల వారసత్వ ఆర్థికభారం

- భవిష్యత్తులో కాంట్రాక్టర్లకు ఇబ్బందులుండవు
- 40 శాతం నిధుల సమీకరణకు యత్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో పెద్ద ఎత్తున రహదారుల అభివృద్ధికి కృషి చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ దీనికి కట్టుబడి ఉందని తెలిపారు. రహదారులు నాగరికతకు చిహ్నాలని, రహదారులు ఉంటే మారుమూల ప్రాంతాల నుంచి ఎక్కడికైనా ఉత్పత్తి అయిన వస్తువులను సునాయాసంగా తరలించవచ్చని ఆయన పేర్కొన్నారు. రహదాల నిర్మాణంతో పరిశ్రమలు పెరిగి తద్వారా యువతకు ఉపాధి, ఆదాయం సమకూరుతుందని వివరించారు. ప్రభుత్వం కేవలం సంక్షేమ పథకాలే కాదు తెలంగాణ రైసింగ్‌లో భాగంగా ఇన్ ఫ్రా, పరిశ్రమలు, విద్య, వైద్య రంగాలను అభివృద్ధి పరుస్తుందన్నారు. పంచాయతీరాజ్ శాఖ అధ్వర్యంలో 17 ప్యాకేజీల ద్వారా రాష్ట్రంలో 7,947 కిలోమీటర్లు... రోడ్లు భవనాల శాఖ పరిధిలో 17 ప్యాకేజీల ద్వారా 5,190 కిలోమీటర్ల మేర మొత్తం 34 ప్యాకేజీల ద్వారా 13,137 కి.మీ. రోడ్లు అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. క్యాబినెట్ ఆమోదించిన పనులకు త్వరితగతిన టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని, కాంట్రాక్టర్లకు ఆర్థిక ప్రోత్సాహం కల్పించేందుకు బ్యాంకర్ల తోనూ సమావేశం ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. కాంట్రాక్టర్ల సమస్యలపై అవగాహన ఉందని, గత ప్రభుత్వ పెద్దలు రూ.1.75 లక్షల కోట్ల అభివృద్ధి పనులకు ఒప్పందాలు చేసుకొని, రూ.45 వేల కోట్ల విలువైన పనులకు టోకెన్లు జారీ చేసి ఆ బకాయిలు చెల్లించకుండా తమకు

- మిగతా 2 లో

ఎకో టూరిజంపై దృష్టి

- అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టు అభివృద్ధి
- అటవీ, రెవెన్యూ భూముల హద్దులు నిర్ధారించాలి
- నిఘా కెమెరాలు కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం
- అడవి జంతువుల బాధితులకు తక్షణ పరిహారం: సీఎం రేవంత్

విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సింగపూర్ వంటి దేశాల్లో 30 ఎకరాల్లోనే నైట్ సఫారీలు ఉన్నాయని... మన దగ్గర భారీ విస్తీర్ణంలో అటవీ ప్రాంతాలు... అందులోనే నదులు, జలపాతాలు ఉన్నందున మనకు ఉన్న వనరులను సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి మంగళవారం అటవీ శాఖపై సమీక్ష నిర్వహించారు. మన రాష్ట్రంలో అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులున్నా ... తెలంగాణ వాసులు ఇతర రాష్ట్రాల్లోని బందీపూర్, తడోబా వంటి ప్రాంతాలకు పులుల సందర్శనకు వెళుతున్నారని సీఎం అన్నారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులకు సందర్శకుల సంఖ్య పెంచేలా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అటవీ, రెవెన్యూ శాఖల మధ్య భూ వివాదాల పరిష్కారానికి సంయుక్త సర్వే చేపట్టాలని సూచించారు. కలెక్టర్లు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వరంగల్ కాకతీయ జూ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో పెద్ద నగరమైన వరంగల్‌లో జూను ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలన్నారు. అటవీ జంతువుల దాడిలో మృతిచెందిన లేదా గాయపడిన వారికి, పశువులు, పెంపుడు జంతువులు కోల్పోయిన వారికి తక్షణమే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకు సీఎం ఆర్ఎఫ్ నుంచి అవసరమైన మేరకు నిధులు వినియోగించుకోవాలని సూచించారు. అటవీ శాఖ పరిధిలో చేపడుతున్న రహదారులు, అభివృద్ధి పనులకు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ నుంచి అనుమతులను సాధ్యమైనంత త్వరగా సాధించాలన్నారు. అడవుల్లో వన్యప్రాణుల సంరక్షణ, వాటి కదలికలను గమనించేందుకు ఏర్పాటు చేసిన కెమెరాలన్నింటిని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానించాలని ఆదేశించారు. రాష్ట్రానికి తగిన సంఖ్యలో

- మిగతా 2 లో

'సెంట్రల్ డిజైన్' పటిష్టత కట్టుదిట్టం

- నీటిపారుదల శాఖలో పదోన్నతులు...ఉద్యోగాల భర్తీ
- ప్రాజెక్టుల నిర్మాణంలో 'ఎలక్ట్రోమెకానికల్' ప్రముఖ పాత్ర
- సీడీవో ప్రతిభకు పట్టం: మంత్రి ఉత్తమ్

విశాలాంధ్ర - హైదరాబాద్: నీటిపారుదలశాఖ సెంట్రల్ డిజైన్ విభాగం పటిష్టతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అంబేద్కర్ సచివాలయంలో మంగళవారం నీటిపారుదల శాఖాధికారులతో విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ... మేడిగడ్డ ఉదంతంలో జాతీయ భద్రత సంస్థ... జస్టిస్ ఘోష్ కమిషన్ చేసిన వ్యాఖ్యలతో సీడీవో ప్రతిష్ట దెబ్బతిన్నదన్నారు. సీడీవో పునఃసమీక్షించుకుని సంస్కరణలు చేపట్టడం అత్యవసరమన్నారు. ప్రభుత్వం సంపూర్ణ సహాయం చేస్తుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సీడీవోను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాజెక్టుల డిజైన్‌ల రూపకల్పనలో ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకరావాలన్నారు. అందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను ఏర్పాటు చేసుకోవడంతో పాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పనలో ముందుండాలన్నారు. వందేళ్ల క్రితం నిర్మించిన నిజాం సాగర్ ప్రాజెక్టు మొదలు ... ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రధాన ప్రాజెక్ట్ నిర్మాణాలలో వినియోగించిన సాంకేతికత తెలంగాణా సీడీవో ప్రతిభకు పట్టం కడుతుందన్నారు. అటువంటి

- మిగతా 2 లో

ఏపీకి సెమీ కండక్టర్ల తయారీ ప్రాజెక్టు

కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం

2 లో

పౌరసత్వానికి ఆధార్ సరిపోదు

ఈసీతో ఏకీభవించిన సుప్రీం

న్యూఢిల్లీ: పౌరసత్వానికి రుజువుగా ఆధార్ కార్డు సరిపోదని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. దానిని పూర్తిస్థాయి రుజువుగా పరిగణించలేమని పేర్కొంది. ఎస్ఐఆర్ వివాదం వేళ ఎన్నికల సంఘం వాదనతో ఏకీభవించేలా సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు చేసింది. ఆధార్ కార్డు, ఓటరు కార్డులను పౌరసత్వానికి రుజువులుగా స్వీకరించబోమని ఎన్నికల సంఘం ఇప్పటికే స్పష్టం చేసింది. బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నిర్వహించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు మంగళవారం

- మిగతా 2 లో

పలస్తీనాపై దాడులు ఆపండి

ఏఐవైఎఫ్

విశాలాంధ్ర- హైదరాబాద్ : పలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు తక్షణమే నిలిపేయాలని, పలస్తీనాకు ప్రపంచ దేశాలు అండగా నిలవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ డిమాండ్ చేశారు. జాతీయ సమితి పిలుపులో భాగంగా ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి అధ్వర్యంలో హిమాయత్ నగర్ సత్యనారాయణ రెడ్డి భవన్ నుంచి వై జంక్షన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ పలస్తీనా ప్రజల పోరాటం.. వారికొక్కరికే పరిమితం కాదని, ఇది ప్రపంచ న్యాయం, మానవత్వం, శాంతి కోసం జరుగుతున్న పోరాటం అని అన్నారు. ఈ హింసను ముగించేందుకు అన్ని ప్రపంచ దేశాలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గాజాలో ఆసుపత్రులపై బాంబు దాడులు చేస్తున్నారని, దీంతో రోగులు, డాక్టర్లు, నర్సులు మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గాజాలో ఔషధాలు, వైద్య సామగ్రికి తీవ్రమైన కొరత ఏర్పడిందన్నారు. ఇప్పటివరకు ఇజ్రాయిల్ 60 వేల మందికి పైగా పలస్తీనియులను హతమార్చిందన్నారు. శిథిలాలలో కూరుకుపోయిన బాధితుల వివరాలు ఇప్పటికీ నమోదు కాలేదన్నారు. గాజాలో ప్రజలు ఆకలితో మరణిస్తున్నారన్నారు. గత ఐదు నెలలుగా 21 లక్షల మంది ఆకలితో అలమటిస్తున్నారన్నారు. మరణించే వారి సంఖ్య రోజు రోజుకీ పెరుగుతోందన్నారు. 20 లక్షల మంది మందులు, నీరు, ఆహారం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇజ్రాయిల్-అమెరికా కూటమి రోజుకు 100 బాంబులు వేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోందన్నారు. పిల్లల కోసం పాలు ... ఆహార పదార్థాలు పలస్తీనా చేరకుండా అడ్డుకుంటున్నారన్నారు. ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్, హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, హరీష్, అనీల్, కిరణ్, భరత్, సుధీర్, కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర- హైదరాబాద్: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 90వ ఆవిర్భావ దినోత్సం హిమాయత్‌నగర్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సమాఖ్య మాజీ జాతీయ అధ్యక్షుడు

- మిగతా 2 లో

బండి సంజయ్‌కు కేటీఆర్ లీగల్ నోటీస్

విశాలాంధ్ర - హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్... కేంద్ర హోం వ్యవహారాల శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు లీగల్ నోటీసు పంపారు. ఫోన్ ట్యాపింగ్‌పై బండి వ్యాఖ్యలు అవాస్తవమని, నిరాధారమైనవని, అవి తన ప్రతిష్టను దిగజార్చే ఉద్దేశంతో చేసినవని కేటీఆర్ లీగల్ నోటీసులో పేర్కొన్నారు. ఇటీవల బండి సంజయ్ మీడియా సమావేశంలో ఫోన్ ట్యాపింగ్‌పై చేసిన ఆరోపణలు దురుద్దేశ పూరితమైనవని నోటీసులో స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి హోదాను దుర్వినియోగం చేస్తూ, ప్రజలలో తన పతిష్టను దిగజార్చడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కేవలం వార్తల్లో కెక్కేందుకు అడ్డగోలుగా ప్రాపగండ చేస్తున్నారన్నారు. మీడియా సమావేశంలో బండి చేసిన ఏ వ్యాఖ్యలకు ఎలాంటి

- మిగతా 2 లో

ఇదీ లోకం!

భారత్‌పై సుంకాలతో రష్యాకు దెబ్బ: ట్రంప్

వాషింగ్టన్: భారత్‌పై అమెరికా విధించిన భారీ సుంకాలతో రష్యా ఆర్థిక వ్యవస్థకు పెద్ద దెబ్బ అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఆయన శ్వేతసౌధంలో విలేకరులతో మాట్లాడుతూ అమెరికా విధిస్తున్న వాణిజ్య ఆంక్షలు, అంతర్జాతీయ ఒత్తిళ్లతో రష్యాకు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. రష్యా ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేదని, ఇప్పటికే అమెరికా విధిస్తున్న వాణిజ్య ఆంక్షలు, అంతర్జాతీయ ఒత్తిళ్లతో మాస్కో ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నదని చెప్పారు. రష్యా తమ దేశాన్ని తిరిగి నిర్మించుకోవాల్సి వస్తుందనర్నారు. రష్యా నుంచి అత్యధికంగా చమురు కనుగోలు చేసే భారత్‌పై 50 శాతం సుంకాలు విధించాం. ఇది రష్యాకు పెద్ద దెబ్బ' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ అమెరికా పర్యటనకు రానుండటం గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు. పుతిన్‌తో నిర్మాణాత్మక సంప్రదింపులు జరుగుతాయని ట్రంప్ ఆకాంక్షించారు.

చైనాకు మరో 90 రోజుల విరామం

చైనాతో వాణిజ్య ఒప్పందానికి మరో 90 రోజుల విరామాన్ని ట్రంప్ ప్రకటించారు. ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. వాణిజ్య ఒప్పందంపై చర్చల గడువును పొడిగించినట్లు చైనా కూడా అధికారికంగా పేర్కొంది. తొలుత విధించిన 90 రోజుల గడువు మంగళవారంతో ముగిసిన నేపథ్యంలో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. అంతకుముందు రెండు దేశాలు పరస్పరం సుంకాలు (100శాతానికిపైగా) విధించుకున్నాయి. తర్వాత రద్దు చేసుకున్నాయి. ప్రస్తుతం చైనా దిగుమతులపై 30 శాతం సుంకాలను అమెరికా అమలు చేస్తోంది. భారత్‌పై 25 శాతంగా ఉన్న సుంకాన్ని ఈ నెల 27 నుంచి 50శాతానికి పెంచడం విదితమే. ఈ ఏడాది చివర్లో అమెరికా, చైనా అధ్యక్షులు భేటీ జరగనుండగా... తాజా విరామంతో వాణిజ్య ఒప్పందంపై చర్చలకు మార్గం మరింత సుగమం చేసినట్లు తెలుస్తోంది. సుంకాల విషయంలో చైనాతో వ్యవహారం సంక్లిష్టంగా ఉంటుందని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లతో ముడి పెట్టలేని అనేక అంశాలు చైనా-అమెరికా సంబంధాలను ప్రభావితం చేస్తాయని తెలిపారు.

నీళ్లు ఇవ్వకుంటే యుద్ధం తప్పదు: బిలావల్

ఇస్లామాబాద్: పాకిస్థాన్ సైన్యాధికారి అసీం మునీర్ సగం ప్రపంచాన్ని నాశనం చేస్తామన్న హెచ్చరిక వేళ ఆ దేశ రాజకీయ నేత బిలావల్ భుట్టో భారత్‌కు సింధూ జలాలపై మరోసారి హెచ్చరిక చేశారు. సింధూ జలాలు నిలిపివేస్తే, యుద్ధం తప్పదన్నారు. ఇప్పటికే భారత్ వల్ల పాకిస్థాన్‌కు తీవ్ర నష్టం జరిగిందన్నారు. భారత ప్రధాని మోదీకి వ్యతిరేకంగా పోరాడాలని పాకిస్థానీయులకు బిలావల్ పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వ చర్యలు పాకిస్థాన్‌కు నష్టాన్ని మిగిల్చాయని, ప్రజలందరూ ప్రతిఘటించాలన్నారు. ఆరు నదులను తీసుకువచ్చేందుకు పాకిస్థానీలు శక్తివంతంగా ఉన్నట్లు చెప్పారు. భారత్ పద్ధతి మార్చుకోకపోతే దేశ ప్రయోజనాల పరిరక్షణకు యుద్ధమే పాకిస్థాన్‌కు శరణ్యం అవుతుందని అన్నారు. 'మేము యుద్ధం ప్రారంభించడం లేదు కానీ, ఆపరేషన్ సింధూర్ తరహా దాడి చేయాలనుకుంటే, పాకిస్థాన్‌లోని ప్రతి ఒక్కరు ప్రతిఘటించేందుకు సిద్ధంగా ఉన్నారు. అప్పుడు జరిగే పోరులో భారత్‌కు ఓటమి తప్పదు. దేశం, దేశ ప్రజల ప్రయోజనాల కోసం జరిగే పోరాటంలో వెనక్కి తగ్గబోం' అని సింధ్ కార్యక్రమంలో బిలావల్ భుట్టో రెచ్చిపోయారు.

బిష్ణోయ్ గ్యాంగ్‌పై 'ఉగ్ర' ముద్ర

కన్జర్వేటివ్ నేతల డిమాండ్

కెనడా ప్రభుత్వానికి లేఖ

ఒట్టావా: ప్రముఖ కమేడియన్, నటుడు కపిల్ శర్మ కేఫ్‌పై రెండు సార్లు జరిగిన దాడితో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని కెనడా ప్రభుత్వాన్ని కన్జర్వేటివ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓ లేఖ రాశారు. సామాన్యులను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఈ గ్యాంగ్‌పై చర్యలు తీసుకొనే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. బిష్ణోయ్ గ్యాంగ్ నేర సామ్రాజ్యం విస్తరిస్తోందని, కెనడా పౌరులను దోచుకోవడం, హత్యల్లో ఈ గ్యాంగ్‌కు పాత్ర ఉందని కెనడా ఎంపీ ఫ్రాంక్ కాపుటో ఆరోపించారు. దేశ, విదేశాల్లో హింసకు తామే బాధ్యులమని బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించుకున్న విషయాన్ని తన లేఖలో ప్రస్తావించారు. ఇలా రాజకీయంగా, మతపరమైన, సైద్ధాంతిక కారణాలతో అనేక అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఆ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థల జాబితాలో చేర్చాలని కోరారు. తద్వారా ఆ గ్యాంగు ఆగడాలను కట్టడి చేయొచ్చని, దానిని అణచివేసేందుకు భద్రతా సంస్థలకు అవకాశం ఉంటుందన్నారు. బిష్ణోయ్ గ్యాంగ్ విషయంలో ఇప్పటికే కెనడా నాయకులు అనేక మంది ఆందోళన వ్యక్తం చేసినట్లు ఫ్రాంక్ గుర్తుచేశారు. బ్రాంప్టన్ మేయర్ పాట్రిక్ బ్రౌన్ సహా నలుగురు నేతలు గతంలో ఇలాంటి విజ్ఞప్తి చేశారని, బ్రిటీష్ కొలంబియా ప్రీమియర్ డేవిడ్ ఈబే, అల్బెర్టా ప్రీమియర్ డేనియల్ స్మిత్, సర్రీ మేయర్ బ్రెండా లాకీ కూడా బిష్ణోయ్ గ్యాంగ్‌పై చర్యలను కోరారని వెల్లడించారు. బిష్ణోయ్ గ్యాంగ్‌పై చర్యలకు రాజకీయంగా ఏకాభిప్రాయం ఉందని ఎంపీ పేర్కొన్నారు.

124 నాటౌట్

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపక్షాల ఆందోళన కొనసాగుతోంది. ఉభయ సభల్లో ఈ అంశంపై చర్చ కోసం వారు ఐక్యంగా డిమాండ్ చేస్తున్నారు. ఈ కారణంగా లోక్‌సభ, రాజ్యసభలో వాయిదాల పర్వం కొనసాగుతోంది. కాగా, పార్లమెంటు వద్ద నిరసన సందర్భంగా విలేకరుల ప్రశ్నకు లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ స్పందిస్తూ 'పిక్చర్ అభి బాకీ హై' (ఇది ముగింపు కాదు) అని అన్నారు. రాజీవ్ కుమార్, జ్ఞానేశ్ కుమార్ నాయకత్వంలోని ఎన్నికల సంఘం బీజేపీ శాఖగా మారిపోయిందని కాంగ్రెస్ నేత మాణిక్యం ఠాకూర్ ఆరోపించారు. 'ఓటర్ల జాబితాలో మొదటిసారి ఓటు వేసే వారిలో మింతా దేవి పేరు ఉంది. వాస్తవానికి ఆమె వయస్సు 124 ఏళ్లు. ఇలాంటి అంశాలపై చర్చను కోరుతున్నాం. ఎన్నికల సంఘం బీజేపీ కనుసన్నల్లో పనిచేస్తున్నది. ఓటర్ల జాబితా మోసాలభరితంగా ఉంది. ఇది పొరపాటు కాదు... మెగా ఓటర్ మోసానికి రుజువు' అని వ్యాఖ్యానించారు. ఎన్నికల మోసాలు ఆగేంత వరకు 'ఇండియా' పోరాడుతుందని ఠాకూర్ అన్నారు. 'ఎన్నికల సంఘం సృష్టించే అద్భుతాల సౌజన్యంతో దేశంలోనే యవ్వనంగా కనిపించే వృద్ధురాలిగా మింతా దేవి పేరును గిన్నిస్ వరల్డ్ రికార్డ్ కోసం మేము గర్వంగా ప్రతిపాదిస్తున్నాం' అంటూ కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేరా 'ఎక్స్' మాధ్యమంగా వ్యంగాస్త్రం సంధించారు. ఎన్నికల సంఘం మానవాళికి గొప్ప సేవ చేసిందని, బీహార్ ఎస్ఐఆర్‌లో 124 ఏళ్లు ఉన్న వృద్ధురాలిని కనిపెట్టిందని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ ఎద్దేవా చేశారు. ఎన్నికల సంఘం చేసిన మెగా ఓటర్ మోసాలను సాగనిచ్చేది లేదని తేల్చిచెప్పారు. ఇదంతా ఆగేంత వరకు ఇండియా ఐక్య సంఘటన పోరాటం కొనసాగుతుందని వేణుగోపాల్ వెల్లడించారు. రాహుల్ గాంధీ ఇటీవల ఈసీ మోసాలపై వెల్లడించిన వివరాల ప్రకారం మింతా దేవి పేరు బీహార్‌లోని సివన్ లోక్‌సభ పరిధిలో దరౌంధా అసెంబ్లీ నియోజకవర్గంలో అర్జానిపూర్‌లోగల కన్యా ఉత్క్రమిత్ మధ్య విద్యాలయలో కొత్త ఓటరుగా నమోదై ఉంది. ఎస్ఆర్ఐ ప్రక్రియను ఎన్నికల సంఘం పూర్తి చేసిన తర్వాత ఈమె పేరు తెరపైకి వచ్చింది.

'సెంట్రల్ డిజైన్' పటిష్టత కట్టుదిట్టం

(మొదటిపేజీ తరువాయి)

విశ్వసనీయత కలిగిన సంస్థ లోపాలు సరిదిద్ది అదే ప్రతిష్టను ఇనుమడింప చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీడీవోలో ఖాళీల భర్తీకి తక్షణం చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ప్రాజెక్టుల నిర్మాణంలో నిర్దిష్టమైన ఇంజినీరింగ్, సృజనాత్మక అవసరమని, అది అత్యుత్తమ శిక్షణ పొందిన నిపుణుల ద్వారానే సాధ్యపడుతుం దన్నారు. పదవీ విరమణ పొంది అనుభవజ్ఞులైన వారి సేవలు కుడా వినియోగించుకుని అద్భుతమైన ఫలితాలు రాబట్టలన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో ఎలక్ట్రోమెకానికల్ ఇంజినీరింగ్ ప్రాముఖ్యత మరింత పెరగబోతుందన్నారు. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఐఐటీ హైదరాబాద్, జేఎన్‌టీయూఎస్ జెన్ కో వంటి సంస్థలకు చెందిన వారిని నియమించే ముందు టైంబౌండ్ పద్ధతిలో డిజైన్‌ల రూపకల్పన లో ఉత్తమ నైపుణ్యాలను ప్రదర్శించడంతో పాటు సమయపాలనకు పెద్ద పీట వేయాలన్నారు. నల్లగొండ జిల్లాలో నెల్లికల్లు, డిండి ఎత్తిపోతల పథకాల డిజైన్ లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇ. ఎన్.సో అంజద్ హుస్సేన్, రమేష్ బాబు, నీటిపారుదలశాఖ జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్, సీడీవో సీఈ యం.సత్యనారాయణ రెడ్డి, అజయ్ కుమార్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

'ఎకో టూరిజం'పై దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

ఐఎఫ్ఎస్ అధికారుల కేటాయింపుపై కేంద్రంతో సంప్రదించాలని సీఎస్‌కు సూచించారు. అటవీ శాఖలో ప్రమోషన్లు... ఉద్యోగాల భర్తీకి ప్రతిపాదనలను తక్షణమే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఉత్తమ పనితీరు కనబరుస్తున్న వారికి అవార్డులను ఇచ్చే ప్రక్రియను పునరుద్ధరించాలని సూచించారు. అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, పీసీసీఎఫ్ డాక్టర్ సి.సువర్ణ, పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) ఎలుసింగ్ మేరు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

వారసత్వంగా ఆర్థిక భారాన్ని మిగిల్చి వెళ్లారని విమర్శించారు. కాంట్రాక్టర్ల ఇబ్బందులను అధిగమించే ప్రయత్నం చేస్తున్నట్టు చెప్పారు. కాంట్రాక్టర్లు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు సంపద సృష్టిలో భాగస్వాములుగా అభివర్ణించారు. ట్రాఫిక్ ను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో కొన్ని రోడ్లను ఫోర్ లైన్‌గా మార్చాల్సి ఉందన్నారు. హెచ్ఏఎం రోడ్లకు ప్రభుత్వ వాటా 40శాతం నిధుల సమీకరణకు ప్రయత్నిస్తున్నట్టు పేర్కొన్నారు. భవిష్యత్తులో కాంట్రాక్టర్లకు ఇబ్బందులు ఉండవని అన్నారు. హెచ్ ఏఎం రోడ్డు పనుల్లో చిన్న కాంట్రాక్టర్లకు అవకాశం కల్పిస్తాం అన్నారు.

'జమిలి'పై జేపీసీ గడువు పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

నివేదికను సమర్పించడానికి గడువు ఇచ్చింది. రాజ్యాంగం (129వ సవరణ) బిల్లు, 2024 లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు (జమిలీ) నిర్వహించడానికి రాజ్యాంగాన్ని సవరించేందుకు యత్నిస్తోంది. ఏకకాల ఎన్నికల్లో భాగంగా కేంద్రపాలిత ప్రాంతాల అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించే మరో బిల్లును కూడా సవరిస్తోంది. జమిలీ ఎన్నికలకు దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేక ఉంది.

ఏపీకి సెమీ కండక్టర్ల తయారీ ప్రాజెక్టు

- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం
- చంద్రబాబు, లోకేశ్ కృతజ్ఞతలు

న్యూఢిల్లీ: దేశంలో నాలుగు కొత్త సెమీ కండక్టర్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని కేంద్ర కేబినెట్ మంగళవారం నిర్ణయించింది. ఏపీ సహా ఒడిశా, పంజాబ్‌లో సెమీ కండక్టర్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపింది. మొత్తంగా రూ.4,594 కోట్ల వ్యయంతో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ సమావేశం అనంతరం మీడియాకు వెల్లడించారు. పట్టణ రవాణాను మరింత బలోపేతం చేసేలా లక్నో మెట్రో మొదటి దశ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. దీన్ని రూ.5,801 కోట్లతో చేపట్టనున్నట్లు పేర్కొంది. అరుణాచల్‌ప్రదేశ్‌లో 700 మెగా వాట్ల జలవిద్యుత్ ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. దేశంలో సెమీ కండక్టర్ ఎకో సిస్టమ్ గణనీయంగా ఊపందుకుంటున్న వేళ... తాజా నిర్ణయం మరింత ప్రయోజనకరంగా మారనుంది. ఇప్పటికే దేశంలో ఆరు సెమీ కండక్టర్ ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉండగా... తాజాగా కేంద్ర కేబినెట్ ఆమోదించిన నాలుగు కొత్త ప్రాజెక్టులతో ఈ సంఖ్య మొత్తం 10కి చేరింది. 2034 నాటికి నైపుణ్యం గల వారికి మరింతగా ఉపాధి అవకాశాలు సృష్టించడంలో ఇవి కీలకంగా పనిచేయనున్నాయి. ఎలక్ట్రానిక్ తయారీ ఎకోసిస్టమ్‌కు ఉత్ప్రేరకంగా పనిచేయడం ద్వారా ఇవి పరోక్షంగా అనేక ఉద్యోగాల కల్పనకు ఉపయోగపడనున్నాయి టెలికాం, ఆటోమోటివ్ డేటా సెంటర్లు, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్‌లో సెమీకండక్టర్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కొత్తగా ఆమోదించిన ఈ నాలుగు కొత్త సెమీకండక్టర్ ప్రాజెక్టులు దేశంలో సాంకేతిక పరిజ్ఞానంలో స్వావలంబన సాధించడంలో, ఆత్మనిర్భర్ భారత్‌ను సాకారం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ పేర్కొన్నారు. కేంద్ర కేబినెట్ కొత్తగా ఆమోదించిన నాలుగు సెమీకండక్టర్ తయారీ ప్లాంట్ల నిర్మాణ పనులు అతి త్వరలోనే ప్రారంభమవుతాయని మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. గతంలో మంజూరైన ఆరు ప్లాంట్లకు అనుమతులన్నీ రికార్డు సమయంలోనే వచ్చాయన్నారు. చాలావరకు 100 రోజుల్లోనే అనుమతులు వచ్చేశాయని, ఆరు నెలల వ్యవధిలోనే వారు తమ డిజైన్, నిర్మాణాలు ప్రారంభించారని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రకటించిన వాటి విషయంలోనూ అదే పురోగతి ఉంటుందని భావిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా ముఖ్యమంత్రులు ఇప్పుడే తనతో మాట్లాడారని వైష్ణవ్ వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీకి వారు కృతజ్ఞతలు చెప్పారని తెలిపారు. రికార్డు సమయంలోనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తనకు హామీ ఇచ్చారన్నారు.

చంద్రబాబు, లోకేశ్ కృతజ్ఞతలు

ఏపీకి సెమీ కండక్టర్ల ప్రాజెక్టు కేటాయిస్తూ కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. డబుల్ ఇంజిన్ సర్కార్ నేతృత్వంలో సెమీ కండక్టర్ తయారీ ఏపీకి వస్తోందన్నారు. రాష్ట్రానికి సెమీకండక్టర్ తయారీ ప్రాజెక్టును మంజూరు చేసినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు చెబుతూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజీ టెక్నాలజీస్ దక్షిణ కొరియాకు చెందిన అపాక్ట్ కో. లిమిటెడ్‌తో 96 మిలియన్ యూనిట్ల వార్షిక సామర్థ్యంతో ఒప్పందం కుదుర్చుకుంటుందని తెలిపారు. సెమీకండక్టర్లను మొబైల్ ఫోన్లు, సెట్ టాప్ బాక్సులు, ఆటోమొబైల్స్, ఇతర ఎలక్ట్రానిక్ అప్లికేషన్స్‌లో ఉపయోగిస్తారని, తద్వారా ఆత్మనిర్భర భారత్‌కు ఈ ప్రాజెక్టు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యం ఖూనీ

- రాష్ట్రంలో రౌడీ రాజ్యం: చంద్రబాబు అరాచకాలు
- జెడ్పీటీసీ ఉప ఎన్నికలు మళ్లీ నిర్వహించాలి: జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో రౌడీ రాజ్యం సాగుతోందని, ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. జెడ్పీటీసీ ఉప ఎన్నికలను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. పులివెందుల నియోజకవర్గంలోని ఒక చిన్న జెడ్పీటీసీ సీటును లాక్కునేందుకు, రాజంపేటలో ఒంటిమిట్ట సీటును బలవంతంగా చెరబట్టేందుకు గూండా మాదిరిగా సీఎం చంద్రబాబు అరాచకాలు చేసి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని తీవ్రంగా గాయపరిచిన ఈరోజు బ్లాక్ డే అని అన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికలను రద్దు చేసి, కేంద్ర బలగాల అధీనంలో తిరిగి ఎన్నిక నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని జగన్ డిమాండ్ చేశారు. చంద్రబాబు అధికారాన్ని దుర్వినియోగిస్తున్నారని, అధికారులను, పోలీసులను ఇష్టమొచ్చినట్లు వాడుకుంటున్నారని విమర్శించారు. ఈ ఎన్నికను హైజాక్ చేశారని ఎక్స్ వేదికగా జగన్ విమర్శించారు. చంద్రబాబు సీట్లో ఉండగా రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉండదన్నారు. రాజ్యాంగం, చట్టం, న్యాయం, ధర్మం, నిబంధనలు, ప్రజాస్వామ్య పద్ధతులు అన్నవి ఒట్టిమాటలేనని విమర్శించారు. వ్యవస్థలు అలంకార ప్రాయంగా మారుతాయని దుయ్యబట్టారు. ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు వేయగలగడం... అందుకు సహకారం అందించడం, సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ విధి కానీ, చంద్రబాబు తన ప్రభుత్వ సిబ్బంది, పోలీసులతో రిగ్గింగ్ చేయించారని జగన్ ఆరోపించారు. ఓటర్ల నుంచి స్లిప్పులు లాక్కుని, బయట ప్రాంతాలకు చెందిన తమ టీడీపీ నాయకులతో, కార్యకర్తలతో ఓట్లేయించారన్నారు. వైసీపీ ఏజెంట్లను బూత్‌ల్లో కనీసం కూర్చోనీయ లేదని, ఓటర్లను బూత్‌ల వైపునకు రానీయకుండా భయపెట్టారని ఆరోపించారు. ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా సాగేలా చూడాల్సిన అధికారులు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు సహా పోలీసులు... చంద్రబాబు తప్పుడు ఆదేశాలకు తలొగ్గుతూ దగ్గరుండి మరీ టీడీపీ దాడులు, దౌర్జన్యాలను సాగనిచ్చారని విమర్శించారు. చంద్రబాబుకు ప్రజలు ఎందుకు ఓట్లేస్తారు, ఆయన ఏం చేశారని ప్రశ్నించారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాల్లో ఇన్ని అక్రమాలు జరిగినా, అడ్డుకోవాల్సిన వ్యవస్థలన్నీ మౌనంగా ఉండటం విచారకరమని జగన్ వ్యాఖ్యానించారు.

పలస్తీనాపై దాడులు ఆపండి

(మొదటిపేజీ తరువాయి)

సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోనే ప్రథమ విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. స్వాతంత్ర్య సాధన నాటి నుంచి నేటి వరకు విద్యా రంగ సమస్యలు, సమానత్వం, శాస్త్రీయ విద్య కోసం పోరాటం చేస్తూనే ఉందన్నారు. తెలంగాణలో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి దశాబ్దం గడిచినా, విద్యా రంగంలో పెద్దగా మార్పులు రాలేదని, విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల లోపం, అనేక సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయని విమర్శించారు. తక్షణమే టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులు భర్తీ చేసి, పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి తేవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఆలస్యమవడం వల్ల పేద విద్యార్థుల ఉన్నత విద్య కలగానే మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేజీ టు పీజీ ఉచిత విద్య వాగ్దానాన్ని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. హామీలు అమలు చేయకుంటే పోరాటబాట పడతామని హెచ్చరించారు. సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్, సహాయ కార్యదర్శి అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడు ఉదయ్, ఉప్పల ఉదయ్, మైముద్, పవన్, అజయ్, విప్లవ, విష్ణు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం...

హిమాయత్‌నగర్ అమృత ఎస్టేట్‌లో ఏఐఎస్ఎఫ్ కార్యాలయం వద్ద రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం కావాలని ఆనాడు దేశ వ్యాప్తంగా విద్యార్థులను సంఘటితం చేసి బ్రిటిష్ పాలకులపై తిరుగుబాటు చేసి దేశానికి స్వాతంత్ర్యం సముపార్జనలో కీలకపాత్ర పోషించిందన్నారు. నాటి నుంచి దేశ వ్యాప్తంగా విద్యారంగ సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తుందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ... విద్యను కాషాయికరణ, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ చేసే విధంగా నూతన జాతీయ విద్య విధానాన్ని తీసుకువచ్చిందని విమర్శించారు. నీట్ పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థులకు అన్యాయం జరిగిన పట్టించుకోలేదన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి, రాష్ట్ర మహిళా కన్వీనర్ నాగ జ్యోతి, గ్యార క్రాంతి, అన్వర్, హరీష్, అనిల్, శైలజ, శృతి, అరుణ్, శ్రవణ్ పాల్గొన్నారు.

పౌరసత్వానికి ఆధార్ సరిపోదు

(మొదటిపేజీ తరువాయి)

విచారించింది. ఈ వివాదాన్ని నమ్మకం లేకపోవడానికి సంబంధించిన వ్యవహారంగా పేర్కొంది. 2003 నాటి ఓటర్ల జాబితాల్లో పేర్లు ఉన్నవారు ఎలాంటి పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని కోర్టు దృష్టికి ఎన్నికల సంఘం తీసుకెళ్లింది. మొత్తం 7.9 కోట్ల మంది ఓటర్లలో 6.5 కోట్ల మందికి ఈ వెసులుబాటు ఉన్నట్లు వెల్లడించింది. దీనిపై సుప్రీం ధర్మాసనం స్పందిస్తూ 7.9 కోట్ల మంది ఓటర్లలో 7.24 కోట్ల మంది ఎస్ఐఆర్‌కు స్పందించినాగానీ కోటి మంది ఓటర్లు కనిపించడం లేదు లేదా పేర్లు తొలగించబడ్డాయన్న వాదనకు బలముందని పేర్కొంది. ప్రజలు తమ, తమ తల్లిదండ్రుల జనన ధ్రువీకరణ పత్రాలు లేక ఇబ్బంది పడుతున్నారన్న వాదననూ సర్వోన్నత న్యాయస్థానం కొట్టిపారేసింది. బీహార్‌లో ఎవరి వద్ద కూడా పత్రాలు లేవని ఏదో మాటవరుసగా చెప్పేస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేసింది. బీహార్‌లో ఇలాంటి పరిస్థితి ఉంటే, దేశంలోని మిగతా చోట్ల పరిస్థితి ఏమిటని ప్రశ్నించింది. ఈ క్రమంలోనే వాస్తవాలు, గణాంకాలతో సిద్ధంగా ఉండాలని ఎన్నికల సంఘానికి ధర్మాసనం సూచించింది. పిటిషనర్లలో ఒకరైన ఆర్జేడీ నేత మనోజ్ ఝా తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. ఓ నియోజకవర్గంలో 12 మంది చనిపోయారని ఈసీ పేర్కొంది కానీ, వారు జీవించే ఉన్నారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. మరో సందర్భంలో... బతికే ఉన్న వ్యక్తులను చనిపోయినట్లు ప్రకటించారని ఆరోపించారు. ఇటువంటి ప్రక్రియలో కొన్ని లోపాలు ఉంటాయని ఈసీ తరపున సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీ వాదించారు. చనిపోయిన వ్యక్తులను బతికి ఉన్నట్లు, సజీవంగా ఉన్నవారిని చనిపోయినట్లు ప్రకటించడం వంటి తప్పిదాలను సరిదిద్దవచ్చని, ఇది ముసాయిదా జాబితా మాత్రమేనని పేర్కొన్నారు. సరైన వివరాలు, గణాంకాలతో సిద్ధంగా ఉండాలని సుప్రీం కోర్టు సూచించింది. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభానికి ముందు ఎంతమంది ఓటర్లు ఉన్నారు? గతంలో నమోదైన మరణాలు ఎన్ని? ఇప్పుడు నమోదు చేసిన మరణాల సంఖ్య వంటి వివరాలపై ప్రశ్నలు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపింది. బీహార్ ఎస్ఐఆర్‌లో సామూహికంగా ఓటర్లను తొలగిస్తే తక్షణమే జోక్యం చేసుకుంటామని జులై 29న సర్వోన్నత న్యాయస్థానం పేర్కొన్న విషయం తెలిసిందే. అంతకుముందు జులై 10న విచారణ సందర్భంగా బీహార్‌లో ఎస్ఐఆర్ నిర్వహించాలన్న ఈసీ నిర్ణయంపై స్టే విధించేందుకు నిరాకరించింది. ప్రాథమిక పత్రాలుగా ఆధార్, రేషన్ కార్డుతో పాటు ఓటర్ ఐడీ కార్డును పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. బీహార్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయింది. ఈనెల 1న ముసాయిదా జాబితా వెలువడింది. ఎస్ఐఆర్‌కు ముందు రాష్ట్రంలో 7.9 కోట్ల మంది ఓటర్లు ఉండగా, ముసాయిదాలో ఆ సంఖ్య 7.24 కోట్లకు తగ్గింది. సెప్టెంబర్ 30న తుది జాబితా ప్రకటించనున్నారు. ఈ వ్యవహారంపై ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి.

బండి సంజయ్‌కు కేటీఆర్ లీగల్ నోటీస్

(మొదటిపేజీ తరువాయి)

సాక్ష్యాధారాలు లేవని, ఒక పార్లమెంటు సభ్యుడుగా కేంద్ర మంత్రిగా బాధ్యత కలిగిన పదవుల్లో ఉండి మరొక శాసనసభ్యుడు పైన అసత్య పూరిత అడ్డగోలు వ్యాఖ్యలు చేయడానికి లీగల్ నోటీసులు ఇవ్వక తప్పడం లేదన్నారు. బండి సంజయ్... తనకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని నోటీసులో కేటీఆర్ డిమాండ్ చేశారు. నోటీసు అందిన ఏడు రోజులలోగా ఈ డిమాండ్లను పాటించని పక్షంలో, చట్టపరంగా సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆరోపణల వల్ల కలిగిన నష్టానికి బండి సంజయ్ బాధ్యత వహించాల్సి ఉంటుందని నోటీసులో పేర్కొన్నారు.

ఇంకెంతకాలం జైలులో... సుప్రీం

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. శిక్షాకాలం పూర్తి చేసుకున్న ఖైదీలు ఇంకా జైల్లోనే ఉండటంపై ఆందోళన వ్యక్తం చేసిన సుప్రీం కోర్టు... ఇదే వైఖరి కొనసాగితే దోషి జైల్లోనే మరణిస్తాడని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. పహిల్వాన్‌ను ఇంకా జైల్లోనే ఉంచడంపై ప్రశ్నించిన ధర్మాసనం... ఆయనతో సహా నిర్ణీత జైలు శిక్ష పూర్తయిన దోషులను తక్షణమే విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది. గడువుకు మించి ఇంకా ఎవరైనా దోషులు లేదా నిందితులు జైల్లోనే ఉన్నారా అనే విషయాన్ని తెలుసుకోవాలని, తాజా తీర్పు కాపీలను అన్ని రాష్ట్రాల హోంశాఖ కార్యదర్శులకు పంపించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఢిల్లీలో 2002లో చోటు చేసుకున్న ఓ పరువుహత్య అప్పట్లో సంచలనం రేపింది. నితీశ్ కటారాను పెళ్లి మండపం నుంచే కిడ్నాప్ చేసిన సుఖ్‌దేవ్ పహిల్వాన్ బృందం అతడిని హత్య చేసింది. ఈ కేసులో సుఖ్‌దేవ్‌కు జీవిత ఖైదు పడింది. 2015లో ఈ కేసు విచారించిన ఢిల్లీ హైకోర్టు... శిక్ష తగ్గింపు లేకుండా 20 ఏళ్లపాటు జైల్లోనే ఉండాలని ఆదేశించింది. ఈ ఏడాది మార్చితో శిక్షా కాలం పూర్తికావడంతో తనను విడుదల చేయాలంటూ సుఖ్‌దేవ్ సుప్రీంను ఆశ్రయించాడు. విచారించిన సుప్రీం ధర్మాసనం సుఖ్‌దేవ్ పహిల్వాన్ అలియాస్ సుఖ్‌దేవ్ యాదవ్‌ను విడుదల చేయాలని జులై 29నే అదేశించింది. అయితే, అతడి ప్రవర్తనను విశ్లేషించిన శిక్షా సమీక్ష బోర్డు విడుదల చేసేందుకు నిరాకరించింది. తాజాగా దీనిపై సర్వోన్నత న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. 20 ఏళ్లు పూర్తయినందున పహిల్వాన్ విడుదల సాధ్యం కాదని, శిక్ష తగ్గించాలన్న అభ్యర్థనను ప్రభుత్వం అనుమతించినప్పుడే జైలు నుంచి బయటకు రాగలడని ఢిల్లీ ప్రభుత్వం చేసిన వాదనలను ధర్మాసనం తోసిపుచ్చింది.

జస్టిస్ వర్మపై విచారణకు ముగ్గురు సభ్యుల కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సహా 146 మంది ఎంపీలు సంతకాలు చేసినట్లు స్పీకర్ ఓం బిర్లా చెప్పారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ కమిటీ తన నివేదికను వీలైనంత త్వరగా సమర్పించాలని కోరారు. అవినీతి వ్యతిరేక పోరాటంలో పార్లమెంటు ఐక్యంగా ఉంటుందన్నారు. స్పీకర్ ఏర్పాటు చేసిన కమిటీకి ఘటనకు సంబంధించి సాక్షులను పిలిచి ప్రశ్నించే అధికారం ఉంటుందన్నారు. నివేదికను తొలుత స్పీకర్‌కు సమర్పిస్తారు. ఆ తర్వాత సభలో ప్రవేశపెట్టి దానిపై ఓటింగ్ నిర్వహిస్తారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలో జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటి ఆవరణలో కాలిపోయిన నోట్ల కట్టలు దొరికాయి. మంటలు ఆర్పేందుకు వచ్చిన సిబ్బంది వాటిని గుర్తించారు. ఈ ఘటనపై అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా అంతర్గత విచారణ కోసం ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులతో కమిటీ వేశారు. ఆ కమిటీ నోట్ల కట్టలు దొరికింది వాస్తవమేనని తేల్చింది. ఆ నివేదికను జస్టిస్ వర్మ సుప్రీంకోర్టులో సవాల్ చేయగా... అక్కడ ఆయనకు చుక్కెదురైంది.

సమాచార హక్కు చట్టం దరఖాస్తులు పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో- నిర్మల్ జిల్లా : మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ బుధవారం జిల్లాలో రాష్ట్ర సమాచార కమిషన్ బృందం పర్యటన నేపథ్యంలో శాఖల వారీగా ఇప్పటివరకు నమోదైన దరఖాస్తులు, వాటి పరిష్కారం, పెండింగ్ కేసులు తదితర అంశాలను అధికారులు పరిశీలించాలన్నారు. అన్ని శాఖల్లో పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (PIO) తప్పనిసరిగా ఉండాలని, 4(1) బి రిజిస్టర్‌ను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టం దరఖాస్తులపై కమిషన్ బృందం విచారణ చేపడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేశంలో మొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర -తొర్రూరు : దేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు బందు మహేందర్ అన్నారు. మంగళవారం తొర్రూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో ఆయన పాల్గొని శ్వేత-అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ భారతదేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘమని, స్వాతంత్రం రాకపూర్వమే 1936 ఆగస్టు 12న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని, లక్నో నగరంలోని బెనారస్ యూనివర్సిటీలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య పురుడోసుకున్నదాని,కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘం ఏదైనా ఉన్నదంటే అది ఒక్క ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘమే అని, నాటి నుంచి నేటి వరకు విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వ పాఠశాలలలో కళాశాలలలో మౌలిక సదుపాయాల కల్పించాలని, పెండింగ్ లో ఉన్నటువంటి స్కాలర్షిప్ ,ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని, మెస్ ,కాస్మోటిక్ చార్జీలను ధరలకు అనుగుణంగా పెంచాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, విద్యాశాఖ మంత్రిని వెంటనే కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ ఇచ్చే పిలుపులకు విద్యార్థి లోకం ఏఐఎస్ఎఫ్ ఇచ్చే పిలుపులను విజయవంతం చేయాలని, విద్యార్థులకు అండ, ఏఐఎస్ఎఫ్ జెండా ఎల్లప్పుడూ ఉంటదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కిన్నెర సాయల్, పస్తం సాయి కిరణ్ రాహుల్ ప్రణీత్, సాయి అనుప్, అభినయ్, యకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర-వనపర్తి : దేశ ప్రజల స్వాతంత్ర్యం కోసం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఘన చరిత్ర ఏఐఎస్ఎఫ్ సొంతమని ఏఐఎస్ఎఫ్ వనపర్తి జిల్లా ఇంచార్జ్ నరేష్ అన్నారు. వనపర్తి అంబేద్కర్ చౌక్‌లో ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినం ఘనంగా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ అరుణ పతాకాన్ని రమేష్ ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు నరేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ఇంచార్జ్ రమేష్, మాజీ విద్యార్థినేత గోపాలకృష్ణ మాట్లాడారు. 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ లక్నో బెనారస్ విశ్వవిద్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించింది అన్నారు. నేటికీ 90 వసంతాలు గడిచిందన్నారు. విద్యార్థుల హక్కుల కోసం దేశ స్వాతంత్రం కోసం ఏఐఎస్ఎఫ్ ఆనాడు పోరాడిందన్నారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన చరిత్ర, 90 వసంతాల సుదీర్ఘ ప్రయాణం దేశంలో మరే విద్యార్థి సంఘానికి లేదన్నారు. ఏఐఎస్ఎఫ్ మొదటి మహాసభకు స్వాతంత్ర సమరయోధుడు మహమ్మదల్లి జిన్న అధ్యక్షతన జరిగిందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఏఐఎస్ఎఫ్ ఉద్యమించి తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిందన్నారు.కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని విద్యార్థులకు ఇవ్వవలసిన రూ. 8000 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వలేదన్నారు, వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వ పాఠశాలలు హాస్టళ్లను పెంచాలన్నారు. ఫీజులను నియంత్రించాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరేష్, తాలూకా కార్యదర్శి వంశీ,మాజీ విద్యార్థి నేతలు లక్ష్మీనారాయణ, మహేష్, చందు, విష్ణు, శివ యాదవ్, చరణ్, నరేష్, బన్నీ, సాయి చరణ్, అశోక్, లోకేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ధర్నా

విశాలాంధ్ర -గూడూరు : రైతులు వరి నాట్లు, పత్తి చేనులు వేసి కొన్ని రోజులు గడుస్తున్నా రైతులకు కావలసిన యూరియా సరిపడా లేకపోవడంతో రైతుల పక్షాన బీఆర్ఎస్ మండల పార్టీ మండల కేంద్రంలో మంగళవారం రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు.మండల ప్రధాన కార్యదర్శి నూకల. సురేందర్ మాట్లాడుతూ రైతులకోసం యూరియా అందించకపోవడం వలన కాంగ్రెస్ పాలన నీరుగారిపోతుంది అని చెప్పిన హామీలు చెల్లచెదిరి పోయాయని కాంగ్రెస్ పై విరుచుకుపడ్డారు.ఇకనైనా మండల ప్రజలకు సరిపడా యూరియా సకాలంలో సరఫరా చేయాలనీ డిమాండ్ చేసారు.ఏవో అబ్దుల్ మాలిక్ తెలిపిన సమాచారం మేరకు మండలనికీ మొదటి దఫా 846 మెట్రికుల యూరియా సరఫరా అయిందనీ,రెండవ దఫా లో రైతులు కావలసిన వరకు మాత్రమే యూరియా వాడాలని కృత్రిమ యూరియా కొరత సృష్టించవద్దని మూడో దఫా లో నానో యూరియా వాడాలని అయన సలహాలు ఇచ్చారు.పట్టణ అధ్యక్షులు చీదురు వెంకన్న సీనియర్ నాయకులు కటార్ సింగ్ మాజీ కో ఆప్షన్ ఎండి రహీం సంపంగి రామన్న బొంత రామన్న దామర స్టాలిన్ బానోత్ విజయ్ బెజ్జం రమేష్ వెంకట్ రెడ్డి మాజీ ఎంపీటీసీ స్వాతి రవి మండల కుమార్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం :ఎమ్మెల్యే

విశాలాంధ్ర- పినపాక: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పథకాలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వివరించారు. మంగళవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా తోగ్గూడెం, పినపాక, బోటిగూడెం, ఉప్పాక గ్రామాల్లో రూ 52 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు. అనంతరం పినపాక జెడ్పి హైస్కూల్లో ఐటిసి అందించిన 41 సైకిళ్ల ను విద్యార్థినులకు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయ సముదాయంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 3 లక్షలతో నిర్మించనున్న నూతన కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం పినపాక ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మికంగా సందర్శించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించేందుకే ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోగుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని డాక్టర్లు సిబ్బందికి సూచించారు. ప్రస్తుతం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు బాగా ఉన్నాయని వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. ఏజెన్సీ గ్రామాల్లో అభివృద్ధితో పాటు విద్య, వైద్యం, తాగునీరు, సాగునీరు, ప్రజారోగ్యంకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గానికి రూ 300 కోట్లు వెచ్చించి 6 వేల ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామన్నారు. ఇందుకు సహకరించిన రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ గొంది గోపాలకృష్ణ, ఎంపీడీవో సునీల్ కుమార్, పి ఆర్ డి ఈ వశ్యా నాయక్, ఏ.ఈ వంశీ, హౌసింగ్ ఏఈ వినీత, విద్యుత్ ఏ. ఈ వేణుగోపాల్, ఎంఈఓ కొమరం నాగయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు వి. లక్ష్మారెడ్డి, జి. వెంకట రెడ్డి, పేరం వెంకటేశ్వర్లు,కొర్సా ఆనంద్, ఎస్ తిరుపతి రెడ్డి, జి శ్రీనివాస్ రెడ్డి, పరిమి వెంకటేశ్వరరావు తోలెం కళ్యాణి, ఈసం భవతి, కొర్సా కృష్ణంరాజు, సాంబశివరావు, సతీష్ చారి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటాలు : అజిత్

విశాలాంధ్ర - కొత్తగూడెం : విద్యారంగ సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ పిలుపునిచ్చారు. మంగళవారం అ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏఐఎస్ఎఫ్ 90 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా, అజిత్ హాజరై శ్వేత అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకపూర్వమే దేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో మహానగరంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్, ఆజాద్ లాంటి ఇంకా ఎందరో వీరుల ఆశయ సాధన కోసం బబ్బుద్దీన్ బాసు, ప్రేమ్ నారాయణ భార్గవ్‌ల నాయకత్వాన 1936 ఆగస్టు12 న అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆవిర్భవించిందనీ వివరించారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నుంచి మాతృభూమి విముక్తి కై సాగిన వీరోచిత స్వాతంత్ర్య ఉద్యమంలో పొత్తిళ్లలోనే పిడికిళ్లు బిగించి స్వాతంత్ర్యం మా జన్మ హక్కు " అంటూ నినదించి పోరాడిన ఎందరో విద్యార్థి విప్లవ కిషోరులు బలిదానం చేసిన చరిత్ర కలిగిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని చెప్పారు. ప్రభుత్వ విద్యా పరిరక్షణ, శాస్త్రీయ విద్య, కామన్ విద్యావిధానం అమలుపై నిరంతరం పోరాటాలు సాగిస్తూ 89 ఏళ్లుగా విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉద్యమాలు పోరాటాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యావ్యతిరేక విధానాలపై ఏఐఎస్ఎఫ్ గా పోరాడుతామని శాపథం చేసారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వినయ్, సంజయ్, నవిత, సోబిత, ప్రణయ్, వంశీ, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

చోరీలపై అప్రమత్తంగా ఉండాలి :డిఎస్పీ

విశాలాంధ్ర - మణుగూరు : అశ్వాపురం మండలంలోని భారజల కర్మాగారం, మణుగూరు పరిధిలో గల సింగరేణి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ కాలనీలల్లో జరిగే చోరీల పట్ల సెక్యూరిటీ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిఎస్పీ రవీందర్ రెడ్డి అన్నారు. మంగళవారం సబ్ డివిజనల్ కార్యాలయంలో డిఎస్పీ సెక్యూరిటీ అధికారులతో దొంగతనాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. జల్సాలకు అలవాటు పడి పరిశ్రమల్లో నిల్వఉంచిన విలువైన ఇనుము, రాగి వస్తువుల తోపాటు తాళాలు వేసిన ఇండ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. నిరంతరం సెక్యూరిటీ సిబ్బందితో పర్యవేక్షించాలన్నారు. ఆయా కాలనీలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. తాళాలు వేసిన ఇళ్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. రాత్రి సమయంలో విధులు నిర్వర్తించే సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండేలా ఇంచార్జులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు సిఐ నాగబాబు, అశ్వాపురం సిఐ, సింగరేణి సెక్యూరిటీ అధికారి శ్రీనివాస్, బిటీపీఎస్, హెవీ వాటర్ ప్లాంట్ సెక్యూరిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : పాల్వంచలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సౌకర్యంగా, శుభ్రమైన విద్యావాతావరణం కల్పించడమే లక్ష్యంగా ప్రతి పనిని వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. డైనింగ్ హాల్, అక్కడి నుంచి సౌకర్యంగా నడవడానికి పాత్‌వే నిర్మాణం త్వరగా చేపట్టాలని సివిల్ విభాగం అధికారులను ఆదేశించారు. ప్రాంగణం ఆహ్లాదకరంగా మారేందుకు చుట్టూ నీడనిచ్చే పెద్ద చెట్లు, వెదురు మొక్కలు నాటడంతో పాటు పండ్ల చెట్లు, ఔషధ మొక్కలను ప్రణాళి కబద్ధంగా పెంచాలని సూచించారు. ఈ మొక్కలు విద్యార్థుల ఆరోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడతాయన్నారు. డైనింగ్ టేబుల్స్, కుర్చీలు ఏర్పాటు చేయడంతో పాటు వ్యర్థ పదార్థాల సమర్థమైన నిర్వహణ కోసం కంపోస్ట్ పిట్స్ నిర్మాణం, చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేయడానికి ప్రత్యేక బుట్టలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ సుజాత, పాఠశాల ప్రిన్సిపల్ మైథిలి, ఇంజనీరింగ్ అధికారులు, నవభారత్ అధికారులు పాల్గొన్నారు.

మూసి డ్యామ్ సందర్శన

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో : మూసి నీటి ప్రవాహం వల్ల కేతేపల్లి మండలం భీమారం వద్ద ఉన్న లో లెవెల్ కాజ్ వేపై రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి చెప్పారు.మంగళవారం ఆమె జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి మూసి డ్యామ్‌ను సందర్శించారు. నీటిపారుదల శాఖ ,ఇంజనీరింగ్ అధికారులతో మూసి ప్రాజెక్టు ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో, అలాగే ప్రాజెక్టు వద్ద ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గేట్లకు సంబంధించి, ఇతర సమస్యలు ఏమైనా ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ప్రస్తుతం ప్రాజెక్టు నుండి బయటికి పంపిస్తున్న నీటి వివరాలను అడగగా 13000 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు జిల్లా కలెక్టర్ కు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీలు కేతేపల్లి మండలంలోని భీమారం గ్రామం వద్ద ఉన్న లో లెవెల్ కాజ్ వే ను తనిఖీ చేశారు.మూసి నుండి ఎక్కువ నీరు విడుదల చేసినా, లేదా ఎగువ ప్రాంతాలలో కురిసే వర్షం కారణంగా నీటి ప్రవాహం ఎక్కువైతే కాజ్ వే పై నుండి నీరు ప్రవహిస్తుందని, 20 వేల క్యూసెక్కులు మూసి నుండి వదిలినప్పుడు మాత్రమే సమస్య ఉత్పన్నం అవుతుందని ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ఈ విషయం పై జిల్లా కలెక్టర్,ఎస్ పి లు స్పందిస్తూ భీమారం లో లెవెల్ కాజ్ వే గుండా ప్రయాణం చేసే వారిని అవసరమైతే ముందుగానే అప్రమత్తం చేయాలని, భీమారం, కొప్పోలు నుండి రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, వరద ప్రవాహం పెరిగినప్పుడు అవసరమైతే కాజ్ వే పై రాకపోకలు నిలిపివేసి పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.మూసి ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్ .వెంకటరమణ, డిఇ చంద్రశేఖర్, జేఈ లు కీర్తి, కేతేపల్లి డి ఇ వాణి, ఎంపిడిఓ శ్రీనివాస సాగర్, తహసిల్దార్, తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర-నేరేడు చర్ల : స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. మంగళవారం ఆయన సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో స్పందన జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ 90 ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ చదువుతూ పోరాడు- చదువుకై పోరాడు అని భారత దేశంలో విద్యార్థుల కొరకు ఏర్పాటు చేయబడ్డ తొలి సంఘం ఏఐఎస్ఎఫ్ అని...అది విద్యార్థి ఉద్యమ పోలికేక అని స్వాతంత్ర ఉద్యమంలో ఆ తరువాత అనేక ప్రజా ఉద్యమాలలో కార్యకర్తలు ఆత్మబలిదానం చేశారని విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని నినదించి విశాఖ ఉక్కు సాధనలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థులు ఆత్మబలిదానం వల్లనే సాధించబడ్డదని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు కళాశాలను ప్రభుత్వం తమ ఆధీనంలోకి తెచ్చుకొని ఆయా కాలేజీల్లో పనిచేస్తున్న సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఇప్పటిదాకా రాష్ట్ర ప్రభుత్వం బకాయిపున్న నాలుగు వేల కోట్ల రూపాయల ఫీజు రియంబర్స్మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు కొమ్మరాజు వెంకట్ మాట్లాడుతూ నేటితరం విద్యార్థులు, నాటి పోరాట యోధుల వారసులని ఇటీవల కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టినందుకు ప్రయత్నం చేస్తున్నదని విద్యను కాషాయీకరణ చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను సహించబోమని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు పరికె భరత్, దళిత నాయకుడు యేసుమళ్ళ సతీష్, తులసి అభ్యాస్ సాయి రఘు సందీప్ , యశ్విత రూప మైధిలి తేజశ్రీ పాల్గొన్నారు.

పదేళ్ల వారంటీతో న్యూ నిస్సాన్ మాగ్నైట్

వరంగల్: నిస్సాన్ మోటార్ ఇండియా కొత్త నిస్సాన్ మాగ్నైట్ కోసం 10 సంవత్సరాల పొడిగించిన వారంటీ ప్రణాళికను ప్రారంభిం చిందని నిస్సాన్ మోటార్ ఇండియా ఎండీ సౌరాబ్ వాట్సా తెలిపారు. ఇది ఒక విభాగం మొదటి కస్టమర్ కేంద్రీకృత చొరవ అని, ఇది నాణ్యత, విశ్వసనీయత బ్రాండ్ యొక్క దీర్ఘకాలిక నిబద్ధతను నొక్కి చెబుతుందన్నారు. కొత్త నిస్సాన్ మాగ్నైట్ విజయం సాధించిన వెంటనే ఈ ప్రణాళిక ప్రకటించబడిందన్నారు. మొత్తం ప్రయాణీకుల భద్రతపై 5 స్టార్ రేటింగ్ సాధించిందని, ఏఓపీ (వయోజన ఆక్యుపెంట్ సేఫ్టీ) పై ఖచ్చితమైన 5-స్టార్ రేటింగ్‌తో ఈ ప్రణాళిక 3 సంవత్సరాల ప్రామాణిక వారంటీని అందిస్తుందన్నారు. ఇది 10 సంవత్సరాల పొడిగించిన వారంటీ ప్రణాళిక యొక్క సౌకర్యవంతమైన ప్రణాళికల ద్వారా విస్తరించబడుతుందన్నారు. ఈ 10 సంవత్సరాల విస్తరించిన వారంటీ ప్రణాళిక వినియోగదారులకు ఎక్కువ విశ్వాసం మరియు మనశ్శాంతిని ఇవ్వడానికి రూపొందించబడిందన్నారు. ఇది నిస్సాన్ యొక్క కస్టమర్ సేవా వాగ్దానంలో భాగం, ఇందులో నిస్సాన్ కస్టమర్లకు స్థిరమైన భవిష్యత్తును విలువ, నమ్మకం మరియు లక్ష్యంగా ఉన్న సేవను కలిగి ఉంటుందన్నారు. ఇది జపనీస్ డీఎన్ఏ, నాణ్యతా ప్రమాణాలు, బలమైన విశ్వసనీయత మరియు ప్రీమియం హస్తకళ మరియు సాంకేతికత యొక్క నిస్సాన్ యొక్క ప్రపంచ వాగ్దానాన్ని బలోపేతం చేస్తుందన్నారు. కొత్త నిస్సాన్ మాగ్నైట్ కురో స్పెషల్ ఎడిషన్‌ను సైతం ప్రారంభించినట్టు చెప్పారు. నిస్సాన్ యొక్క 10 సంవత్సరాల పొడిగించిన వారంటీ ప్రణాళికతో, కస్టమర్లు 10 సంవత్సరాల వరకు పూర్తి మనశ్శాంతిని పొందవచ్చు అని, సమగ్ర కవరేజ్ ఏ నిస్సాన్ అధికారం కలిగిన సేవా వర్క్‌షాప్‌లలో దేశవ్యాప్తంగా నగదు రహిత మరమ్మతులను అందిస్తుందన్నారు. క్లెయిమ్‌ల సంఖ్య లేదా విలువపై పరిమితి లేదని, నిజమైన నిస్సాన్ విడి భాగాలను ఉపయోగించి అధిక నాణ్యత సేవకు హామీ ఇచ్చేటప్పుడు, మరమ్మత్తు ఖర్చులపై గణనీయమైన పొదుపులను నిర్ధారిస్తుందన్నారు. అదనంగా, విస్తరించిన వారంటీ ప్రణాళికను నిస్సాన్ ఫైనాన్స్ ద్వారా కొత్త వాహనం కొనుగోలుతో పాటు సులభంగా నిధులు సమకూర్చవచ్చు అని చెప్పారు. "కొత్త నిస్సాన్ మాగ్నైట్ భారతీయ కస్టమర్లకు నాణ్యత, విశ్వసనీయత, భద్రత మరియు దీర్ఘకాలిక విలువకు చిహ్నంగా ఉద్భవించిందని, మరియు గ్లోబల్ ఎన్‌సిఎపి నుండి ప్రతిష్టాత్మక 5 స్టార్ భద్రతా రేటింగ్‌తో ఉందని అన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర- ములుగు జిల్లా బ్యూరో: రాబోయే 4 రోజులు భారీ వర్షాలు, వరదలు వచ్చే అవకాశం ఉందని,వాతావరణం సూచనల దృష్ట్యా, ములుగు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పోలీస్ శాఖ ఏటూరునాగారం ఏ ఎస్పీ శివం ఉపాధ్యాయ ఒక ప్రకటలో పేర్కొన్నారు. ఈ సందర్బంగా ఏ ఎస్పీ శివం ఉపాధ్యాయ మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదలు సంభవించే అవకాశం ఉందని,ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని, ఎవరు కూడా బయటికి వెళ్ళవద్దని, అత్యవసరం ఉంటే తప్పు, బయటికి రావద్దని ప్రజలను కోరారు. స్థానిక వార్తా ఛానెల్‌లు, అధికారిక ప్రభుత్వ వెబ్‌సైట్‌లు,వాతావరణ యాప్‌ల వంటి విశ్వసనీయ మూలాల ద్వారా తాజా వాతావరణ నివేదికలు,వరద హెచ్చరికలతో అప్‌డేట్‌గా ఉండండాలని విజ్ఞప్తి చేశారు.మీకు ఆహారం, నీరు, మీ పొరుగువారి కోసం, ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు ప్రత్యేక అవసరాలు ఉన్నవారి కోసం చూడండాలని, అవసరమైతే సహాయం అందించండి ఏదైనా అత్యవసర పరిస్థితి ఉంటే వెంటనే అధికారులకు నివేదించాలని తెలిపారు. వరదలు ఉన్న రోడ్లు లేదా తక్కువ స్థాయి వంతెనల వంతెనలను దాటడానికి ప్రయత్నించవద్దని, వరద నీటి లోతు మరియు వేగం మోసపూరితంగా ప్రమాదకరంగా ఉండవచ్చని, ఏటూరు నాగారం పోలీసులు, స్థానిక అధికారులు అత్యవసర సేవలతో కలిసి పరిస్థితిని పర్యవేక్షిం చడానికి, సకాలంలో సహాయం అందించడానికి పని చేస్తున్నారన్నారు.మా సంఘం యొక్క భద్రత, శ్రేయస్సును నిర్ధారించడంలో మీ సహకారం, అప్రమత్తత చాలా కీలకం అని, ఏదైనా అత్యవసర పరిస్థితుల కోసం, దయచేసి స్థానిక పోలీసు స్టేషన్‌ను సంప్రదించండి లేదా ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ నంబర్ 100కి డయల్ చేయాలని కోరారు.

సీపీఐ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయండి

విశాలాంధ్ర బ్యూరో-సంగారెడ్డి : సీపీఐ రాష్ట్ర 4వ మహాసభలను ఈనెల 20 నుంచి 22 వరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని గాజుల రామారావు మహారాజ గార్డెన్స్‌లో నిర్వహించడం జరుగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తాజోద్దీన్ తెలిపారు. మంగళవారం సదాశివపేటలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర 4వ మహాసభల వాల్ పోస్టర్‌లను సీపీఐ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తాజోద్దీన్ మాట్లాడుతూ సీపీఐ తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభలను ఈనెల 20 నుండి 22 వరకు హైదరాబాద్ గాజులరామారం మహారాజా గార్డెన్‌లో జరగనున్నాయన్నారు. ఈ సమావేశానికి సంగారెడ్డి జిల్లా సదాశివపేట కొండాపూర్ మునిపల్లి మండలాల నుంచి సిపిఐ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకుల లక్ష్మి, శివలీల బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసు నిందితుడికి రిమాండ్

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో : ములుగు జిల్లా కన్నాయిగూడెంలోని సర్వాయ్ గ్రామంలో జరిగిన హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి, న్యాయస్థానం ఎదుట హాజరుపరిచిన్నట్లు ఏటూరునాగారం సిఐ అనుముల శ్రీనివాస్, కన్నాయిగూడెం ఎస్ఐ ఈ వెంకటేష్ ఒక ప్రకటన లో పేర్కొన్నారు. సిఐ తెలిపిన కేసు వివరాలు ఈ విధంగా ఉన్నాయి.మూడు రోజుల క్రితం కన్నాయిగూడెం మండలం సర్వాయ్ గ్రామంలో జరిగిన మడి రాజబాబు (40) హత్య కేసులోని నిందితుడైన కొరం రంజిత్‌ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో పూర్తి విచారణ జరిపిన పోలీసులు, సాక్ష్యాలను సేకరించి, నిందితుడిని అరెస్టు చేశారు. అనంతరం మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. నిందితుడి బావ దగ్గర ఇంటి నిర్మాణ పనులు చేసి తనకు రావాల్సిన కూలీ పైసలు అడిగగా, పని చేసిన మిగతా కూలీ వారికి డబ్బులు ఇచ్చి, మృతుడు రాజ బాబుకి ఇవ్వడానికి నిరాకరించగా, అట్టి కూలీ పని డబ్బుల గురించి నిందితుడి బావని నిలదీయగా, అట్టి విషయాన్ని మనసులో పెట్టుకుని, తన బావని డబ్బులు అడుగుతావా అని, కోడిని కోసే కత్తితో, రాజబాబు ప్రక్కటెముకల భాగంలో పొడవగా, తీవ్ర రక్త స్రావమై మృతి చెందాడు. అనంతరం నిందితుడు పారిపోగా, ఏటూరు నాగారం సిఐ అనుముల శ్రీనివాస్ , కన్నాయిగూడెం ఎస్సై ఈసగాల వెంకటేశ్, సిబ్బంది సోమవారం సాయంత్రం నిందితుడినీ పట్టుకుని, పూర్తి విచారణ జరిపి, అనంతరం నిందితుడు కొరం రంజిత్‌ని రిమాండ్ తరలించారు.

ప్రమాదాల నివారణకు తనిఖీలు చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: రసాయన, ఔషధ పరిశ్రమలలో ప్రమాదాలు సంభవించకుండా తనిఖీలు నిర్వహించి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఫ్యాక్టరీలు, రసాయన పరిశ్రమల్లో భద్రతపై జిల్లా స్థాయి కమిటీతో సమావేశం నిర్వహించారు. గత జూన్ 30న సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో సంభవించిన అతిపెద్ద విస్ఫోటనాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఫ్యాక్టరీలు, ప్రత్యేకించి రసాయన పరిశ్రమలు, ఔషధ యూనిట్లలో ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులు భద్రతపై దృష్టిసారిస్తూ కర్మాగారాలలో పనిచేసే కార్మికుల ఫోన్ నంబర్స్, పూర్తి సమాచారం యాజమాన్యం దగ్గర ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవోలు రమాదేవి, మహిపాల్ రెడ్డి, జై చంద్ర రెడ్డి, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మోహన్ బాబు, డైరెక్టర్ ఆఫ్ బాయిలర్స్ శ్రీనివాసరావు, కర్మ గారాల జిల్లా ఉప ప్రధాన అధికారి లక్ష్మీ కుమారి, జిల్లా పరిశ్రమల మేనేజర్ ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి : సీపీఐ

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో త్రాగునీటి సమస్య, పారిశుధ్యంపై అధికారులు ప్రేత్యేక ద్రుష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపాలని సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య అధికారులను కోరారు. శంకుస్థాపనలు పూర్తయిన రోడ్లు, డ్రైన్లు, ప్రభుత్వ భవనాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్ లో మంగళవారం జరిగిన సిపిఐ కొత్తగూడెం పట్టణ ముఖ్య నాయకుల సమావేశంలో అయన మాట్లాడారు. వర్షాలు కురుస్తుండటంతో పారిశుద్ధ్యం లోపించి ప్రజలు అనారోగ్యం భారినపడుతున్నట్లు తెలిపారు. తక్షణమే అధికారులు ప్రేత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. పట్టణంలో త్రాగునీటి సమస్య ఉన్న వార్డులు, బస్తీలను గుర్తించి సమస్యకు పరిష్కరించాలన్నారు. ఈనెల 16న కొత్తగూడెం పట్టణ ఏఐకెఎస్ మహాసభ నిర్వహిస్తున్నామని, రైతులు పాల్గొనాలని కోరారు. గెద్దాడు నగేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు మాచర్ల శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, భూక్యా శ్రీనివాస్, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కల్తీ విత్తనాల విక్రేతలపై కఠిన చర్యలు

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహబూబాబాద్: నాణ్యతలేని కల్తీ విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, వైద్య సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా (ఇన్చార్జి) కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు. మంగళవారం జిల్లాలోని కేసముద్రం మండల కేంద్రంలో ఓలం బస్వరాజం ఎరువుల షాపులో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎరువుల స్టాక్ వివరాల రిజిస్టర్‌ను, ఆన్లైన్ ద్వారా కేటాయించిన స్టాక్ వివరాలు, ఎరువుల తేదీ తదితర అంశాలను ఆయన స్వయంగా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ , ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి: కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని, మాదకద్రవ్యాలు, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చెయ్యాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓ సి కార్యాలయంలో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో నమోదవుతున్న ఎన్‌డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాధక ద్రవ్యాల వాడకం, నియంత్రణ చర్యలు, శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు, నియంత్రణ చర్యలపై జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తొ కలిసి చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్, మాదక ద్రవ్యాల నియంత్రణకు నిర్లక్ష్యం చేయకుండా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. జిల్లాలో ఉన్న విద్యాలయాల్లో మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై వైద్య అధికారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బానిసలైన వారికి గుర్తించి ప్రత్యేక వైద్యం అందించాలన్నారు. ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో విద్యార్థులకు, యువతకు, ప్రజల కు, విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. యువత గంజాయి డ్రగ్స్‌వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. విద్యా సంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేయ్యాలని కోరారు. ఈ సమావేశం లో జడ్పీ సి ఈ ఓ నాగలక్ష్మి, ఇంటర్మీడిట్ అధికారి వేంకటేశ్వరరావు, జిల్లా వైద్య శాఖ అధికారి జయలక్ష్మి, రవాణా శాఖ అధికారి వెంకటరమణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కూలింగ్ ఫ్యాన్‌తో ఒప్పో ఏకైక స్మార్ట్‌ఫోన్ల విడుదల

విశాలాంధ్ర/ఖమ్మం: ఒప్పో ఇండియా ఒప్పో కే13 టర్బో సిరీస్ 5జీని ఆవిష్కరించింది. ఇందులో ఒప్పో కే13 టర్బో ప్రో 5జీ, ఒప్పో కే13 టర్బో 5జీ ఉన్నాయి. భారతదేశంలో అంతర్నిర్మిత కూలింగ్ ఫ్యాన్‌ను కలిగి ఉన్న మొట్టమొదటి స్మార్ట్‌ఫోన్లు, స్మార్ట్‌ఫోన్ థర్మల్ నిర్వహణలో కొత్త బెంచ్మార్క్‌ను నెలకొల్పాయి. పనితీరు కోరుకునేవారు, మల్టీ- టాస్కర్ల కోసం రూపొందిన ఈ సిరీస్ గేమింగ్, భారీ మల్టీ టాస్కింగ్, విస్తరించిన బహిరంగ వినియోగం కోసం ఉద్దేశించబడింది. అధునాతన యాక్టివ్, పాసివ్ థర్మల్ డిజైన్, శక్తివంతమైన ప్రాసెసర్లు, 80డబ్ల్యు సూపర్వూక్‌తో కూడిన భారీ 7000ఎంఏహెచ్ బ్యాటరీతో అమర్చబడింది.ఫాస్ట్ ఛార్జింగ్, 120హెచ్‌జెడ్ కంటికి అనుకూలమైన ఈ-స్పోర్ట్స్ లెవల్ ఫ్లాట్ స్క్రీన్, కే13 టర్బో సిరీస్ అత్యంత డిమాండ్ ఉన్న సందర్భాలలో కూడా స్థిరమైన, అధిక-పనితీరు అనుభవాలను అందిస్తుంది. వీటి ధరలు 8జీబీ+128జీబీ వేరియంట్ రూ.27,999, 8జీబీ+256జీబీ వేరియంట్ రూ.29,999 ప్రారంభ ధరకు అందుబాటులో ఉన్న ఒప్పో కే13 టర్బో 5జీ మూడు రంగుల ఎంపికలలో అనగావైట్ నైట్, పర్పుల్ ఫాంటమ్, మిడ్నైట్ మావెరిక్ రంగులలో అందుబాటులో ఉంటాయి.

సంపాదకీయం

రోడ్డెక్కిన ప్రతిపక్ష ఎంపీలు

ఓట్ల దొంగతనానికి సంబంధించిన ఏ ప్రశ్నలకూ సమాధానం రానందువల్ల ప్రతిపక్షాలు సోమవారం ఐక్యంగా రోడ్డెక్కాల్సి వచ్చింది. పార్లమెంట్ నుంచి ఎన్నికల కమిషన్ ప్రధాన కేంద్ర కార్యాలయం దాకా దాదాపు 300 మంది ప్రతిపక్ష ఎంపీలు తలపెట్టిన యాత్రను ప్రభుత్వం అడ్డుకుంది. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్, ప్రియాంక గాంధీతో సహా నిరసన తెలియజేస్తున్న ఎంపీలందరినీ అరెస్టు చేసి ఆ తరవాత వదిలిపెట్టారు. దీనివల్ల ప్రతిపక్షాల నిరసనను అడ్డుకుని ఉండొచ్చు కానీ ఓట్ల దొంగతనంపై లేవనెత్తిన ప్రశ్నలకైతే సమాధానం రానే లేదు. ఓట్ల దొంగతనం గురించి రాహుల్ గాంధీ నిర్వహించిన మీడియా సమావేశం తరవాత ఈ పోరాటం ప్రతిపక్షాల ఐక్య పోరాటానికి ప్రతీకగా తయారైంది. ప్రతిపక్షాలు మాయమై పోయాయి అని అంగలార్చే వారికి ప్రతిపక్షాల సత్తా ఏమిటో అర్థమై ఉండాలి. 2024 సార్వత్రిక ఎన్నికలను ప్రతిపక్షాల నుంచి లాగేసుకున్న విషయం మాత్రం రూఢి అయిపోయింది. దీనివల్లే ఓడిపోతున్న అధికారపక్షం 240 స్థానాలు సంపాదించి ఇతర ఎన్.డి.ఎ. పక్షాల మద్దతుతో మోదీ మూడవసారి అధికారంలోకి రావాల్సి వచ్చింది. "ఈ సారి 400 స్థానాలు" అన్న మోదీ నినాదం గాలిలో కలిసిపోయింది. ఓట్లు దొంగతనం చేసి మోదీ అధికారం సంపాదించుకున్న అంశాన్ని ప్రతిపక్షాలు ఎలుగెత్తి చాటగలిగాయి. అధికార పక్షం మోసాలను రాహుల్ గాంధీ 15 నెలల తరవాత బయట పెట్టగలిగారు. ఓట్ల దొంగతనం ఎలా జరుగుతోందో నిరూపించుకోవడానికి ఆయన తన బృందంతో సహా ఆరు నెలలు శ్రమపడితే తప్ప వాస్తవాలను సేకరించి చూపడం సాధ్యం కాలేదు. రాహుల్ చూపిన ఓట్ల చోరీ కేవలం ఒక లోకసభ నియోజకవర్గ పరిధిలోని ఒకే ఒక్క శాసనసభా నియోజక వర్గానికి సంబంధించినవి కావొచ్చు. ప్రతి నియోజకవర్గంలోనూ మోదీ నాయకత్వంలోని బీజేపీ ఓట్లు దొంగిలించిందని ఎవరూ వాదించలేదు. కొన్ని నిర్దిష్ట నియోజకవర్గాలలో అక్రమాలకు పాల్పడి ప్రతిపక్షాల విజయావకాశాలను ఎలా దెబ్బ తీశారో రాహుల్ గాంధీ రుజువు చేయగలిగారు. నిష్పాక్షికంగా, ఒక తగవరిలా వ్యవహరిస్తూ ఎన్నికలు నిర్వహించి ప్రజాస్వామ్య పునాదులను పటిష్ఠం చేయవలసిన ఎన్నికల కమిషన్ బీజేపీకి ఉపాంగంగా మారిన తీరు బట్టబయలై పోయింది. రాహుల్ పడ్డ శ్రమవల్లే ప్రతిపక్షాలు మళ్లీ ఏకం కాగలిగాయి. ఇతరత్రా ప్రతిపక్షాల ఐక్యత అంత కొట్టొచ్చినట్టుగా కనిపించకపోవచ్చు. ప్రతిపక్షాలు ఏర్పాటు చేసిన "ఇండియా" ఐక్య సంఘటన బలంగా ఉన్నట్టు మామూలు జనానికి కనిపించకపోవచ్చు. కానీ పార్లమెంటులో మాత్రం ప్రతిపక్షాలు తిరుగులేని ఐక్యతను ప్రదర్శించగలుగుతున్నాయి. ఈ ఐక్యతను చాటి చెప్పడానికే "ఇండియా" ఐక్య సంఘటనకు చెందిన 300 మంది ప్రతిపక్ష ఎంపీలు సోమవారం రోడ్డెక్కవలసి వచ్చింది. ప్రతిపక్షాలు మాయమైపోయాయి అని వాదిస్తూ వచ్చిన వారికి "ఇండియా" ఐక్య సంఘటన సమైక్యతను ప్రదర్శించడం ఆశ్చర్యం కలిగించవచ్చు. కానీ ప్రతిపక్షాల ఐక్యతా ప్రభావం ఏమిటో అందరికీ తెలిసిపోయింది. మహారాష్ట్ర, హర్యానా ఎన్నికలలోనూ ఎన్నికల కమిషన్ ఆసరాగా ఓట్ల దొంగతనం జరిగిందని, బిహార్‌లోనూ ఎన్నికల జాబితా సమూల సవరణ కూడా బీజేపీకి విజయం సాధించి పెట్టడానికేనని ప్రతిపక్షాలు రుజువు చేయగలిగాయి. ఇటీవలి మీడియా సమావేశంలో రాహుల్ వెల్లడించిన వివరాలపై ప్రమాణ పత్రం దాఖలు చేస్తే తప్ప ఆయన ఆరోపణలను పరిగణించబోమని ఎన్నికల కమిషన్ వాదిస్తోంది. ప్రమాణ పత్రాలు, ఎఫ్.ఐ.ఆర్.ల బెదిరింపులకు ప్రతిపక్షాలు జడవబోమని తాజా పరిణామాలు నిరూపిస్తున్నాయి. అటో ఇటో తేల్చుకోవడానికే ప్రతిపక్షాలు సిద్ధంగా ఉన్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ (ఇ.డి) దాడులకు భయపడబోమని ప్రతిపక్షాలు స్పష్టం చేయగలిగాయి. ప్రతిపక్షాలు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పే సత్తా ఎన్నికల కమిషన్ కు లేదు. అందుకే ప్రతిపక్షాల నిరసన ప్రదర్శనను భగ్నం చేశారు. అంత మాత్రం చేత ప్రతిపక్షాలు భయపడబోవని, వెనకడుగు వేయబోవని, సోమవారం నాటి ఎంపీల నిరసన ప్రదర్శనవల్ల ప్రతిపక్షాలు ఐక్యంగా ఉంటే ఏం సాధించగలవో తేలిపోయింది. ప్రతిపక్షాల పోరాటం కేవలం రాజకీయమైంది కాదు. ఒక మనిషికి ఒకే ఓటు అన్న సూత్రం నిక్కచ్చిగా అమలు చేసే దాకా విశ్రమించేది లేదని ప్రతిపక్షాలు ఆచరణలో నిరూపించాయి. ఈ పోరాటం రాజ్యాంగ విలువల పరిరక్షణకు కూడా ఉపకరిస్తుంది.

తాము నిష్కళంకులం అని అధికార పక్షం భావిస్తూ ఉంటే ప్రతిపక్ష ఎంపీలను ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యాలయం దాకా నిరసన యాత్ర నిర్వహించడానికి అనుమతించాల్సింది. ఆ శక్తి లేదు కనకే ఆ నిరసనను భగ్నం చేయడానికి ప్రయత్నించారు. అయినా ప్రతిపక్షాల పోరాటం ఆగే అవకాశం లేదు. తృణమూల్ కాంగ్రెస్, సమాజ్ వాది పార్టీ కూడా రాహుల్ లేవనెత్తిన ప్రశ్నలనే లేవనెత్తాయి. శరద్ పవార్ నాయకత్వంలోని ఎన్.సి.పి., దిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ఇవే ప్రశ్నలు లేవనెత్తాయి. ఇప్పుడు రాహుల్ గాంధీ ప్రమాణపత్రం అందజేయాలని ఒత్తిడి చేస్తున్న ఎన్నికల కమిషన్ ఇంతకు ముందే సమాజ్ వాదీ పార్టీ ప్రమాణ పత్రం అందించినా ఏ చర్యా తీసుకోలేదు. శక్తిమంతంగా ప్రశ్నలు చుట్టుముట్టినప్పుడు ఎన్నికల కమిషన్ సాకులకోసం వెతుకుతోంది. ఇంతకు ముందూ ప్రతిపక్షాలు ఇవే ప్రశ్నలు వేశాయి. కానీ తరవాత ఆ ప్రశ్నలను అంతగా పట్టించుకోలేదు. ప్రభుత్వ ఒడిలో కూర్చునే ప్రధాన మీడియా సంస్థలు ఈ ప్రశ్నలను పాతరేసే ప్రయత్నం చేస్తున్నాయి. రాహుల్ ముందుంచిన సాక్ష్యాధారాలవల్ల ఓట్ల దొంగతనం అంశాన్ని మరింత బలంగా వినిపించే అవకాశం వచ్చింది. జైలు శిక్షల, గోదీ మీడియా ప్రచార పరంపరవల్ల ప్రతిపక్షాలు వెనక్కు తగ్గే అవకాశమే లేదు. క్రమంగా ప్రజలు వాస్తవాలను గ్రహిస్తున్నారు. మన దేశ చరిత్రలో ఎన్నికల కమిషన్ మీద ఇంత బలమైన ఆరోపణలు ఎన్నడూ లేవు. నిక్కచ్చిగా పని చేసిన ఎన్నికల కమిషన్ అధికారులు, ప్రభుత్వానికి దాసోహమన్న ఎన్నికల కమిషన్ అధికారులు ఇంతకు ముందూ ఉన్నారు. ఎన్నికల కమిషన్ పనితీరుపై ఇంత ఎక్కువ స్థాయిలో గతంలో ఎన్నడూ ప్రశ్నలు ఎదురుకాలేదు. ఇప్పుడు ఎన్నికల కమిషన్ బోనెక్కింది. ఎన్నికల కమిషన్ ఆగడాలను ఆపి తీరాల్సిందేనన్న సంకల్పం ప్రతిపక్షాలలో తీవ్రంగా ఉంది. ఎన్నికల కమిషన్ మీద వచ్చిన ఆరోపణలు సామాన్యమైనవి కాదు. బీజేపీ కోసం ఎన్నికల కమిషన్ అక్రమాలకు పాల్పడడం చాలా పెద్ద ప్రశ్న. ఎన్నికల కమిషన్ విశ్వసనీయతకు చెరగని మచ్చ. ఎన్నికల కమిషన్ నడవడిక తీవ్ర ఆందోళనకరంగా తయారవుతోంది. ప్రశ్నలకు జవాబిచ్చే సామర్థ్యం కమిషన్ కోల్పోయింది. అందుకే అడ్డదారులు వెతుకుతోంది. ప్రతిపక్ష నాయకులతో ముచ్చటించడానికి ఎన్నికల కమిషన్ మొహం చాటేస్తోంది. ఆ కారణంగానే సోమవారం ప్రతిపక్ష ఎంపీలను నిలవరించారు. ప్రతిపక్షాలు ఒక వేపున పార్లమెంటులో పోరాడుతుంటే మరో వేపు పార్లమెంటు ఆవరణలో నిరంతరం నిరసన వ్యక్తం చేస్తున్నాయి. చివరకు రోడ్డెక్కాల్సి వచ్చింది. భారత ప్రజాస్వామ్య భవిష్యత్తు రోడ్ల మీదే తేలుతుందేమో! ప్రజలు జాగరూకులైతే అదీ సాధ్యమే.

వ్యతిరేకిస్తే నిర్బంధమా?

ఆంధ్రప్రదేశ్‌లో అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించింది. ప్రజలు దీన్ని పూర్తిగా వ్యతిరేకించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక అధికారులు, పోలీసులు వెంటనే ఈ పార్క్‌ను వ్యతిరేకిస్తున్న వారిలో ముఖ్య నాయకత్వాన్ని ముందురోజు నుంచే గృహ నిర్బంధంలో ఉంచారు. అరెస్టయిన వారందరినీ ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయ్యేవరకూ పోలీసు వాహనాల్లో ఎక్కడెక్కడో తిప్పారు. బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుకు బలవంతపు భూసేకరణ, ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో రసాయన పరిశ్రమవల్ల తీవ్రమైన పర్యావరణం సమస్యలు ఏర్పడి ప్రజలు వివిధ రోగాలు, ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొత్త ఉపాధి రాకపోగా, ఉన్న ఉపాధి కోల్పోతున్నారు. కొత్తగా ఉద్యోగాలూ ఇవ్వలేదు. గతంలో భూమి తీసుకున్న చోట ఎలాంటి పునరావాస చర్యలు తీసుకోలేదు. జనం రోడ్డున పడ్డారు. ఇన్ని అనుభవాల నేపథ్యంలోనే ప్రజలు ఈ పార్క్‌ను సైతం వ్యతిరేకించారు. నక్కపల్లి మండలం పెదతీనార్ల, సిహెచ్‌ఎల్ పురం, ఉపమాక, రాజయ్యపేట, నర్సాపురం, ఎస్.రాయవరం మండలం, గుడివాడలో 1270.80 ఎకరాల్లో బల్క్‌డ్రగ్ పార్కును గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణకు పూనుకోవడం గర్హనీయం. ప్రజల అభిప్రాయాలు కాదని ప్రజాప్రయోజనం పేరుతో ప్రయివేటు వ్యక్తులకు లబ్ధిచేకూర్చేందుకు బలవంతపు భూసేకరణ చేపట్టడం చట్ట విరుద్ధం. ఇఐఎ నివేదికలో ప్రజలను మోసగించడానికి అనేక అబద్ధాలు పొందుపర్చారని విమర్శలున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు

వ్యతిరేకిస్తున్నం దున బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటును ఉపసంహరించుకోవాల్సిన అవసరం ఉంది. కరేడు ఉద్యమం కూడా ఇలాంటిదే. నెల్లూరు జిల్లాలోని ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 8,348 ఎకరాల సారవంతమైన వ్యవసాయ భూమిని ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్‌కు భారీ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు కోసం కేటాయించాలని ప్రయత్నిస్తున్నది. దీన్ని ఇక్కడి ప్రజలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. ముఖ్యంగా కరేడు గ్రామంలోని 16,000కు పైగా కుటుంబాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ప్రతిపాదిత ప్రాజెక్ట్ వల్ల ఈ ప్రాంతంలోని వ్యవసాయ వర్గాలు నిరాశ్రయులవుతారు. పర్యావరణ నష్టం, జీవనోపాధి కోల్పోవడం వంటి భయాలూ ఉన్నాయి. రెండు పంటలు పండించే వరి, వేరుశనగ, మామిడి, కొబ్బరి, ఆక్వాకల్చర్ కోసం ఉపయోగించే ఈ భూమి కేవలం నేల మాత్రమే కాదు, జీవనోపాధి అని గ్రామస్తులు వాదిస్తున్నారు. ఈ భూమి కరేడు కుటుంబాలను పోషిస్తున్నది. స్థానిక ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్నది. ఇండోసోల్ ప్రాజెక్ట్ ఆహార భద్రతను, నీటి వనరులను, పర్యావరణాన్ని శాశ్వతంగా దెబ్బతీస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంప్రదింపులు జరపనేలేదు. గ్రామసభ ఆమోదాలు వంటి చట్టపరమైన అవసరాలను దాటవేసింది. ఈ నియంతృత్వ పోకడల వల్ల అశాంతి చెలరేగుతోంది. భూసేకరణలో న్యాయమైన పరిహారం, పారదర్శకత హక్కు చట్టం-2013ని ప్రభుత్వం ఉల్లంఘిస్తోందన్న ఆరోపణ ఉంది. సౌర మౌలిక సదుపాయాలను సాగులోలేని, బంజరు భూములలో నెలకొల్పవచ్చు.

కరేడునే ఎందుకు ఎంచుకున్నట్లు? ప్రతిపాదిత భూమిలో 750 ఎకరాలు షెడ్యూల్డ్ కులాల కుటుంబాలకు చెందినవి. మరో 500 ఎకరాలు షెడ్యూల్డ్ తెగలు, సంగం వర్గాలకు చెందినవి. ఇలాంటి అణగారిన వర్గాల హక్కులను అణచివేసినా ఎవ్వరూ పట్టించుకోరన్న భ్రమలో ప్రభుత్వం ఉండవచ్చు. కరేడు వ్యవహారం పూర్తిగా సామాజిక సమానత్వ సమస్యను లేవనెత్తింది. 1994 వరదల వినాశకరమైన జ్ఞాపకాలు ఇంకా స్థానిక ప్రజలను వీడనే లేదు. ఇప్పుడు రూ.69,000 కోట్ల ప్రాజెక్టును వీరి నెత్తిన బలవంతంగా రుద్దుతున్నారు. ఈ పరిస్థితి మరోసారి స్థానికుల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్నది. అయితే, జిల్లా అధికారులు మాత్రం వెనుకడుగువేసే ప్రశ్నే లేదని వాదిస్తున్నారు. కరేడు గ్రామ పరిధిలోని 19 గ్రామాలలో ఉప్పరపాలెం, రామకృష్ణపురం, పొట్టెనుగుంట అనే మూడు గ్రామాలలో వాస్తవానికి సేకరించిన భూమి 4,800 ఎకరాలు మాత్రమేనని, ఈ భూమిలో 500 నుంచి 600 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉందని చెపుతున్నారు. స్వచ్ఛంద సమ్మతితో మాత్రమే ముందుకు వెళ్తామని చెపుతూనే అణచివేతకు పాల్పడుతున్నారు. సెక్షన్ 30 సాకుతో అరెస్టులకు పాల్పడుతున్నారు. పునరావాసం ప్యాకేజీలో 5 సెంట్ల ప్రత్యామ్నాయ భూమి, కొత్త గృహాలకు ఆర్థిక సహాయం, ప్రస్తుత ఇళ్ళు, భూమికి పూర్తి పరిహారం ఉన్నాయని అధికారులు చెపుతున్నా, ఈ తరహా ప్యాకేజీలు గత పదేళ్లుగా దేశంలో ఎక్కడా అమలైన దాఖలాలు లేవు.

పంజాబ్‌లోని మాన్సా జిల్లా గోబింద్‌పురలో 880 ఎకరాల ప్రాజెక్టు కోసం పేదలకు చెందిన 700 ఎకరాల భూమిని సేకరించారు. 166 ఎకరాలను బలవంతంగా సేకరించారు. భూమిని రైతులు అమ్ముకునేలా ఒత్తిడి తెచ్చారు. అంగుళం భూమినీ లాక్కోనివ్వబోమని లూథియానాలో ఈ మధ్యనే వేలాదిమంది రైతులు భారీ ప్రదర్శన నిర్వహించారు. వారిని నిలువరించడానికి వెయ్యిమంది పోలీసులు మోహరించాల్సి వచ్చింది. మహారాష్ట్రలోని మావల్, జైతపూర్‌లో అణుకర్మాగారం ఏర్పాటు విషయంలోనూ ఇలాగే జరిగింది. బకూరీ, కేశ్‌నంద్, నికంద్, వఘోలీ ప్రాంతాల ప్రజలు ప్రాణాలకు తెగించి పోరాడారు. ఉత్తరప్రదేశ్‌లోని తప్పల్, ఆలీఘర్, బజ్నా, దాద్రీ, కర్చన ప్రాంతాల్లో గ్రేటర్ నొయిడా విస్తరణ కోసం చేపట్టిన భూసేకరణలో 80% మంది రైతులు వ్యతిరేకత వ్యక్తం చేశారు. జార్ఖండ్‌లోని హజారీబాగ్, తూర్పు సింఘ్‌భమ్, సరేకేలా-ఖరసావన్, బొకారో, దుమ్కా ప్రాంతాల్లో బలవంతంగా భూమిని సేకరించారు. ఎంతోమంది ఉపాధి కోల్పోయారు. జనం రోడ్డున పడ్డారు. అతితక్కువ నష్టపరిహారమిచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకున్నది. ఒడిశాలోని గోపాల్‌పూర్, కళింగనగర్, పూరి, నారాయణపట్నం, అంగుల్, పారాదీప్, డెంకనాల్ ప్రాంతాల్లో టిస్కో స్టీల్ ప్లాంట్ కోసం 3,800 ఎకరాలను సేకరించారు. వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న 83% మంది ప్రజలు భూమిని కోల్పోయారు. వారికి అందిన పరిహారం అంతంతమాత్రమే. పశ్చిమబెంగాల్‌లోని సింగూర్, నందిగ్రామ్‌లోనూ ఇదే తంతు. ఇలా అభివృద్ధి, పారిశ్రామికీకరణ పేరుతో సామాన్యులకు అన్యాయం జరుగుతూనే ఉంది. దేశంలో అభివృద్ధికి ఎవరూ ఆటంకం కాబోరు. కాకపోతే, పేదల పొట్టగొట్టి పెద్దలకు భవంతులు కట్టబెడతామనుకునే విధానాలకే వ్యతిరేకత వస్తుంది. ఈ తరహా అరాచక భూసేకరణల పేరుతో ఇప్పటికే లక్షలాది ఎకరాల వ్యవసాయభూమిని, లక్షల హెక్టార్ల అడవిని దేశం కోల్పోయింది. రైతుల హక్కులను కాలరాసే యత్నాలను, పర్యావరణాన్ని దెబ్బతీసే అసహేతుక చర్యలను ప్రతిఘటించడంలో తప్పేముంటుంది!

శత వసంతంలో విప్లవ యోధ కాస్ట్రో

బుద్ధిగ జమిందార్

20 వ శతాబ్దం ప్రారంభంలో పుట్టిన వారిపై ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా, దక్షిణ- సెంట్రల్ అమెరికా వాసులకు పుట్టుకతోనే సామ్రాజ్యవాద వ్యతిరేక స్వభావం, యుద్ధాలకు నిరసనగా శాంతిని కోరుకోవటం, నియంతృత్వం ప్రత్యామ్నాయంగా ప్రజాస్వామ్యం కావాలనుకోవటం, విదేశీ వలసవాద శృంఖలాల నుంచి విముక్తి పొంది స్వతంత్ర దేశాలుగా నిలబడాలనుకోవటం ఉద్భవించే పోరాట గుణాలు కనిపిస్తాయి. ఆ సమయంలో 1924 సంవత్సరం ఆగస్టు 13 నాడు మన కాస్ట్రో జన్మించాడు. మొట్టమొదటిసారిగా అమెరికాలో సోషలిస్టు రాజ్య స్థాపనకు అమెరికా ఖండంలో శ్రీకారం చుట్టి పశ్చిమ దేశాధినేతల్లో గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన విప్లవవీరుడు, పరిపాలనాధ్యక్షుడు, అమెరికా దేశం ముఖద్వారం దగ్గర 90 మైళ్ల దూరంలో చిన్న దేశమైన క్యూబాతో సామ్రాజ్యవాదానికి కునుకురాకుండా చేశాడు కాస్ట్రో.

కాస్ట్రో పూర్తి పేరు ఫిడెల్ అలెజాండ్రో కాస్ట్రో రూజ్. కాస్ట్రో అంటే స్పానిష్ భాషలో కోట అని అర్థం. అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఒక కోటలాగా ధృడంగా ఎదుర్కొని, తనపై సుమారు 600 పైసార్లు హత్యాప్రయత్నం సిఐఏ చేయటానికి ప్రయత్నించినా లొంగక తప్పించుకోగలిగాడు. బిరాన్‌లో ఒక సంపన్న స్పానిష్ కుటుంబంలో పుట్టిన కాస్ట్రో 1950లో హవానా విశ్వ విద్యాలయం నుంచి న్యాయ పట్టా పొందాడు. 1952లో క్యూబన్ పీపుల్స్ పార్టీ తరపున నియంత ఫుల్జెన్సియా బటిస్టా ప్రభుత్వానికి వ్యతిరేక అభ్యర్థిగా ఉండగా బటిస్టా తిరుగుబాటు ఎన్నికలకు ముందుగానే అడ్డుకొంది. కాస్ట్రో త్వరలోనే నియంతృత్వాన్ని సవాలు చేయటానికి ప్రత్యామ్నాయ మార్గాలకై అన్వేషించాడు. 200 మందిని సేకరించి జులై 26, 1953న శాంతియాగో ఆర్మీ బ్యారక్‌పై దాడి చేయగా విజయవంతం కాలేదు. దాడిలో ఎక్కువమందిని బటిస్టా ప్రభుత్వం చంపింది. ఈ దాడితో అప్పటికే బటిస్టాకు వ్యతిరేకంగా ఉన్న ప్రజలలో సాధారణ తిరుగుబాటును రేకెత్తిస్తుందని కాస్ట్రో ఆశించాడు. కాస్ట్రోతో పాటుగా అతని సోదరుడు రౌల్ జైలు పాలయ్యారు. 1955లో జైలు నుంచి ఉపశమనం లభించగా ఫిడెల్ కాస్ట్రో మెక్సికోకు వెళ్లాడు. అక్కడ క్యూబన్ బహిష్కృతులను పోగుజేసి దండయాత్ర దళాన్ని ప్రారంభించాడు. 81 మంది సభ్యుల బృందంతో కలిసి గ్రాన్మా అనే పడవలో డిసెంబరు 2న తూర్పు క్యూబాలో అడుగు పెట్టిన కాస్ట్రో దళంలో చాలామంది చంపబడ్డారు లేదా పట్టుబడ్డారు. తప్పించుకొన్న డజను మందిలో కాస్ట్రో సోదరులు, ఎర్నెస్టో చే గువేరాలు ఉన్నారు. ఈ చిన్న బృందం సియెర్రా మాస్ట్రా పర్వతాలలో బటిస్టాకు వ్యతిరేకంగా గెరిల్లా ప్రచారాన్ని ప్రారంభించింది. 1953 దాడి జ్ఞాపకార్థం జులై 26 ఉద్యమం పేరును తీసుకొంది.

- యునైటెడ్ స్టేట్స్ అప్పటికే ఒక శతాబ్దంపాటు లాటిన్ అమెరికాలో మాత్రమే లక్షలాదిమంది మరణాలకు కారణమైన లెక్కలేనన్ని నియంతృత్వ పాలనలకు మద్దతునిచ్చింది. కాస్ట్రో ఈ చేదు రక్తపాత చరిత్రకు వ్యతిరేకంగా ఉద్యమించాడు. 1998లో స్పానిష్- అమెరికన్ యుద్ధం ఫలితంగా స్పెయిన్ కాలనీ నుంచి క్యూబా ద్వీపం వాషింగ్టన్ సెమీ కాలనీగా రూపాంతరం చెందింది. అమెరికా సామ్రాజ్యం దశాబ్దాలుగా సాగించిన దోపిడీ, అణచివేత ద్వారా కాస్ట్రో సొంత రాజకీయ పరిణామం రూపుదిద్దుకొంది. 'ప్లాట్' అను సవరణ ప్రకారం అమెరికా క్యూబా వ్యవహారాల్లో జోక్యం చేసుకొనే 'హక్కు' అనే హామీ పొందింది. గ్వాటనామా బే ను తన సైనిక స్థావరంగా ఉపయోగించుకోటానికి వాడుకొంది. హవానాలో వాషింగ్టన్ కీలుబొమ్మ వ్యక్తి ఫుల్జెన్సియో బటిస్టా. అతను విదేశీ సంస్థలు, దేశంలోని స్థానిక సామ్రాజ్యవాద మాఫియా ప్రయోజనాల కోసం పాలించే క్రూరమైన నియంతృత్వానికి నాయకత్వం వహించాడు. ఇతను క్యూబా దేశాన్ని జూదం, వ్యభిచార కేంద్రంగా మార్చాడు. హింస నిత్య కృత్యంగా ఉండేది. కనీసం 20 వేల మంది క్యూబన్ల రాజకీయ హత్యలకు బటిస్టా కారణమని తర్వాతి కాలంలో అమెరికా అధ్యక్షుడు జాన్.ఎఫ్. కెన్నెడీ స్వయంగా ఒప్పుకొన్నాడు. ఈ పాలన ఎంత క్రూరమో అదే కాలంలో అంతే మోతాదులో డొమినికన్ రిపబ్లిక్, ట్రుజిల్లో, హైతీలో, దువాలియర్‌లో, నికరాగ్వాలో ఇలాంటి సామూహిక నేరాలకు అమెరికా మద్దతు ఇస్తూ ఉండేది.-

> అమెరికా సామ్రాజ్యం దశాబ్దాలుగా సాగించిన దోపిడీ, అణచివేతల ద్వారా కాస్ట్రో సొంత రాజకీయ పరిణామం రూపుదిద్దుకొంది. 'ప్లాట్' అను సవరణ ప్రకారం అమెరికా క్యూబా వ్యవహారాల్లో జోక్యం చేసుకొనే 'హక్కు' అనే హామీ పొందింది. గ్వాటనామా బే ను తన సైనిక స్థావరంగా ఉపయోగించుకోటానికి వాడుకొంది. హవానాలో వాషింగ్టన్ కీలుబొమ్మ వ్యక్తి ఫుల్జెన్సియో బటిస్టా.

కాస్ట్రో బృందం క్యూబాలో అడుగు పెట్టినప్పుడు దేశమంతా అంతర్యుద్ధ పరిస్థితిలో ఉంది. మార్చి 13, 1957 లో విద్యార్థి బృందం అధ్యక్ష భవనంపై సాగించిన రక్తపాత దాడి విజయం సాధించలేదు. క్యూబా అంతటా అల్లర్లు జరుగుతున్నాయి. ట్రేడ్ యూనియన్ సార్వత్రిక సమ్మె పిలుపు ఉపాధి కోల్పోతామనే భయంతో నిలిపివేశారు. రాజ్యాంగ హామీలైన భావ ప్రకటనా స్వేచ్ఛ బటిస్టా నిలిపివేశాడు. 1957 సెప్టెంబరు 5 న సీన్ ఫ్యూగోస్‌లో జరిగిన

తిరుగుబాటు కారణంగా నగరం నావికా కేంద్రం తిరుగుబాటు అధికారుల వశమైంది.

కాస్ట్రో బృందం ఉనికి దేశమంతటా పాకింది. 1958 అధ్యక్ష ఎన్నికల తర్వాత బటిస్టాకు మద్దతు కరిగిపోయింది. సైన్యంలో ఎక్కువ భాగం అతనికి విధేయులుగా ఉన్నప్పటికీ అమెరికన్ ఆయుధ నిషేధ ఫలితంగా పోరాట సామర్థ్యం తగ్గింది. సంవత్సరాలుగా విజయవంతమైన గెరిల్లా ప్రచారాన్ని నిర్వహించిన కాస్ట్రో దళాలు, ప్రభుత్వ దళాలతో పోటీకి సిద్ధమయ్యాయి. డిసెంబరు 27, 1958 న చేగువేరా నేతృత్వంలోని తిరుగుబాటుదళం లాస్ విల్లాస్ ప్రావిన్స్ రాజధాని శాంతాక్లారాలోని బటిస్టా దండును తరిమికొట్టింది. ప్రభుత్వ దళాలకు అవసరమైన ఆయుధాల్ని, మందుగుండు సామగ్రితో నిండిన సాయుధ రైలును స్వాధీనం చేసుకొంది. తన పదవిని నిలబెట్టుకోలేమని భావించిన బటిస్టా, జనవరి 1, 1959 తెల్లవారుఝామున అధ్యక్ష పదవి వదులుకొన్నాడు. తెల్లవారుఝామున డొమినికన్ రిపబ్లిక్ పారిపోయాడు. అటు పిమ్మట పోర్చుగీసు ద్వీపమైన మదీరామ్, ఆ తర్వాత పోర్చుగల్‌లో ప్రవాసం జీవితాంతం చేశాడు.

బటిస్టా దేశాన్ని వదులుతూ సైన్యాధ్యక్షుడు జనరల్ యులోజియో కౌంటిల్లోకి అప్పగించాడు. శాంతియాగోడి క్యూబా నగర హాలు బాల్కనీ నుంచి కాస్ట్రో విప్లవ విజయాన్ని ప్రకటించాడు. జనవరి 3 న చేగువేరా తిరుగుబాటు దళం ఎటువంటి వ్యతిరేకత లేకుండా హవానాలోకి ప్రవేశించింది. జనవరి 8న లియో అధ్యక్షుడుగా, కాస్ట్రో ప్రధానిగా తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది...

(కాస్ట్రో శత జయంతి 2025-2026 సందర్భంగా ...)

సెల్: 9849491969
ప్రోగ్రసివ్ ఫోరం

ద్వేషాన్ని రెచ్చగొట్టడానికి విభజన ఓ సాధనం

రామ్‌పునియాని

పాఠ్య పుస్తకాల అంశాల గురించి తుది నిర్ణయం తీసుకునే సంస్థ నేషనల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ (ఎన్‌సిఇఆర్‌టి). చరిత్ర నిష్పాక్షిక, విచక్షణాత్మక దృక్పథాన్ని కలిగించడానికి బదులుగా గత రెండు దశాబ్దాలుగా మతతత్వ దృక్పథాన్ని ప్రోత్సహించే సాధనంగా మారింది. చరిత్ర అనేది యువకుల మనసులను తీర్చిదిద్దడానికి ముఖ్యమైన భాగం. పాఠ్యాంశాల్లోని మత పరమైన భావన బహుళ కారణాల ద్వారా ఇతరులపై (ముస్లింలు) ద్వేషంగా దిగజారుస్తుంది. చరిత్రలో బ్రిటీషు వాళ్లు రాజులను మతం కోణం నుంచి పరిచయం చేశారు. అధికారం, ధన దాహంతో పాలించిన రాజులు మత ఎజెండాను ప్రోత్సహించినట్లు చెప్పారు. ఒకే మతం కలిగిన రాజులు మధ్య జరిగిన యుద్ధాలు, ఘర్షణల వాస్తవాలను ఇది విస్మరించింది. వారి సైన్యాలులో ఒకే మతానికి చెందిన ప్రజలు కూడా దానిలో భాగమయ్యారు. వారి మధ్య అనేక ఘర్షణలు జరిగాయి. కాని అవి ప్రస్తుత కాలంలో ఉన్న నిబంధనలు ఆమోదించబడవు. వారి రాజ్యాల విస్తరణ లక్ష్యాలను సాధించడానికి పొరుగు రాజ్యాలతో తరచుగా యుద్ధాలు చేసేవారు. యుద్ధం అత్యంత అమానవీయ చర్య. యుద్ధాలలో రాజుల క్రూరత్వం ఒక మతానికి మాత్రమే పరిమితం కాలేదు.

శివాజి తొలి యుద్ధం చంద్రరావుమోరేతో జరిగినప్పటికి బాబర్ తన పాలన స్థాపనకు, భారతదేశంలో తన రాజ వంశాన్ని స్థాపించడానికి ఇబ్రహీంలోడీని ఓడించాల్సి వచ్చింది. ప్రఖ్యాతి వహించిన చోళ రాజులకు, చాళుక్య రాజులకు మధ్య యుద్ధం జరిగింది. రాజులను, వారి కాలం సందర్భంను బట్టి చూడాలి తప్ప వేరుచేసి చూడటం సరికాదు. ప్రస్తుతం భారతదేశంలో మొఘల్ చక్రవర్తుల దురాగతాలను చీకటి రోజులుగా చిత్రీకరించడానికి ఆనాటి సందర్భాలను వేరుచేసి చూపిస్తున్నారు. మనం అర్థం చేసుకోవలసిన మరో విషయం ఏమిటంటే సంక్లిష్టమైన యంత్రాంగాల ద్వారా రాజులు మిశ్రమ పాలన చేసినప్పటికి, ముస్లిం రాజులను నేటి ముస్లింలలో భాగంగా హిందూ రాజులను నేటి హిందువులలో భాగంగా కలగలిపి చూస్తున్నారు. ముస్లిం రాజుల ప్రతి దురాగతాలను నేటి ముస్లింలకు అంటగట్టి బెదిరింపులకు పూనుకుంటున్నారు. ఈ మొత్తం ఆలోచనను ఒకసారి ప్రవేశపెట్టిన 8 వ తరగతి సామాజిక శాస్త్రం పాఠ్య పుస్తకాన్ని తిరిగి ఎన్‌సిఇఆర్‌టి విడుదల చేసింది. ఇది 13 నుంచి 17 వ శతాబ్దాల వరకు భారతీయ చరిత్రపై సవరించిన దృక్పథాన్ని ఇస్తుంది. ఈ పుస్తకం ఎక్స్‌ప్లోరింగ్ సొసైటీ (సామాజిక అన్వేషణ), ఇండియా అండ్ బియాండ్ (భారతదేశం అవతల) సిరీస్‌లో భాగం. ఢిల్లీ సుల్తానేట్, మొఘల్ కాలం గురించి



విద్యార్థులకు పరిచయం చేయడానికి ఎన్‌సిఇఆర్‌టి విడుదల చేయబోయే మొదటి పుస్తకం. ఈసారి మొత్తం మీద ఎన్‌సిఇఆర్‌టి ముస్లిం రాజు రాక్షసత్వం తీవ్ర దాడి చేసింది. దేవాలయాల విధ్వంసంలో విగ్రహారాధన వ్యతిరేకత కూడా ఉంది. దేవాలయం ధ్వంసంలో లోతుగా అర్థం చేసుకుంటే భిన్నమైన కథనాలు కనిపిస్తాయి. కవి కల్హన్స్ రాజ తరంగిణి ప్రత్యేక అధికారిగా నియమించిన రాజ హర్షదేవ్ గురించి, డిమోట్టపటాన్ (దేవుళ్ల విగ్రహాలను కూల్చివేసే బాధ్యత కలిగిన అధికారి) అందరకు తెలుసు. అతను సంపద కోసం ఈ పని చేశాడు. అతను ఎక్కువగా దేవాలయాలను నిర్మూలించిన రాజు కావచ్చు. ఇప్పుడు ఎలాంటి నిర్ధారణ లేకుండా ఔరంగజేబు అనేక దేవాలయాలను కూలగొట్టించాడని అతిగా చిత్రించారు. కొన్ని దేవాలయాలను ధ్వంసం చేయమని ఔరంగజేబు ఆదేశించిన మాట వాస్తవం. అయితే అతను విధ్వంసం చేసిన దాని కంటే హిందూ దేవాలయాలకు ఎక్కువ విరాళాలు ఇచ్చిన మాట కూడా వాస్తవం. రాజు ఔరంగజేబు విరాళాలు ఇచ్చిన దేవాలయాలు ఎంత మొత్తం ఇచ్చింది జాబితాను డా॥విశ్వంభరనాథ్ పాండే తెలియజేశాడు. బాబరుకు సంబంధించినంత వరకు విభజన అంశం రామ మందిరం ధ్వంసం చేశాడని. ప్రజల విశ్వాసాల ప్రాతిపదికగా బాబరు మసీదు హిందువులదని అలహాబాద్ కోర్టు తీర్పు చెప్పింది. దానికి చట్టబద్ధ ప్రాతిపదిక లేదు. మసీదు కింద దేవాలయం ఉన్నదని సుప్రీంకోర్టు కూడ చెప్పలేదు. ఢిల్లీ నేషనల్ మ్యూజియంలోని బాబర్ వీలునామాలో మెజారిటీ ప్రజలు హిందువులు, వారి మనో భావాలను గౌరవించాలి. గోవులను వధించరాదు, దేవాలయాలను ధ్వంసం చేయరాదని కుమారుడు హుమయూన్‌కు ఆదేశాలిచ్చాడు. ఇది రాజ్య పాలనలో ఒక భాగం. చిత్తోఘర్ దగ్గర దేవాలయాలను ధ్వంసం చేసి 30,000 మంది ప్రజలను ఊచకోత కోయమని ఆదేశించినట్లు ఎన్‌సిఇఆర్‌టి పుస్తకం ఉదహరించింది. యాదృచ్ఛికంగా చిత్తోడ్ ముట్టడి జరిగినపుడు రాజపుత్రరాజు భగవంత్‌దాస్ అక్బర్‌కు మిత్రుడు. అది పెద్ద అంశం కాదు, కాని వాస్తవంగా అనేకమంది హిందూ రాజులు ఇలాంటి పనులు చేశారు. చోళులు, చాళుక్యుల మధ్య జరిగిన యుద్ధంలో విజయం సాధించిన చోళులు పట్టణాన్ని మొత్తం నాశనం చేశారు. అనేక జైన దేవాలయాలను కూలగొట్టారు. పుష్యమిత్ర శృంగుడు బౌద్ధ భిక్షువులను సంహరించాడు. బౌద్ధ విహారాలను, స్థూపాలను నాశనం చేశాడు. శివాజి సైన్యం సూరత్‌లోని ప్రజలను దోచుకొని గాయపరిచి తగలబెట్టినట్లు బాల్ సామంత్ రాసిన "శివకళ్యాణ్ రాజ్" పుస్తకంలో చెప్పాడు. రాజరిక పాలనలో ఇదంతా సర్వ సాధారణం. దానికి హిందు రాజులు, ముస్లిం రాజులు అన్న విచక్షణ ఉండదు.

యుద్ధంలో క్రూరత్వం ముఖ్య లక్షణం. దానికి రాజు మతంతో సంబంధం లేదు. ఒక ముఖ్య విషయాన్ని విస్మరిస్తున్నాము, ఏమిటంటే ప్రజలను అణచివేయబడ్డ హిందూ రాజుల సైన్యంలో ముస్లిం సైనికులున్నారు. ముస్లిం రాజుల సైన్యంలో హిందూ సైనికులున్న విషయాన్ని అక్బర్ కొలువులో ఇతరులతో పాటు మాన్‌సింగ్, ఔరంగజేబ్ కొలువులో జైసింగ్, జస్వంత్‌సింగ్ ఉన్నారు. రాణాప్రతాప్ కొలువులో హకింఖాన్ అనే సైనిక జనరల్, శివాజి మహరాజ్ దగ్గర దౌలత్‌ఖాన్, ఇబ్రహీంగార్ది, అనేక మంది సిద్దులు ఉన్నారు. చరిత్ర పుస్తకంలో (ఎన్‌సిఇఆర్‌టి ప్రచురించిన) హిందు రాజుల దగ్గర పనిచేసిన ముస్లింలను, ముస్లిం రాజుల దగ్గర పనిచేసిన హిందువులను తెలియపరచకుండా తాము ఎంపిక చేసుకున్న భాగాలను మాత్రమే ప్రచురించారు. బాబర్, అక్బర్, ఔరంగజేబ్ పాలనలో జరిగిన మంచిని చెప్పకుండా క్రూరత్వాన్ని మాత్రమే చెప్పారు. అదే విధంగా 'జిజియా' పన్ను మొఘల్ పాలన ద్వారా విధించలేదు. అక్బర్ 1560 లో అధికారంలోకి వచ్చాడు. రెండు మూడు సంవత్సరాలలో దానిని ఉపసంహరించాడు. జిజియా మత మార్పిడికి ప్రోత్సాహకం కాదు. అది ముస్లిమేతరులపై వేసే పన్ను, ముస్లిం రాజ్యంలో రక్షణ పొందుతున్న వారిపై వేసే పన్ను. ఈ పన్ను నుంచి బ్రాహ్మణులు, మహిళలు మినహాయింప బడ్డారు. ముస్లింలుగా మత మార్పిడికి సంబంధించి ప్రోత్సాహకం కాదు. ఈ కాలాన్ని మన చరిత్ర చీకటి కాలంగా పిలిచారు. ప్రతి కాలంలో కాంతులు విరజిమ్మిన కాలం ఉంటుంది. అవమానాలను ఎదుర్కొన్న కాలం ఉంటుంది. ఇదే కాలంలో మానవత్వంతో కూడిన భక్తి, సూఫీ సాంప్రదాయాలను మనం చూడగలం. సిక్కు మతం అభివృద్ధి, విలసిల్లిన కాలాన్ని కూడ చూడవచ్చు. చరిత్రలో రెండు పెద్ద మతాల మధ్య సాంప్రదాయాలు, సామాజిక, సాంస్కృతిక పరస్పర క్రియ జరిగి "గంగా జముని" అనే మిశ్రమ సంస్కృతి ఏర్పడిన విషయాన్ని చరిత్ర తెలియజేసింది. అనేక సందర్భాలలో రెండు మతాల సాంప్రదాయాలు కలిసి భారతదేశ సాంప్రదాయంగా మారిన పరిస్థితి కూడ ఉంది.

(మెయిన్ స్ట్రీమ్ నుంచి...)

సహనం నశిస్తే బ్రహ్మోస్‌తో దాడి: మిథున్ చక్రవర్తి



న్యూదిల్లీ: సింధూ జలాల ఒప్పందం నిలిపివేత విషయంలో పాకిస్థాన్ తన అక్కసు వెళ్లగక్కుతూనే ఉంది. ఓర్వలేక అణు బెదిరింపులకు పాల్పడుతోంది. తాజాగా ఆ దేశ విదేశాంగశాఖ మాజీ మంత్రి బిలావల్ భుట్టో కూడా తీవ్ర హెచ్చరికలు చేశారు. దీనిపై సినీనటుడు, బీజేపీ నేత మిథున్ చక్రవర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాక్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తూ ఉంటే భారత్ సహనం నశిస్తుందని అన్నారు. అప్పుడు బ్రహ్మోస్ క్షిపణులు ఒకదాని తర్వాత ఒకటి ఆ దేశంపైకి దూసుకెళ్తాయని హెచ్చరించారు. భారత్ సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేయడంతో తమ దేశానికి పెద్ద నష్టం జరిగిందని భుట్టో మాట్లాడారు. 'ప్రధాని మోదీ నాయకత్వంలో భారత ప్రభుత్వం తీసుకున్న చర్యలు పాక్‌కు చాలా నష్టం కలిగించాయి. మన ప్రజలంతా ఐక్యంగా ఉండాలి. వారి దురాక్రమణలకు వ్యతిరేకంగా కలిసి నిలబడాలి' అని భుట్టో అన్నారు.

విమానం దారిమళ్లింపు... స్పీకర్‌కు ఎంపీల ఫిర్యాదు

న్యూదిల్లీ: తాము ప్రయాణిస్తున్న తిరువనంతపురం-దిల్లీ ఎయిరిండియా విమానాన్ని చెన్నైకు మళ్లించడాన్ని ఎంపీలు ప్రశ్నించారు. ఆ విమానయాన సంస్థ తమ హక్కుల ఉల్లంఘనకు పాల్పడిందని ఆరోపించారు. ఆ సంస్థపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్‌కు చెందిన కేసీ వేణుగోపాల్ సహా ఐదుగురు ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టాలని పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడును కోరారు. పార్లమెంట్ సభ్యులు కేసీ వేణుగోపాల్, కొడికున్నిల్ సురేశ్, అదూర్ ప్రకాశ్, కె.రాధాకృష్ణన్, సి.రాబర్ట్ బ్రూస్ సహా 150 మంది ప్రయాణికులతో కూడిన ఎయిరిండియా విమానం ఈ నెల 10న తిరువనంతపురం నుంచి దిల్లీకి బయల్దేరింది. మార్గమధ్యంలో సాంకేతిక లోపం కారణంగా విమానాన్ని చెన్నైకి మళ్లించారు. ఆ సమయంలో బెంగళూరు, కోయంబత్తూరు వంటి ఇతర విమానాశ్రయాలు సమీపంలోనే ఉండగా... చెన్నైకు మళ్లించడాన్ని ఎంపీలు ప్రశ్నించారు. ఈ నిర్ణయం వెనుక కారణాన్ని సంస్థ వివరించలేదన్నారు. విమానాన్ని చెన్నైకు మళ్లించినప్పటికీ నేరుగా ల్యాండ్ చేయలేదని, అక్కడే గంటకుపైగా చక్కర్లు కొట్టినట్లు ఎంపీలు తెలిపారు. తొలిసారి ల్యాండింగ్‌కు విఫలయత్నం చేశారని, బహుశా రన్‌వేపై మరో విమానం ఉండటం వల్ల కావచ్చనే పైలట్ ప్రకటనను ఉటంకించారు. ఎట్టకేలకు అర్ధరాత్రి దాటిన తర్వాత మరో విమానంలో దిల్లీకి వెళ్లినట్లు చెప్పారు. ఈ వ్యవహారంపై తాము ఆందోళనలు లేవనెత్తగా... తప్పుడు ప్రకటనలు చేశామంటూ ఎయిరిండియా చిత్రీకరించిందన్నారు. తద్వారా ఎంపీల ప్రతిష్ఠకు భంగం కలిగించే ప్రయత్నం చేసినట్లు ఆరోపించారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదం నుంచి దేశం ఇంకా తేరుకోలేదని, కొన్ని నెలలుగా అనేక సాంకేతిక లోపాల ఘటనలు నమోదవుతున్న తరుణంలో ఎయిరిండియా తీరు ఆమోదయోగ్యం కాదని కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడుకు రాసిన లేఖలో ఎంపీలు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. అత్యవసర మళ్లింపులు, రన్‌వే భద్రతకు సంబంధించిన ప్రొటోకాల్‌ను మరింత బలోపేతం చేయాలని, అటువంటి పరిస్థితుల్లో ప్రయాణికులకు సరైన సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

జయాబచ్చన్ చిరాకు

న్యూదిల్లీ: సమాజ్‌వాది పార్టీ ఎంపీ జయాబచ్చన్ మరోసారి సహనం కోల్పోయారు. ఆమెతో సెల్ఫీ దిగేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తీవ్రంగా నిలదీస్తూనే ఆ వ్యక్తిని పక్కకు తోసేశారు. దిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్ ఆవరణలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన 32 సెకన్ల వీడియో వైరల్ అవుతోంది. బీహార్‌లో ఎన్నికల జాబితాలో మోసాలు జరిగాయంటూ ఎన్నికల కమిషన్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసేందుకు విపక్ష ఎంపీలు సమావేశమయ్యారు. ఆ సమయంలో జయాబచ్చన్ అక్కడకు చేరుకున్నారు. దీంతో ఆమెతో సెల్ఫీ దిగేందుకు ఒక వ్యక్తి ప్రయత్నించగా ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఏం చేస్తున్నావు నువ్వు' అని ప్రశ్నిస్తూ అతన్ని పక్కకు నెట్టేశారు. ఆ తర్వాత లోక్‌సభ ఎంపీ, ఆర్జేడీ నేత మీసా భారతితో కలిసి ఆమె ముందుకు కదిలారు. ఇటీవల ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంటులో చర్చ జరిగిన సమయంలోనూ జయాబచ్చన్ సహనం కోల్పోయారు. అధికార పక్ష సభ్యులు తన ప్రసంగానికి అడ్డుపడుతున్నారంటూ విరుచుకుపడ్డారు. ఆమెను శాంతపరిచేందుకు పక్కనే ఉన్న ప్రియాంక చతుర్వేది ప్రయత్నించగా... తనను ఆపొద్దు ప్రియాంకా అంటూ ఆమె అసహనం వ్యక్తం చేశారు.

మునీర్ 'ఆవారా' వ్యాఖ్యలు: ఒవైసీ

న్యూదిల్లీ: అమెరికా వేదికగా పాక్ సైన్యాధిపతి ఆసిమ్ మునీర్ 'అణు' హెచ్చరికలు చేయడంపై ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. మునీర్ వ్యాఖ్యలు ఖండించదగినవని అన్నారు. ఆయన ఒక 'సడక్ చాప్ ఆద్మీ' (ఆవారా)లా మాట్లాడుతున్నాడని విమర్శలు గుప్పించారు. 'పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ వాఖ్యలు, బెదిరింపులు ఖండించదగినవి. దురదృష్టకరమైన విషయం ఏమిటంటే ఆయన మన వ్యూహాత్మక భాగస్వామి అయిన అమెరికా వేదిక నుంచి ఈ మాటలు మాట్లాడటం. ఆయన 'సడక్‌చాప్ ఆద్మీ'లా మాట్లాడుతున్నాడు. పాకిస్థాన్ ఆర్మీ నిరంతరం బెదిరింపులకు పాల్పడుతుండటం వారి మానసిక స్థితిని చూపిస్తోంది. భారతదేశం సిద్ధంగా ఉండటానికి మన రక్షణ బడ్జెట్‌ను పెంచాల్సి ఉంటుంది' అని ఒవైసీ అన్నారు. భారతదేశానికి వ్యతిరేకంగా ఆసిమ్ మునీర్ తాజాగా 'అణు' వ్యాఖ్యలు చేశారు. తమది అణ్వస్త్ర దేశమని, తమ దేశ ఉనికికి ముప్పు వచ్చిన పక్షంలో తమతో పాటు సగం ప్రపంచం అంతమైపోతుందని బెదిరింపులకు దిగాడు. మునీర్ హెచ్చరికలపై భారత విదేశాంగ శాఖ సైతం ఘాటుగా స్పందించింది.

ఈసీకి సినిమా చూపిస్తాం

రాహుల్ గాంధీ

'ఇండియా' ఐక్యసంఘటన నేతలు సోమవారం ఉదయం పార్లమెంటు మకర ద్వారం నుంచి ర్యాలీగా బయలుదేరి తీవ్ర నిరసనలు తెలిపారు. అనుమతి లేదంటూ ర్యాలీని అడ్డుకున్న పోలీసులు... ప్రియాంక గాంధీ వాద్రా, అఖిలేష్ యాదవ్, శివసేన నేత సంజయ్ రౌత్ సహా 29 మంది ఎంపీలను అదుపులోనికి తీసుకున్నారు. ఓటర్ల జాబితా స్కాన్ ఫొటోగ్రాఫ్‌లతో పోస్ చేయడం కాకుండా మెషీన్-రీడబుల్ ఓటర్ లిస్టులు విడుదల చేయాలని నేతలు డిమాండ్ చేశారు. స్కాన్ ఫొటోగ్రాఫ్‌లతో తప్పులు చెక్ చేసుకోవడం దాదాపు అసాధ్యమని వారు తెలిపారు.

న్యూదిల్లీ: ఎన్నికల కమిషన్‌పై కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. గత ఏడాది కర్నాటక, మహారాష్ట్రలో బీజేపీ తో కలిసి ఓట్ల చోరీ చేసిన ఎన్నికల కమిషన్ ఈ ఏడాది చివరిలో జరగనున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో నూ ఓట్ల చోరీకి సన్నద్ధమవుతోందని నిందించారు. ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో ఇందుకు సిద్ధమవుతోందని ఆరోపించారు. మంగళవారం పార్లమెంటు వెలుపల రాహుల్ మీడియాతో మాట్లాడుతూ ఒకటి, రెండు సీట్లలో కాకుండా చాలా సీట్లలో ఓట్ల చోరీ జరుగుతోందని, ఇది ఒక క్రమపద్ధతిలో జాతీయ స్థాయిలో జరుగుతోందని అన్నారు. ఎన్నికల కమిషన్‌కు ఇది తెలుసుననీ, గతంలో దీనికి ఆధారాలు లేవనీ, ఇప్పుడు ఉన్నాయని పేర్కొన్నారు. 'మేము రాజ్యాంగాన్ని పరిరక్షిస్తున్నాం. ఒక వ్యక్తి ఒకే ఓటు అనే విధిని ఎన్నికల కమిషన్ పాటించడం లేదు. ఇక సినిమా చూపించడమే ఆలస్యం' అని రాహుల్ చమత్కరించారు. ఓట్ల చోరీ వివాదంపై విపక్షాల నిరసనను 'టీజర్'గా రాహుల్ పేర్కొన్నారు. బీహార్‌లో ఓట్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఓట్ల చోరీపై

లోక్‌సభకు మళ్లీ ఎన్నికలు

అభిషేక్ డిమాండ్

న్యూదిల్లీ: గత సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల జాబితాలో అక్రమాలు చోటుచేసుకున్నాయని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మేనల్లుడు, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీ ఆరోపించారు. ప్రస్తుత లోక్‌సభను రద్దు చేసి...ఎన్నికలు మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. 'తప్పులతో కూడిన ఓటర్ల జాబితాను ఉపయోగించే బీజేపీ అధికారంలోకి వచ్చింది. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా ఇలాగే ఎన్నికయ్యారు. లోక్‌సభను రద్దు చేసి కొత్తగా ఎన్నికలు నిర్వహించాలి. అవసరమైతే నేను రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నా. తృణమూల్‌తో పాటు ప్రతిపక్ష ఎంపీలందరూ అందుకు సిద్ధమే' అని బెనర్జీ పేర్కొన్నారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో ఓటరు జాబితాలు సరిగ్గానే ఉన్నాయని, బెంగాల్, బీహార్‌లో మాత్రమే తప్పుగా ఉన్నాయని ఈసీ ఎలా చెబుతుందని ప్రశ్నించారు. బీహార్‌లో న్యాయబద్ధంగా ఎన్నికలు జరిగితే బీజేపీ ఓడిపోతుందని వ్యాఖ్యానించారు. ఎస్ఐఆర్ నిర్వహించాలనుకుంటే ముందుగా లోక్‌సభను రద్దు చేయాలన్నారు. ఆ తర్వాత దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయనేందుకు విపక్షాలు ఆధారాలు కూడా చూపించాయన్నారు. ఎన్నికల సంఘాన్ని బీజేపీ ఎందుకు వెనకేసుకొస్తోందని ప్రశ్నించారు. బీజేపీ, కేంద్ర ఎన్నికల సంఘం కుమ్మక్కై ఎన్నికల్లో భారీ మోసానికి పాల్పడ్డాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కొద్ది రోజులుగా సంచలన ఆరోపణలు చేస్తున్నారు. 'ప్రజాస్వామ్యం వినాశనమైంది' పేరుతో ఇండియా ఐక్యసంఘటన నేతలకు ఆయన ప్రజెంటేషన్ కూడా ఇచ్చారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా ఒక వెబ్‌పేజీని ప్రారంభించి... అవకతవకలు గుర్తిస్తే ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అటు అణు హెచ్చరికలు...ఇటు నీటి కోసం అభ్యర్థనలు

న్యూదిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్ర దాడి కారణంగా భారత్ తీసుకున్న కఠిన నిర్ణయాలతో పాకిస్థాన్ ఉక్కిరి బిక్కిరి అవుతోంది. భారత్‌పై పాకిస్థాన్ రోజుకో రీతిగా వ్యవహరిస్తోంది. భారత్‌పై అణు బాంబు వేస్తామంటూ పాకిస్థాన్ సైన్యాధిపతి అసిమ్ మునీర్ ప్రకటించారు. ఆ మరుసటి రోజే భారత్‌పై యుద్ధానికి దిగుతామంటూ ఆ దేశ విదేశాంగ శాఖ మాజీ మంత్రి బిలావల్ భుట్టో వెల్లడించారు. ఆ మరునాడే అంటే... మంగళవారం సింధు జలాలను పునరుద్ధరించాలని భారత్‌ను పాకిస్థాన్ కోరింది. ఈ నదీ జలాల విషయంలో కోర్టు ఆర్బిట్రేషన్ వివరణను తాము స్వాగతిస్తామని పాక్ స్పష్టం చేసింది. ఈ ఒప్పందాన్ని పూర్తిగా అమలు చేయడానికి తాము కట్టుబడి ఉన్నామని పేర్కొంది. సింధు జలాల ఒప్పందాన్ని అనుసరించి... ఈ నదీ జలాలను వెంటనే పునరుద్ధరించాలని భారత్‌ను కోరింది. ఈ ఒప్పందంలో భాగంగా చేసుకున్న హామీలను నమ్మకంగా అమలు చేయాలని భారత్‌ను అభ్యర్థించింది. ఈ మేరకు పాకిస్థాన్ విదేశాంగ శాఖ మంగళవారం తన ఎక్స్ ఖాతా వేదికగా భారత్‌ను వేడుకుంది. శతాబ్దాల క్రితం చేసుకున్న సింధు జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేయడంపై పాక్ మాజీ మంత్రి బిలావల్ భుట్టో సోమవారం స్పందించారు. భారత్ నిర్ణయం కారణంగా పాకిస్థాన్‌కు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. భారత్ ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా పాకిస్థానీయులంతా ఏకతాటిపైకి రావాలంటూ పిలుపునిచ్చారు. ఈ పిలుపు ఇచ్చిన మరునాడే... సింధు జలాలను విడుదల చేయాలంటూ భారత్‌ను పాకిస్థాన్ ప్రాధేయపడింది. పహల్గాం ఉగ్రదాడి వెనుక కర్త, కర్మ, క్రియ అంతా పాకిస్థాన్ అని భారత్ నిర్ణయించింది. దీంతో 1960లో భారత్, పాకిస్థాన్ మధ్య చేసుకున్న సింధు నదీ జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు భారత్ ప్రకటించింది. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ మరికొన్ని నిర్ణయాలు తీసుకుంది. పాక్ సైతం భారత్‌కు వ్యతిరేకంగా పలు నిర్ణయాలు తీసుకుంది. దీంతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. సింధు జలాలను భారత్ నిలిపివేయడంతో పాకిస్థాన్‌లో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడింది. నీటిని విడుదల చేయాలంటూ పాకిస్థాన్ కోరినా... భారత్ మాత్రం కనికరించలేదు.

విజయ్ టార్గెట్ డీఎంకే, బీజేపీ

చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ వ్యూహాలు రచిస్తున్నాడు. శివాజీ గణేషన్, విజయకాంత్, శరత్ కుమార్, కమల్ హాసన్ వంటి ప్రముఖులు తమ ప్రజాదరణను ఎన్నికల విజయంగా మార్చుకోలేకపోయినా... విజయ్ మాత్రం ఈ పరంపరను చెరిపేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రానున్న ఎన్నికల్లో ఏఐఏడీఎంకేతో పొత్తు ఉండే అవకాశం ఉందని ఊహాగానాలు వినిపిస్తుండటంతో విజయ్ మాత్రం ఇప్పటి వరకు ఆ పార్టీపై విమర్శలు చేయలేదు. ఇటీవల పార్టీ సభ్యత్వ నమోదు యాప్ ప్రారంభోత్సవంలో ఆయన డీఎంకే వ్యవస్థాపకుడు సీఎన్ అన్నాదురై వారసత్వాన్ని స్మరించుకున్నారు. ప్రజల దగ్గరకు వెళ్లండి, వారితో జీవించండి, వారి నుంచి నేర్చుకోండి, వారితో ప్రణాళిక వేయండి అనే అన్నాదురై సూత్రాన్ని పార్టీ కార్యకర్తలకు ఆయన చెప్పుకొచ్చారు. ప్రతి ఇళ్లు, వీధి, గ్రామం అనే తేడా లేకుండా తిరుగుతూ అవిశ్రాంతంగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా విజయ్ పర్యటనలు, సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా కొనసాగుతుంది. ఇదేసమయంలో తన పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి విజయ్ ఉద్వేగభరిత లేఖ రాశారు. ఆగస్టు 21వ తేదీన మదురైలో జరగనున్న పార్టీ రెండవ రాష్ట్రస్థాయి సమావేశానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని మన రాజకీయ శత్రువులు, సైద్ధాంతిక శత్రువులపై పోరాడి గెలవడానికి ఒక నిర్ణయాత్మక అడుగుగా భావించాలని పేర్కొన్నారు. ఈ సమావేశం ద్వారా తమిళనాడు రాజకీయాల్లో టీవీకే పార్టీ ప్రధాన శక్తిగా ఎదుగుతుందన్నారు. మదురైలో జరిగే సమావేశం తర్వాత రాష్ట్రంలో పూర్తిస్థాయి ప్రచారానికి విజయ్ దళపతి సన్నాహాలు రచిస్తున్నారు.

వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్

పథకం ప్రారంభించిన స్టాలిన్

చెన్నై: రాష్ట్రవ్యాప్తంగా 21.7 లక్షలకు పైగా వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేసే 'తాయుమనవర్ తిట్టం' పథకాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మంగళవారం ప్రారంభించారు. ప్రతి నెలా రెండవ శనివారం, ఆదివారం లబ్దిదారుల ఇంటివద్దకే పంపిణీ చేయనున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) కింద 70 ఏళ్లు పైబడిన 20,42,657 మంది వృద్ధులు, 1,27,797 మంది విభిన్న ప్రతిభావంతులకు 34,809 రేషన్ దుకాణాల నుండి సరుకు పంపిణీ చేయనున్నారు. ఈ పథకం కోసం రూ.30.16 కోట్ల అదనపు ఖర్చు చేయనున్నామని, ప్రజలకు సేవ చేయడం, రక్షించడమే తమ కర్తవ్యంగా భావిస్తున్నామని స్టాలిన్ పేర్కొన్నారు. తనకు ఇష్టమైన కార్యక్రమాల్లో ఇది ఒకటని, ఈ చొరవ దేశానికి ఆదర్శమని అన్నారు. నాలుగేళ్లలో 2,394 రేషన్ దుకాణాలు ప్రారంభించినట్లు గుర్తు చేసుకున్నారు. చెన్నైలోని తొండియార్‌పేటలో జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి పీకే శేఖర్ బాబు, పలువురు ఎమ్మెల్యేలు సహా సీనియర్ అధికారులు హాజరయ్యారు.

మీ మౌనమూ నేరమే!

- ఇజ్రాయిల్ చర్యలపై నిష్క్రియాత్మక వైఖరి ఎందుకు
- సర్కారుపై ప్రియాంక ఆగ్రహం: గాజా జర్నలిస్టుల హత్యలకు ఖండన

న్యూదిల్లీ: పలస్తీనియన్ల దుస్థితి, ఇజ్రాయిల్ దురాక్రమణపై మౌనం, నిష్క్రియాత్మక వైఖరి ఎందుకంటూ మోదీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా నిలదీశారు. ప్రశ్నించకపోవడం, నేరాలను ఖండించకపోవడం కూడా నేరమేనంటూ ఎక్స్ మాధ్యమంగా వ్యాఖ్యానించారు. హింసతో ధైర్యాన్ని దెబ్బతీయలేరని వక్కాణించారు. గాజా జర్నలిస్టుల హత్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. అల్ జజీరా జర్నలిస్టులు ఐదుగురిని దారుణంగా చంపేశారని, పలస్తీనా భూభాగంగా మరో హేయమైన నేరం జరిగిందని పోస్టు పెట్టారు. నిజం కోసం పోరాడేవారి శౌర్యాన్ని ఇజ్రాయిల్ విద్వేషం, హింస దెబ్బతీయలేదని ప్రియాంక నొక్కిచెప్పారు. 'మీడియా అధికారానికి, కార్పొరేట్లకు దాసోహమైన వేళ నిజమైన జర్నలిజాన్ని ఈ ధైర్యవంతులు గుర్తుచేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలి' అంటూ పోస్టు పెట్టారు. గాజాలో ఇజ్రాయిల్ దాడులను ప్రియాంక గతంలోనూ అనేక సార్లు ఖండించారు. పలస్తీనా ప్రజలకు ఎప్పుడూ సంఘీభావం తెలిపారు. మంగళవారం ఉదయం ఎక్స్ మాధ్యమంగా స్పందిస్తూ '60వేల మందికిపైగా పలస్తీనియన్లను ఇజ్రాయిల్ చంపేసింది. ఇందులో 18,430 మంది పిల్లలు ఉన్నారు. చిన్నారులు సహా వందల మందిని పస్తులు పెట్టి చంపుతోంది. వేల మందిని ఆకలితో అలమటించేలా చేస్తోంది. ఇలాంటి హేయమైన నేరాలపై మౌనం వహించడం, ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం కూడా నేరమే అవుతుంది. భారత ప్రభుత్వ నిష్క్రియాత్మక వైఖరి సిగ్గుచేటు' అని ప్రియాంక వ్యాఖ్యానించారు. జర్నలిస్టుల గుడారంపై ఇజ్రాయిల్ వైమానిక దాడిని ఐరాస మానవ హక్కుల కార్యాలయం ఖండించింది. ఇజ్రాయిల్ చర్యలను అంతర్జాతీయ మానవతా చట్టాల అతిక్రమణగా పేర్కొంది.

హమాస్ లెక్కలు నమ్మవద్దు: ఇజ్రాయిల్

ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా ప్రియాంక చేసిన వ్యాఖ్యలను భారత్‌కు ఇజ్రాయిల్ రాయబారి రూవెన్ అజార్ తీవ్రంగా ఖండించారు. హమాస్ లెక్కలు నమ్మవద్దని అన్నారు. 'మీ మోసమే సిగ్గుచేటు' అంటూ ఎదురు దాడికి దిగారు. 'ఇజ్రాయిల్ 25 వేల మంది హమాస్ ఉగ్రవాదులను హతమార్చింది. పౌరుల వెనుక నక్కి హమాస్ చేసే దారుణాలకు గుణపాఠం నేర్పింది. హమాస్ కాల్పులు, క్షిపణి దాడులతో తీవ్రస్థాయిలో ప్రాణ నష్టం సంభవించింది. గాజాకు రెండు మిలియన్ టన్నుల ఆహారాన్ని ఇజ్రాయిల్ చేరవేస్తే, హమాస్ స్వాధీనం చేసుకుంది. అందుకే అక్కడ కరువు ఏర్పడింది. గత 50ఏళ్లలో గాజా జనాభా 450 శాతం పెరిగింది. మారణహోమం జరగలేదు. హమాస్ లెక్కలు నమ్మవద్దు' అని అజార్ పేర్కొన్నారు.

వీధికుక్కల నిర్మూలన సరికాదు

రాహుల్

న్యూదిల్లీ: దిల్లీలో వీధి కుక్కలన్నింటినీ తక్షణమే స్టెరిలైజ్ చేసి షెల్టర్లకు తరలించాలని సుప్రీంకోర్టు ఎన్‌సీఆర్ (దిల్లీ) అధికారులను ఆదేశించడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. మనం రోజు రోజుకూ సైన్స్, మానవత్వం లేని ప్రాచీన యుగంలోకి వెళ్లిపోతున్నట్లు ఉందని వ్యాఖ్యానించారు. 'మూగజీవాలైన కుక్కలు సమాజంలో పెద్ద సమస్య కాదు. వాటిని పూర్తిగా నిర్మూలించడం సరైన చర్య కాదు. ప్రజలకు భద్రత కల్పించాలనుకుంటే వాటికి స్టెరిలైజేషన్ టీకాలు వేయడం వంటి చర్యలు తీసుకోవాలి' అని సూచించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. వీధి కుక్కల కాటు వల్ల రేబీస్ వ్యాధి వ్యాప్తి చెందుతోందని, పిల్లలు దీనికి గురవుతుండడంతో పరిస్థితి చాలా దయనీయంగా ఉందని, వీధి కుక్కల కోసం షెల్టర్లు ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. తమ ఆదేశాలకు అవరోధాలు కల్పించడానికి వ్యక్తులు కాని, సంస్థలు కాని ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన ధర్మాసనం హెచ్చరించింది. అవసరమైతే కోర్టు ధిక్కరణ ప్రక్రియ చేపడతామని కూడా ధర్మాసనం హెచ్చరించింది.

సీజేఐకి నటులు అడివి శేష్, జాన్ అబ్రహం లేఖ

దిల్లీలో వీధి కుక్కలు కనిపించకూడదని 'సుప్రీం' ఇచ్చిన ఆదేశాలను పునఃపరిశీలించాలని అభ్యర్థిస్తూ సినీ నటుడు అడివి శేష్, బాలీవుడ్ స్టార్ జాన్ అబ్రహం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌కు లేఖ రాశారు. దిల్లీ సీఎం రేఖా గుప్తాకు కూడా లేఖ రాసినట్లు శేష్ ఈ సందర్భంగా వెల్లడించారు. 'దిల్లీలో మూడు లక్షల వీధి కుక్కలున్నాయి. వీటికోసం మూడు వేల షెల్టర్లు కావాలి. వీటి ఏర్పాటుకు రూ.15 వేల కోట్లు ఖర్చు చేసే పరిస్థితిలో దిల్లీ ప్రభుత్వం ఉందా?' అని ప్రశ్నించారు. దిల్లీలో ఉన్నవి వీధి కుక్కలు కాదు... అవి కమ్యూనిటీ డాగ్స్ అని, ఎంతో మంది వాటిని గౌరవిస్తారని, అవి దిల్లీ ప్రజల సొంతం అని, కొన్ని తరాలుగా అవి అక్కడ జీవిస్తున్నట్లు జాన్ తన లేఖలో తెలిపారు. జంతు సంరక్షకుడిగా కొన్ని దశాబ్దాలు పనిచేశానని, సుప్రీం ఇచ్చిన ఆదేశాలు యానిమల్ బర్త్ కంట్రోల్ రూల్స్‌కు వ్యతిరేకంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కుక్కల తరలింపును ఏబీసీ రూల్స్ నిషేధిస్తాయన్నారు. జైపూర్‌లో 70 శాతం, లక్నోలో 84 శాతం కుక్కలను స్టెరిలైజ్ చేశారన్నారు. బాలీవుడ్ సెలబ్రిటీలు వరున్ ధావన్, జాన్వీ కపూర్ సుప్రీం ఆదేశాలకు విరుద్ధంగా నిలిచారు. సుప్రీం ఆదేశాలు కుక్కలకు మరణశాసనంగా మారిందన్నారు.

జీపీఆర్ టెక్నాలజీతో ధర్మస్థలిలో మృతదేహాల గుర్తింపు

కర్నాటక: దక్షిణ కన్నడలోని ధర్మస్థలిలో జీపీఆర్ టెక్నాలజీతో మృతదేహాలను గుర్తిస్తున్నారు. అక్కడ సామూహికంగా వందల సంఖ్యలో అమ్మాయిల మృతదేహాలను పాతిపెట్టినట్లు ఓ మాజీ పారిశుధ్య కార్మికుడు ఇచ్చిన సమాచారం మేరకు అక్కడ గత కొన్ని రోజుల నుంచి తొవ్వకాలు జరుగుతున్నాయి. తాజాగా నేత్రావతి నది పరివాహక ప్రాంతంలో ఖనన ప్రదేశాలను వెలికితీస్తున్నారు. పాయింట్ నెంబర్ 13 వద్ద మంగళవారం గాలింపు చేపట్టారు. అయితే మృతదేహాలను గుర్తించేందుకు డ్రోన్ ఆధారిత జీపీఆర్ సాంకేతికతను వాడుతున్నారు. గ్రౌండ్ పెనట్రేటింగ్ రేడార్‌తో పాతిపెట్టిన కళేబరాలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. అక్కడ ప్రత్యేక దర్యాప్తు బృందం అవయవాల వెలికితీత చేపడుతోంది. తొలిసారి జీపీఆర్ టెక్నాలజీతో ఆ ప్రాంతాన్ని జల్లెడపడుతున్నారు. గ్రౌండ్‌కు సమీపంగా ఆ డ్రోన్ వెళ్తుంది. భూమిలోకి సిగ్నల్ పంపిస్తుంది. సెన్సార్ల ద్వారా వస్తున్న డేటాను రికార్డు చేస్తారు. రేడార్లు ఇచ్చిన ఇన్ఫర్మేషన్‌తో 2డీ, 3డీ ఇమేజింగ్ చేస్తారు. నదీ ప్రాంతంలో భూమిలోపల ఉన్న ఎటువంటి వస్తువునైనా ఈ టెక్నాలజీతో గుర్తిస్తారు. పాయింట్ 13 ఇప్పుడు ఈ కేసులో కీలక ప్రదేశంగా మారింది. ఇక్కడ ఉన్న నేలతో పాటు సమీప ప్రాంతాలను కూడా జీపీఆర్ టెక్నాలజీతో గాలింపు చేపట్టనున్నారు. సిట్ అధికారులతో పాటు రెవన్యూ, పంచాయతీ సిబ్బంది ఈ ప్రాంతాన్ని శుభ్రం చేస్తున్నారు. సామూహిక ఖననం జరిగిన ప్రదేశం గురించి ఏదైనా సమాచారం దొరుకుతుందని భావిస్తున్నారు. సైట్ వద్ద సుమారు 50 మంది పోలీసుల్ని మోహరించారు. ధర్మస్థలి ప్రాంతంలో 1995 -2014 మధ్య... వందల సంఖ్యలో అమ్మాయిలు, మహిళలను రేప్ చేసి హత్య చేశారని, వారిని సామూహికంగా పాతిపెట్టినట్లు ఓ పారిశుధ్య కార్మికుడు జూన్ మూడో తేదీన ఫిర్యాదు చేశాడు. ధర్మస్థల ఆలయ బోర్డులో అతడు జీతం తీసుకున్నట్లు ఆధారాలు ఉన్నాయి. అనేక మంది అమ్మాయిల అదృశ్య కేసులు అక్కడ నమోదు అయ్యాయి. నేత్రావతి నదీ తీరం వెంబడి సామూహిక ఖనన ప్రదేశాల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రాజన్నను మళ్లీ మంత్రివర్గంలోకి తీసుకోండి

తమకూరులో మద్దతుదారుల భారీ నిరసన ప్రదర్శన

బెంగళూరు: మంత్రివర్గం నుంచి కేఎన్ రాజన్నను తొలగించడాన్ని నిరసిస్తూ ఆయన మద్దతుదారులు ఆందోళన చేపట్టారు. తుమకూరు జిల్లా మధుగిరిలో మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. మధుగిరి బంద్‌కు పిలుపునిచ్చారు. వేలాది మంది కార్యకర్తలు, మద్దతుదారులు రాజన్నకు మద్దతుగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఓ మద్దతుదారుడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. పలువురు కార్యకర్తలు అడ్డుకున్నారు. మధుగిరి మునిసిపాలిటీ వార్డు సభ్యులు, నేతలు సామూహిక రాజీనామాలు చేశారు. ఈ వ్యవహారంలో బీజేపీ సైతం స్పందించింది. శాసనసభ సమావేశంలో ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభానికి ముందు ప్రతిపక్ష నాయకుడు ఆర్.అశోక్... రాజన్నను పదవి నుంచి ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. దానిపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్పీకర్ ఖాదర్ కల్పించుకొని ఇది పార్టీ అంతర్గత విషయమన్నారు. అయితే, బీజేపీ సభ్యులు తీవ్ర అభ్యంతరం చెప్పారు. రాజన్న తొలగింపునకు దారితీసిన కుట్రలు, కాంగ్రెస్‌లోని అంతర్గత విభేదాలపై ప్రతిపక్ష నాయకులు సూటిగా ప్రశ్నలు లేవనెత్తారు. ఎన్నికల అంశంలో చేసిన వ్యాఖ్యలతోనే రాజన్నను అధికార పార్టీ పక్కనపెట్టిందని.. నిజం చెప్పేవారిని ఎప్పుడూ బలి చేస్తారా? అని అశోక్ ప్రభుత్వాన్ని నిలదీశారు. శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు నారాయణస్వామి ఈ అంశంపై గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి రాసిన లేఖను చదివారు. కాంగ్రెస్ చీఫ్ విప్ సలీం అహ్మద్ అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ విషయంపై వివరణ ఇవ్వాలని ప్రతిపక్ష బీజేపీ సభ్యులు పట్టుబట్టారు. రాజన్న తొలగింపునకు కారణాలు చెప్పాలని మద్దతుదారులతో పాటు ప్రతిపక్షాలు సైతం డిమాండ్ చేస్తున్నాయి.

కార్గో విమానం ఇంజిన్‌లో మంటలు



చెన్నై: మలేషియా కౌలాలంపూర్ నుంచి వచ్చిన ఓ కార్గో విమానం ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. రన్‌వేపై దిగుతున్న సమయంలో ఒక్కసారిగా మంటలు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పైలట్ అధికారులకు హెచ్చరికలు పంపారు. అయితే, విమానం సురక్షితంగా దిగడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పైలట్ హెచ్చరికతో అప్రమత్తమైన అత్యవసర సిబ్బంది మంటలను అదుపుచేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. ఎవరికీ గాయాలు కాలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

విశాలాంధ్ర హైదరాబాద్

ఈవీఎం గోడౌన్ సందర్శన

విశాలాంధ్ర, హైదరాబాద్ : మంగళవారం రంగారెడ్డి జిల్లా రాజేందర్ నగర్ లో గల ఈవీఎం గోడౌన్‌ను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్ర స్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించి, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి.ప్యాట్లు, ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. అదనపు కలెక్టర్ వెంట రాజేందర్ నగర్ ఆర్డీఓ వెంకట్ రెడ్డి, తహశీల్దార్, వేర్ హౌస్ ఇంచార్జీ రాములు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం పరిశీలన

విశాలాంధ్ర, మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని దొడ్డ బస్తీ అంగన్వాడీ కేంద్రాన్ని కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ డిప్యూటీ కమిషనర్ జకీయ సుల్తానాతో కలిసి పరిశీలించారు.. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రానికి మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని మంచినీటి సదుపాయం కల్పించాలని పవర్ బోర్ రిపేరింగ్ చేయించాలని అంగన్వాడీ కేంద్రం మరమ్మతులకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈ ఈ లక్ష్మణ్, ఏఎంహెచ్ఓ మంజుల, డి.ఈ లౌక్య,ప్రాజెక్ట్ అధికారి మల్లికార్జున్, ఏ.ఈ దివ్యజ్యోతి, వాటర్ వర్క్స్ మేనేజర్ నవీన్, వర్క్ ఇన్స్పెక్టర్ రజనీకాంత్, నాయకులు సత్యమూర్తి, సత్యనారాయణ, అరుణ్, రత్న భూషణ్, రామకృష్ణ, స్థానికులు కర్ణం గోపి, వెంకటేష్, వినయ్ కుమార్, రాము, విందు రాజు, శ్రీనివాస్, అంగడి అంగన్వాడి కేంద్రం చంద్రకళ, హేమలత, భారతమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహా సభలు విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర - మొయినాబాద్: సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేద్దామని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె .రామస్వామి పిలుపునిచ్చారు. మొయినాబాద్ మండల కేంద్రంలో పార్టీ కార్యదర్శి కె.శ్రీనివాస్ అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర భారత కమ్యూనిస్టు పార్టీ 4వ మహాసభలకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 19 నుంచి 22 వరకు మేడ్చల్ జిల్లాలోని కుత్బుల్లాపూర్ గాజుల రామారం ప్రాంతంలో తెలంగాణ రాష్ట్ర భారత కమ్యూనిస్టు పార్టీ 4వ మహాసభలు జరుగుతాయని తెలిపారు. ఈ మహాసభలలో పార్టీ భవిష్యత్తు కార్యచరణ, ఇండ్లులేని నిరుపేదల కోసం భూ - పోరాటాలు, ఇండ్ల పట్టాల కోసం కార్యచరణ రూపొందిస్తారని , కార్మికుల హక్కుల సాధనకై భవిష్యత్తు కార్యచరణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభు లింగం, వడ్ల సత్యనారాయణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు సుధాకర్ గౌడ్, వడ్ల మంజుల, మండల సహాయ కార్యదర్శి ఎండి. జలీల్, పార్టీ సీనియర్ నాయకులు వెంకటయ్య, బాల మణి, రాములు, నరసింహులు, పాండు తదితరులు పాల్గొన్నారు.

సీఎం అమీర్ పేట్‌లో పర్యటన జూబ్లీహిల్స్ ఎన్నికల స్టంట్ : దిడ్డి సుధాకర్

విశాలాంధ్ర, బషీర్ బాగ్: ఇటీవల కురిసిన వర్షాలకు హైదరాబాద్ మొత్తం జలదిగ్బంధంలో ఉందని, ముఖ్యమంత్రి కేవలం అమీర్ పేట్ లో మాత్రమే పర్యటించడం అంటే అది జూబ్లీహిల్స్ ఎన్నికల స్టంట్ మాత్రమే అని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ ఇన్చార్జి కన్వీనర్ రెడ్డి సుధాకర్ అన్నారు. హైదరాబాదులో అనేక ప్రాంతాలు జలదిగ్బంధంలో ఉన్నాయి కానీ అమీర్పేటలో పర్యటించడం ఒక్కటే సరిపోదు, అన్ని ప్రాంతాలను పర్యటించి అక్కడి ప్రజల సాధక బాధలు తెలుసుకొని వారిని ఆదుకోవాలన్నారు. ముఖ్యమంత్రి అమీర్పేట్ లో పర్యటించి జిహెచ్ఎంసి అధికారులను బెదిరించడం విడ్డూరంగా ఉందన్నారు. వర్షాల తర్వాత చాలామంది రోగాల బారిన పడుతున్నారనీ వెంటనే యుద్ధ ప్రాతిపదికన వారికి సరియైన వైద్య సదుపాయం ప్రభుత్వం కల్పించాలన్నారు. రాబోయే కాలంలో ఈ రోగాలు ఇంకా పెరుగుతాయనీ, ముందు జాగ్రత్త చర్యలు ప్రభుత్వం తీసుకోవాలి అని అన్నారు. జిహెచ్ఎంసికి కేటాయించిన బడ్జెట్ ఇచ్చి ఉంటే హైదరాబాద్ పరిస్థితి ఇట్లా ఉండేది కాదన్నారు. దీనికి భాద్యత వహించి హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి వెంటనే రాజీనామా చేయాలి అని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర అధ్యక్షులు బుర్ర రాము గౌడ్, రాష్ట్ర నాయకులు విజయ ముల్లంగి, రాష్ట్ర మహిళా నాయకురాలు యమునా నర్సింగ్ గౌడ్ , రాష్ట్ర నాయకులు దర్శనం రమేష్, మామిడి శెట్టి శివాజ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతతో రోగులకు ఉత్తమ చికిత్స : మంత్రి

విశాలాంధ్ర, హైదరాబాద్ : ఆధునిక వైద్య సాంకేతికతతో రోగులకు ఉత్తమ చికిత్స అందించవచ్చని, త్వరగా కోలుకోవడానికి ఎక్కువ ఆస్కారం ఉంటుందని తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డీ.శ్రీధర్ బాబు తెలిపారు. దక్షిణాదిలో ఆర్థోపెడిక్స్, ట్రామా కేర్‌లో ఉదయ్ ఓమ్ని ఎంతో పేరుగాంచింది. అబిడ్స్ చాపెల్ రోడ్డులో ఉన్న ఉదయ్ ఓమ్ని హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన 'అత్యాధునిక మిస్సో రోబోటిక్ వ్యవస్థ'ను మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఇది దక్షిణ భారతదేశంలో అత్యంత కచ్చితత్వంతో కూడిన మొదటి ఆర్థోపెడిక్ వ్యవస్థగా చెప్పవచ్చు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉదయ్ ఓమ్ని హాస్పిటల్ తెలంగాణకు ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణలను తీసుకురావడంలో ముందంజలో ఉందన్నారు. ఇక్కడ రోబోటిక్ సర్జరీ ప్రారంభించడం వల్ల ఎంతో మంది రోగులకు ప్రయోజనం చేకూరుతుం దన్నారు. ఈ ప్రాంతంలో ఆర్థోపెడిక్ సంరక్షణ ప్రమాణాలు మరింత పెరుగుతా యన్నారు. సాంకేతికత మానవ జీవితాల్లో సానుకూల మార్పునకు శక్తివంతమైన ప్రేరణగా మారిందన్నారు. ఆధునిక ఆవిష్కరణలతో వైద్య రంగంలో జరిగిన మార్పులు అద్భుతమైనవన్నారు. శస్త్రచికిత్స తర్వాత కలిగే ఇబ్బందుల నుంచి బయటపడిన రోగుల ఆనందాన్ని మాటల్లో చెప్పలేమన్నారు. నైపుణ్యం కలిగిన వైద్యుడి చేతుల్లో జీవితాన్ని మార్చే శక్తి ఉంటుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా రోబోటిక్ సర్జరీలు ఏటా 15 శాతం వృద్ధి చెందుతున్నాయని చెప్పారు. 2030 నాటికి మార్కెట్ 18 బిలియన్లకల డాలర్లకు చేరుకుంటుందని అంచనా ఉందన్నారు.

భారతదేశంలో ఈ వృద్ధి మరింత వేగంగా ఏటా 20 శాతంతో కొనసాగుతోందన్నారు. ఇది రాబోయే కాలంలో ఉన్న అపారమైన అవకాశాలు, భవిష్యత్తు సామర్థ్యాన్ని తెలియజేస్తుందని పేర్కొన్నారు. పేదలకు ఉత్తమ వైద్య సేవలు అందించడానికి, ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఆధునిక వైద్య సాంకేతికతను ప్రవేశపెట్టడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉదయ్ ఓమ్ని హాస్పిటల్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీ చీఫ్, డైరెక్టర్, ఎఫ్ఆర్సీస్ (ట్రామా, ఆర్థో) యూకే డాక్టర్ ఉదయ్ ప్రకాశ్ మాట్లాడుతూ దక్షిణాదిలో ఆర్థోపెడిక్స్, ట్రామా కేర్‌లో ఉదయ్ ఓమ్ని యాభై ఏళ్లగా ఎంతో పేరు సంపాదించింది. శస్త్రచికిత్సలు చేయడంలో నాకు ముప్పై ఏళ్ల అనుభవం కలదన్నారు. ఈ మూడు దశాబ్దాలలో వేల మోకాలి, నడుము శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఈ అత్యాధునిక రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ విభాగంతో కచ్చితమైన సేవలు అందించవచ్చన్నారు. సంప్రదాయ జాయింట్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సలలో అత్యుత్తమ ఫలితాలు ఉన్నాయన్నారు. ఎంతటి నైపుణ్యం కలిగిన శస్త్రచికిత్స నిపుణులైనా ఎముకల అమరికలో స్వల్ప తేడాలు, గ్యాప్ బ్యాలెన్స్‌లో అసమానతలు, కట్‌లలో కచ్చితత్వ లోపం, అధిక కణజాల నష్టం వంటి సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. ఇవి రోగి కదలిక సామర్థ్యం తగ్గిపోవడం, నిరంతర అసౌకర్యం, ఇంప్లాంట్ కాలం తగ్గిపోవడం వంటి సమస్యలకు దారి తీయవచ్చన్నారు. అధ్యయనాల ప్రకారం.. సరైన అమరిక, పటిష్టమైన ఫిక్సేషన్ వల్ల ఇంప్లాంట్ ఎక్కువ కాలం మన్నికగా ఉండే అవకాశాలు కలవన్నారు. ఉదయ్ ఓమ్ని హాస్పిటల్ ఈ నెలాఖరులో అత్యాధునిక క్యాత్ ల్యాబ్‌ను ప్రారంభించనుందన్నారు. గుండె చికిత్స సేవలను మరింత బలోపేతం చేయనుందని చెప్పారు. అదనంగా, కృత్రిమ మేధ ఆధారిత డయాగ్నస్టిక్ సాంకేతికతను అనుసంధానం చేయడం, మినిమల్ ఇన్వాసివ్ శస్త్రచికిత్సలను విస్తరించడం, శస్త్రచికిత్స అనంతర కోలుకోవడం, పునరావాసాన్ని మెరుగుపర చడం, అధునాతన ఫిజియోథెరపీ విభాగాలను అభివృద్ధి చేయడం వంటి ప్రణాళికలు కూడా కొనసాగుతున్నాయని చెప్పారు. ఉదయ్ ఓమ్ని హాస్పిటల్‌ను 1974లో డాక్టర్ వేద్ ప్రకాశ్ స్థాపించారు. ఆర్థోపెడిక్స్, స్పైన్ సర్జరీ, ట్రామా కేర్, పీడియాట్రిక్ ఆర్థోపెడిక్స్, స్పోర్ట్స్ మెడిసిన్ రంగాల్లో ఎంతో పేరు గడించింది. నైతిక వైద్య సేవలను అత్యాధునిక సాంకేతికతతో మేళవిస్తూ.. భారత్‌లోని వివిధ ప్రాంతాలు, విదేశాల నుంచి వచ్చే రోగులకు సేవలందిస్తూ విశ్వసనీయతకు మారు పేరుగా నిలిచింది.

ఖజానా జ్యువెలరీలో కాల్పుల కలకలం

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: పట్టపగలు.. చుట్టూ జనం.. మరోపక్క సీసీ కెమెరాలు.. చూస్తుండగానే బంగారు షాపును దోచుకెళ్లారు దొంగలు! మొహానికి ముసుగులు, చేతిలో తుపాకులతో సినిమా లెవెల్లో దోపిడీకి ప్లాన్ చేశారు. షాపు తెరిచిన 5 నిమిషాల్లోనే లోపలి చొరబడి అందినంతా మాయం చేశారు. అడ్డొస్తే తుపాకులతో బెదిరించి, కాల్పులు జరిపి దోపిడీకి తెగబడ్డారు. హైదరాబాద్‌లోని చందానగర్ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఖజానా జ్యువెల్లర్స్ షాపులో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న జ్యువెలరీ దుకాణంలో దుండగులు చోరీకి యత్నించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. వివరాల్లోకి వెళితే... మంగళవారం ఉదయం చందానగర్‌లోని ఖజానా జ్యువెలరీ దుకాణంలోకి చొరబడిన దొంగలు.. లాకర్ తాళంచెవి ఇవ్వాలని తుపాకీతో సిబ్బందిని బెదిరించారు. దీనికి సిబ్బంది నిరాకరించడంతో కాల్పులు జరిపారు. దీంతో డిప్యూటీ మేనేజర్ కాలికి గాయాలయ్యాయి. లోపల బంగారు ఆభరణాలకు

సంబంధించిన స్టాల్స్ విరగ్గొట్టి సిబ్బందిపై దాడులకు సైతం పాల్పడ్డారు. భయాందోళనలకు గురైన సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులను చూసిన దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. నిందితుల కోసం పది బృందాలను ఏర్పాటుచేసి గాలిస్తున్నారు. ఈ ఘటనలో ఆరుగురు దుండగులు పాల్గొన్నట్లు, రెండు రౌండ్ల ఫైరింగ్ జరిపినట్లు తెలుస్తున్నది. తుపాకీ పేల్చి సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. షాపు తెరచిన 5 నిమిషాల్లోనే దోపిడీకి దుండగులు యత్నించారు. జహీరాబాద్ వైపు దొంగలు పారిపోయినట్లు తెలుస్తున్నది. దీంతో జిల్లాల సరిహద్దులను పోలీసులు అలర్టు చేశారు. మొత్తం ఎంత మంది వచ్చారనే విషయమై స్థానికంగా ఉన్న ట్రాఫిక్ సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఇతర షోరూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కూడా పరిశీలిస్తున్నారు.

దుండగులు బంగారు ఆభరణాల కౌంటర్లను తెరవలేకపోయారు: సీపీ

ఉదయం 10.30 గంటలకు దొంగల ముఠా దుకాణంలో చొరబడిందని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి తెలిపారు. వారి కాల్పుల్లో డిప్యూటీ మేనేజర్ గాయపడ్డారని చెప్పారు. బంగారు ఆభరణాలు ఉన్న కౌంటర్లను దుండగులు తెరవలేకపోయారని పేర్కొన్నారు. వెండి ఆభరణాలు ఉన్న కౌంటర్లు ధ్వంసం చేసి వెండి వస్తువులు ఎత్తుకెళ్లారని తెలిపారు. వెండి ఎంత ఎత్తుకెళ్లారనే విషయంలో ఇంకా స్పష్టత రాలేదన్నారు. బుల్లెట్ గాయమైన డిప్యూటీ మేనేజర్ పరిస్థితి బాగానే ఉందని వివరించారు.

ఫ్లైఓవర్ పనులు త్వరగా పూర్తి చేయాలి : కమిషనర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : కనెక్టివిటీ నీ పెంచడం, ట్రాఫిక్ ఇబ్బందులను దూరం చేసేందుకు ఉద్దేశించిన నల్గొండ ఎక్స్ రోడ్ నుంచి ఓవైసీ జంక్షన్ వరకూ నిర్మిస్తున్న స్టీల్ ఫ్లైఓవర్ పనుల్లో వేగం పెంచి సాధ్యమైనంత త్వరగా ప్రజలకు అదుబాటులోకి తీసుకురావాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బాలాలా, చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్నలతో కలిసి నల్గొండ ఎక్స్‌రోడ్ నుంచి ఓవైసీ జంక్షన్ వరకు నిర్మాణంలో ఉన్న 2.58 కిలోమీటర్ల నాలుగు లైన్ల బైడైరెక్షనల్ ఫ్లైఓవర్ నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ ప్రాజెక్టు స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (SRDP)లో భాగంగా చేపట్టారు. చంచల్‌గూడ ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్ నుంచి సైదాబాద్, ఐఎస్ సదన్ మీదుగా యాదగిరి థియేటర్ వరకు సాగనున్న ఈ ఫ్లైఓవర్ రూ.620 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు.

నగరంలోని రద్దీగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు, ట్రాఫిక్ రహిత రవాణా మార్గాన్ని అందించేందుకు ఇది కీలకంగా మారనుంది. పరిశీలన సందర్భంగా కమిషనర్ పనులను నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రాజెక్ట్ ఇంజనీర్లు 2026 మార్చిలోగా పనులు పూర్తి చేస్తామని ఈ సందర్భంగా కమిషనర్, ఎమ్మెల్యే లకు తెలిపారు. భూ సేకరణ పెండింగ్ సమస్యలను టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం కమిషనర్ మలక్‌పేట్ ఆర్ యూబి వద్ద వరద నీటి నిల్వ సమస్యను పరిశీలించారు. దీనికి ప్రత్యామ్నాయ డ్రైనేజ్ మార్గాలను పరిశీలించి ప్రతిపాదనలు ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం కమిషనర్ దబీర్‌పురా ప్రాంతంలోని నాలాలను పరిశీలించారు. వర్షాల సమయంలో నాలాలో వర్షపు నీరు సజావుగా ప్రవహించేలా చూస్తూ నాలా సమీప ప్రాంతాల ప్రజలు వరద ముంపుకు గురికాకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ కర్ణన్ మాట్లాడుతూ, నల్గొండ ఎక్స్ రోడ్ నుంచి ఓవైసీ జంక్షన్ వరకు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ సమీప ప్రాంతాల మధ్య కనెక్టివిటీ పెంచడంలో, ట్రాఫిక్ ఇబ్బందులు దూరం చేయడంలో కీలకంగా నిలుస్తుందన్నారు. అన్ని క్షేత ఇబ్బందులు, సవాళ్లను అధిగమించి, ఈ ప్రాజెక్టు సంబంధించిన భూసేకరణ పూర్తిచేసి నిర్మాణ పనులను 2026 మార్చిలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. క్షేత్ర పర్యటనలో కమిషనర్ వెంట మలక్‌పేట్ డిప్యూటీ కమిషనర్ ఎం.కె. ఐ. అలీ, మెయిం టెనెన్స్ ఈ.ఈ పీర్‌సింగ్, ప్రాజెక్ట్ ఈ.ఈ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న మధ్యతరహా రుణాలకు ప్రాధాన్యత : కలెక్టర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : సూక్ష్మ చిన్న మధ్యతరహా రుణాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి బ్యాంక్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటుచేసిన డిసిసి, డి ఎల్ ఆర్ సి సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఎక్కువ ప్రాధా న్యత ఇవ్వాలని అలాగే విద్యా రుణాలకు ఎక్కువ ప్రాధాన్యత చూపాలని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అదే ప్రభుత్వ లక్ష్యమని అలాగే కోటి మంత్రి మహిళలకు కోటీశ్వరులు చేయాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అదేవిధంగా సూక్ష్మ చిన్న మధ్యతరహ రుణాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె బ్యాంకు అధికారులకు

సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం యొక్క విధివిధానాలు సంబంధిత శాఖ ద్వారా మత్స్యకారులకు అవగాహన కల్పించాలని అలాగే పీఎం విశ్వకర్మ పీఎం స్వనిధి, ముద్ర అలాగే స్టాండ్ అప్ ఇండియా రుణాలు ఎక్కువగా అందేలా చూడాలని ఆమె సూచించారు. జిల్లా వార్షిక ఋణ ప్రణాళిక 2025-26 ప్రకారం వివిధ రంగాలలో రూ.420682.07 కోట్లు రుణాల లక్ష్యం ఉండగా, మొదటి త్రైమాసింలో (జూన్ 2025) రూ. 147528.83 కోట్లు (35.07%)రుణాలు ఇవ్వడం జరిగిందని ఇందులో ఎంఎస్ఎం ఈ రుణాల లక్ష్యం రూ.115649.26 కోట్లు ఉండగా, రూ. 36779.17 కోట్లు (31.80%) మంజూరు చేయటం జరిగిందని అన్నారు. ప్రాధాన్యత రంగ రుణాల లక్ష్యం రూ. 121798.10కోట్లు ఉండగా, రూ. 41585.36 కోట్లు (34.14%) మంజూరు చేయటం జరిగిందని అన్నారు. ప్రణాళిక ప్రకారం రుణాలు మంజూరు చేయుచున్నందుకు బ్యాంకర్స్ ని అభినందిస్తూ ప్రాధాన్య తరంగా రుణాలను ఎక్కువ ఇవ్వాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డిఓ ఆర్బిఐ లక్ష్మి శ్రావ్య, డీడియం నాబార్డ్ హర్ష రఘురాం, ఎల్ డి యం. నరసింహ మూర్తి, వివిధ వాణిజ్య, సహకార, ఆర్‌ఆర్బి బ్యాంకుల కంట్రోలర్స్, జిఎం ఇండస్ట్రీ పవన్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారులు జి ఆశన్న, కోట జి, ప్రవీణ్ కుమార్, డాక్టర్ రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

వ్యవసాయ నిపుణులు

విశాలాంధ్ర- హైదరాబాద్ : ఇటీవల నీలం రాజశేఖరరెడ్డి అధ్యయన కేంద్రం నిర్వహించిన 'సమకాలీన వ్యవసాయం - వ్యవసాయ ఆర్థిక సమస్యలు' సదస్సు నిర్ణయాలను, సూచనలతో కూడిన నివేదికను ఈ సంస్థ డైరెక్టర్, విశ్రాంత రాయబారి డా॥ సురేష్‌బాబు తెలంగాణా ప్రభుత్వ వ్యవసాయ సంక్షేమ కమిషను అధ్యక్షులు శ్రీ కోదండరెడ్డి, శాసనసభ్యులును వారి కార్యాల యంలో ఆగస్టు 11న సమర్పించారు. కోదండ రెడ్డిని కలిసిన బృందంలో ప్రముఖ వ్యవసాయ ఆర్థికవేత్త ప్రొఫెసరు నర్సింహారెడ్డి, ప్రముఖ వ్యవసాయ బయో టెక్నాలజీ శాస్త్రవేత్త డా॥ సోమసుందర్, వ్యవసాయ బ్యాంకింగ్ నిపుణులు శ్రీ పి.ఎస్.ఎం.రావు ఉన్నారు. తొలుత రాజశేఖరరెడ్డి అధ్యయన కేంద్ర డైరెక్టర్ డా॥ సురేస్‌బాబు నిర్వహింపబడిన సదస్సు నిర్ణయాలు, సూచనలతో కూడిన నివేదికను కోదండరెడ్డికి సమర్పించి వివిధ రైతాంగ సమస్యల పరిష్కార క్రమంలో ప్రభుత్వం ఈ నివేదికను పరిశీలించాలని కోరారు. డా॥ నర్సింహారెడ్డి ఏక పంటపైన వరి, ప్రత్తిల ప్రాధాన్యతను తగ్గించి, నూనె గింజలు, పప్పు ధాన్యాలు, చిరు ధాన్యాలు, కాయగూరల సాగుకై ప్రభుత్వం వివిధ ప్రాంతాల సాగుకు అనువైన సస్య ప్రణాళికను తెలంగాణా రాష్ట్రానికి రూపొందించాలని కోరారు. సేంద్రీయ, సుస్థిర సాగును ప్రోత్సహించటానికి కొన్ని జిల్లాల్లోనైనా పైలట్ ప్రాజెక్టులను ప్రారంభించాలని కోరారు. దేశీ మూల విత్తనాలు (జెర్మ్‌ప్లాజమ్)ను వినియోగించి అధిక దిగుబడి, చీడపీడలను తట్టుకొనే పంట రకాలను అభివృద్ధి చేసేలా, రైతులకు చౌకైన, శ్రేష్ఠమైన విత్తనాలను వివిధ పరిశోధనా కేంద్రాల ద్వారా వ్యవసాయ విశ్వ విద్యాలయం సరఫరా చేసే విధంగా ప్రభుత్వం

కృషి చేయాలని కోరారు. వ్యవసాయ బ్యాంకింగ్ నిపుణులు ప్రభుత్వ బ్యాంకుల నుంచి రుణాలు పొందటంతో కౌలు, చిన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, తాను సూచించిన పరిష్కారాలను ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. వ్యవసాయ ఆర్థిక, శాస్త్రవేత్తల సూచనలను, నివేదికను శ్రద్ధగా విన్న వ్యవసాయ సంక్షేమ సంఘ ఛైర్మన్ కోదండరెడ్డి సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తాని పేర్కొన్నారు. ఈ సమావేశ చర్చల్లో వ్యవసాయ కమీషను ఇతర సభ్యులు సునీల్, రాములు నాయక్‌లు చురుకుగా పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాలను స్వాగతిస్తున్నాం : మంత్రి

విశాలాంధ్ర - హైదరాబాద్ : గట్టు వామన్‌రావు దంపతుల హత్య కేసు విచారణను సీబీఐకి అప్పగించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్వాగతించారు. ఇది న్యాయ వ్యవస్థపై ప్రతి ఒక్కరికీ నమ్మకం కలిగించిందని మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేసులో అసలు దోషులు, వారికి సహకరించిన అప్పటి ప్రభుత్వ పెద్దలకు శిక్ష పడితేనే ఆ కుటుంబానికి న్యాయం జరుగుతుందన్నారు. మంథనిలో నడిరోడ్డుపై అడ్వకేట్ వామన్ రావు దంపతులు హత్యకు గురైతే అప్పటీ బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదని విమర్శిం చారు. నిష్పక్షపాతంగా విచారణ చేయకుండా అసలు దోషులను కాపాడిందన్నారు. కుమారుడు, కోడలిని కోల్పోయిన ఆ వృద్ధ తల్లిదండ్రులకు న్యాయం చేయాల్సిన అప్పటి ప్రభుత్వ పెద్దలు.. విచారణను తప్పుదోవ పట్టించి అసలు హంతకులను కాపాడా రని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని ప్రజా సంఘాలు, కాంగ్రెస్ పార్టీ కోరినా పట్టించుకోలేదని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో కీలకమైన న్యాయ వ్యవస్థపై తనకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. చివరకూ... న్యాయమే గెలుస్తుందన్నారు.

గోడౌన్ ప్రారంభం

విశాలాంధ్ర - తూర్కయంజాల్ : మున్సిపాలిటీ పరిధిలోని కోహెడ గ్రామంలో గల సర్వే నంబర్ 507లో తుర్కయాంజల్ రైతు సేవా సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్మించిన ఆధునిక గోదాంను సంఘ రైతులు సభ్యుల ధాన్యం నిల్వ, కొనుగోలు మరియు అమ్మకాల కోసం నిర్మించిన గోదాంను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మరియు టీజీకాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ గోదాం ద్వారా రైతులు తమ పంట ఉత్పత్తులను సురక్షితంగా నిల్వ చేసుకోవడంతో పాటు న్యాయమైన ధరలకు అమ్ముకునే అవకాశాలు పెరుగుతాయని అన్నారు. సంఘ సభ్యుల సంక్షేమం కోసం మరిన్ని సౌకర్యాలను అందించేందుకు కృషి చేస్తాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు వంగేటి లక్ష్మరెడ్డి, సంజీవ్ రెడ్డి, చేపల యాదగిరి, కృష్ణరెడ్డి, కొండ్రు స్వప్న శ్రీనివాస్, చెక్క లక్షమామ్మ, శీలం లక్షమామ్మ, సొసైటీ సీఈఓ వై. రాందాస్, గడ్డన్నారం ఎ.ఎం.సి వైస్ చైర్మన్ భాస్కర చారి, బిళ్ళకంటి శేఖర్ రెడ్డి, మంకాల దాస్, సొసైటీ సిబంది, రైతులు పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్ మీ చేతుల్లోనే : రాధికగుప్తా

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : మీ కలలను నిజం చేసుకొని బంగారు భవిష్యత్తును నిర్మించుకోవడం మీ చేతుల్లోనే ఉందని, మీరు లక్ష్యాన్ని ఏర్పరచుకొని అందుకు క్రమశిక్షణ, ప్రణాళిక బద్ధంగా కార్యచరణతో బాగా కష్టపడుతూ ఇష్టంగా చదివి సాధించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా విద్యార్థులకు బోధించారు. మంగళవారం మేడ్చల్ మండలం కిష్టాపూర్లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూని యర్ కాలేజీని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ మీ కలలను నిజం చేసుకొని బంగారు భవిష్యత్తును నిర్మించుకోవడానికి మీరు బాగా కష్టపడి చదవాలని, అందుకు అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. వారి సబ్జెక్టుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకొని, వారికి అవసరమైన మార్గనిర్దేశ సూచనలు తెలిపారు. రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీలో మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగారు, విద్యార్థులు స్పందిస్తూ కంప్యూటర్లు, ల్యాబ్ కావాలని తెలుపగా, అదనపు కలెక్టరు తప్పకుండా సమకూరుస్తామని తెలిపారు. స్కూల్, కాలేజీ మొత్తం ఎంత మంది విద్యార్థులున్నారని, అన్ని సౌకర్యాలు ఉన్నాయా ఏమైనా మరమ్మత్తులు అవసరమా అని అడిగి తెలుసుకు న్నారు. మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, స్నాక్స్ అందిస్తున్నారా అని అదనపు కలెక్టరు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్, ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

ఏకలవ్య ఫౌండేషన్‌కు ఎస్‌బీఐ చేయూత

విశాలాంధ్ర, హైదరాబాద్ : మారుమూల గ్రామాల్లోని విద్యా మౌలిక వసతులు మెరుగు పరిచేందుకు ఎప్పుడు తోడ్పాటును అందిస్తుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కార్యక్ర మంలో భాగంగా ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ కి రూ. 50 లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు. మారుమూల గ్రామాల్లో విద్యాభివృద్ధికి ఈ సంస్థ చేస్తున్న సేవలకు ఈ నిధులు అందజేసినట్లు తెలిపారు. వీటితో కంప్యూటర్, సైన్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయా లజీ ల్యాబోరేటరీలను ఏర్పాటు చేసేందుకు నిధులు సమకూర్చినట్లు వివరించారు. గ్రామీణాభివృద్ధిలో ఏకలవ్య అందిస్తున్న సేవలకు కట్టుబడి ఉన్నామని, సీఎస్ఆర్‌లో భాగంగా నిధులను ఎస్‌బీఐ ఫౌండేషన్ ద్వారా అంద జేసినట్లు వివరించారు. అదే విధంగా తమ ఫౌండేషన్ ద్వారా యూత్ ఫర్ ఇండియా ఫెలోషిప్ ద్వారా గ్రామీణ యువ పారిశ్రామి కవేత్తలకు ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా రెండు ఎలక్ట్రిక్ వెహి కిళ్లను అందజేయగా, సాందీపనీ గురుకులా నికి సైన్స్, కంప్యూటర్ ల్యాబోరేటరీ, ఎస్ బీ ఐ లేడీస్ క్లబ్ ద్వారా నిత్యావసర సరుకులు, కుట్టుమిషన్లు, డొమెస్టిక్ అప్లయన్స్, స్వయం సహాయక సంఘాల మహిళలకు తోడ్పాటును అందిస్తున్నామని పేర్కొన్నారు.

మెరుగైన సేవలే లక్ష్యం

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. హర్యానాలో యాంటీ కరప్షన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ సుప్రీం నరేంద్ర ఆరోరా,నేషనల్ డైరెక్టర్,డాక్టర్. ఉప్పు సంజీవరావు, స్టేట్ కోఆర్డినేటర్ సౌజన్య తెలంగాణ చైర్మన్ డాక్టర్ ఇన్నారెడ్డికి వారి చేతుల మీదుగా రాష్ట్ర రత్న అవార్డు అందజేసి ఘనంగా సత్కరించిన సందర్భంగా మంగళవారం మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మంచి సేవాచేస్తూ, అవినీతినీ నిర్మూలించడంలో క్రియాశీలకంగా ఉండాలని తెలిపారు. అదే విధంగా ఇన్నారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు చేస్తూ, అవినీతినీ నిర్మూలించడంలో తనవంతు కృషి చేస్తానని, రాబోయే రోజులలో మీ సహాయ సహకారాలు ఉండాలని సురేష్ రెడ్డినీ కోరారు. ఈ కార్యక్రమం లో డివిజన్ ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ శివాజీ, నాయకులు సంగమేష్, ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

డ్రైయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

విశాలాంధ్ర , కాప్రా : ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'బస్తీ బాట' కార్యక్రమంలో వెలువడుతున్న ప్రధాన సమస్యల పరష్కారం కోసం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డిని నెమలి అనిల్ కుమార్ కలిసి అనేక సమస్యలను వివరించి వినతిపత్రాలని అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పంచించిన పరమేశ్వర్ రెడ్డి వెంటనే అధికారులతో మాట్లాడి ప్రధాన సమస్యగా ఉన్న జనప్రియ టౌన్షిప్ డ్రైనేజీ వ్యవస్థను మార్చేవిధంగా త్వరలో బాక్స్ డ్రైనేజీ ఎక్సటెన్షన్ పనులను మొదలుపెట్టాలని కోరారు,ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తండ్రా శ్రీకాంత్ రెడ్డి ,జనప్రియ టౌన్షిప్ అసోసియేషన్ సభ్యులు గణేశ్ ,ఆంథోనీ ,దయాకర్ రెడ్డి ,మూర్తి పాల్గొన్నారు.

కార్మికుల అభ్యున్నతికి కృషిచేసిన నాయకుడు కెఎల్. మహేంద్ర

విశాలాంధ్ర , కాప్రా : కార్మికుల అభ్యున్నతికి అవిరాల కృషిచేసిన గొప్ప నాయకుడు కామ్రేడ్ కె ఎల్. మహేంద్ర అని, భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ లోని కె ఎల్. మహేంద్ర సోషల్ స్టడీ సర్కిల్ హాల్ లో మహేంద్ర 18వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జీ. దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య మాజీ అధ్యకులుగా, ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కామ్రేడ్ కె.ఎల్ మహేంద్ర విశేష కృషి చేశారన్నారు. మహేంద్ర 1922 నవంబర్ 25న హైదరాబాద్‌లో జన్మించి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్య అభ్యసించే సమయంలో నిజాం సర్కార్ వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని అరెస్ట్ కాబడినారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఉక్కుసిమెంట్, బొగ్గు గని కార్మికుల సమ్మెలకు నాయకత్వం వహించారన్నారు.1970 నుంచి 1982 వరకు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ శాసన మండలి సభ్యులుగా కొనసాగారని,.1996 నుంచి 2021 వరకు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) అధ్యక్షుడిగా ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేసారన్నారు.1999 నుంచి 2001 వరకు ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య కు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారన్నారు.2001 లో సింగరేణి బొగ్గుగని కార్మికుల సమ్మె కొనసాగుతున్న సమయంలో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమ్మె వలన నష్టాలు వస్తున్నాయి కనుక ఒక రోజు సమ్మె కు మూడు రోజుల వేతనం కోత విధిస్తామని చెప్పగా లాభాలు వస్తే లాభాల వాటాలో 10% వాటా ఇచ్చేందుకు ఒప్పందం చేసుకొని దేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థలలో లేని విధంగా సింగరేణి కార్మికులకు లాభాల వాటా హక్కు సాధించిన గొప్ప నాయకుడు కె.ఎల్ మహేంద్ర అని ఎల్ల కాలం కార్మికుల మదిలో చిరస్థాయిగా ఉంటారన్నారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్, ఏఐఎస్ఎఫ్ నేతలు సతీష్ కుమార్, మహేష్,అజీమ్ పాషా, సలీం, సమీర్, సాయిలు పాల్గొన్నారు.

తల్లి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఉండాలి: కూన

విశాలాంధ్ర-దుండిగల్: పోచమ్మ తల్లి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆనందంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి దుండిగల్ మున్సిపాలిటీ,డి పోచంపల్లి చంద్రశేఖర్ రెడ్డినగర్‌లో శ్రీ ఎల్లమ్మ, శ్రీ పోచమ్మ దేవస్థానం మూడవ వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన బోనాల పండుగలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్ ముఖ్యతిధిగా పాల్గొని వేద పండితుల ఆశీర్వచనల మధ్య అమ్మవారికి హారతి సమర్పించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ డి పోచంపల్లి బి.చంద్రశేఖర్ రెడ్డి నగర్ లోని శ్రీ ఎల్లమ్మ శ్రీ పోచమ్మ దేవస్థానం మూడవ వార్షికోత్సవంలో భాగంగా బోనాల పండుగలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని, అమ్మవార్ల ఆశీస్సులు, దీవెనలు నియోజకవర్గం ప్రజలందరిపై ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ రాము గౌడ్,బుచ్చిరెడ్డి,మాజీ కౌన్సిలర్ సాయి యాదవ్,వీరేశం యాదవ్,కృష్ణ,లింగం గౌడ్, ఆనంద్, సాయి పాల్గొన్నారు.

జాతీయ గ్రంథాపాలకుల దినోత్సవం

విశాలాంధ్ర రాజేంద్రనగర్ : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మంగళవారం జాతీయ గ్రంథపాలకుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాజేంద్రనగర్‌లోని నాలెడ్జ్ మేనేజ్మెంట్ సెంటర్లో జరిగిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, నాలెడ్జ్ మేనేజ్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు. పద్మశ్రీ ఎస్సార్ రంగనాథన్ 133వ జయంతిని పురస్కరించుకొని జాతీయ గ్రంథ పాలకుల దినోత్సవాన్ని నిర్వహించారు. యూనివర్సిటీ లైబ్రేరియన్ డాక్టర్ వివేకవర్ధన్ జాతీయ గ్రంథపాలకుల దినోత్సవ ప్రాధాన్యత గురించి వివరించారు. నాలెడ్జ్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అందుతున్న వివిధ సేవలను ఆయన వివరించారు. యూనివర్సిటీ లైబ్రరీ సేవలు గురించి విద్యార్థులతో పంచుకున్నారు. విశ్వవిద్యాలయం ఉన్నతాధికా రులు డాక్టర్ బలరాం, డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ ఈశ్వరి, డాక్టర్ శశికళ తో పాటు, విద్యార్థులు లైబ్రరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ లైబ్రరీ సైన్స్ డాక్టర్ ఎస్ పి రవికుమార్ వందన సమర్పణ చేశారు.

ప్రకృతి రక్షణ మనందరి బాధ్యత : ఎమ్మెల్యే యెన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : చెట్లను నాటడం వాటిని సంరక్షించడం మనందరి బాధ్యత అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. 75వ వన మహోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్ నగరంలోని ప్రభుత్వ అందుల పాఠశాల ప్రాంగణంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన మహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు అనధికారులతో కలిసి ఆయన చెట్లను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన చుట్టూ వందల ఎకరాల్లో అడవి విస్తరించి ఉండన్నారు. అడవులను సంరక్షణ చేస్తేనే వర్షాలు కురిస్తాయని, భూమి సారవంతం అవుతుందన్నారు. నాలుగు ఐదు సంవత్సరాల పాటు ఈ చెట్లను మనం కాపాడితే 100 ఏండ్లు ఆ చెట్లు మన అందరిని కాపాడుతా యని ఆయన చెప్పారు. కేవలం చెట్లను నాటడమే కాదు వాటిని తప్పకుండా సంరక్షించుకోవల్సిన బాధ్యత మనందరిపైన ఉందని ఆయన సూచించారు. అధికారులు ఉద్యోగంలో చేరిన రోజు బదిలీల సందర్భంలో మరియు రిటైర్మెంట్ సందర్భంలో మొక్కలు నాటాలన్నారు.

ప్రజల కనీస అవసరాలను తీర్చేందుకు సిద్ధంగా ఉన్నాం

ప్రజల కనీస అవసరాలను తీర్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ నగరం లోని అప్పన్నపల్లి ఫ్లైఓవర్ సమీపంలో ప్రయాణికుల సౌకర్యార్థం ముడా నిధులు 2.5 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన బస్ షెల్టర్ ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్ నగర్ నగరం అభివృద్ధికి 250 కోట్ల రూపాయలతో అన్ని రకాల అభివృద్ధి పనులను చేస్తున్నామని , నగరంలో 20 పార్కులను గుర్తించి, అభివృద్ధి చేస్తున్నామని ఆయన తెలిపారు. ప్రజల కనీస అవసరాలను కల్పించడంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. గత 75 సంవత్సరాల్లో ఎన్నడూ జరుగని అభివృద్ధి కేవలం 16 నెలల కాలంలోనే చేసి చూపించామని ఆయన స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఆర్టీసీ లో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశ పెట్టి, జడ్చర్ల, బూత్ పూర్, మహబూబ్ నగర్ నగరం మధ్యలో నడిపించేందుకు ప్రయత్నం చేస్తున్నామని ఆయన చెప్పారు.మహబూబ్ నగర్ క్లస్టర్ (మహబూబ్ నగర్, జడ్చర్ల, బూత్ పూర్) అభివృద్ధి కోసం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిని మహబూబ్ నగర్ ఎంపి డికె అరుణతో కలిసి 975 కోట్ల రూపాయల తోటి అభివృద్ధి పనులు చేయుటకు నివేదికను సమర్పించామని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే ఎర్ర సత్యం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ నాయకులు రామాంజనేయులు , గుమాల్ శ్రీను ముదిరాజ్, శేఖర్ , యాదమ్మ, , ఎస్ వెంకటేష్, కె ఆంజనేయులు, రామకృష్ణ, , శివ, చర్ల శ్రీనివాసులు, ప్రశాంత్ , ఖాజా పాషా , అంజద్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుక

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: అఖిల భారత విద్యార్థి సమైక్య ఎఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్స వాన్ని శేరిలింగంపల్లి మండల ఆధ్వర్యంలో కొత్తగూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో జరుపుకున్నారు. ఏఐఎస్ఎఫ్ శేరిలిగంపల్లి మండల కార్యదర్శి ధర్మ తేజ జెండా ఆవిష్కరించి మాట్లాడుతూ భారతదేశ కోసం పొత్తిలోనే పిడికిలి బిగించి స్వాతంత్రం మా జన్మ హక్కు అని దేశం కోసం పోరాడినటువంటి విద్యార్థి సంఘం ఏదైనా ఉందంటే అది కేవలం మొట్టమొదటి విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ అని తెలిపారు. పోరాటాలు త్యాగాలే ధ్యేయంగా ఏర్పాటైన ఈ విద్యార్థి సంఘం స్వాతంత్రనంతరం ప్రభుత్వ విద్యా పరిరక్షణకై, శాస్త్రీయ విద్య, కామన్ విద్యా విధానం అమలుపై నిరంతరం పోరాటం సాగిస్తూ గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటాలు కొనసాగుతున్నాయి. నాటి నుంచి నేటి వరకు అనేక మైనటువంటి విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రభుత్వ విద్య, విద్యాలయాల అభివృద్ధి , పేద బడుగు బలహీన వర్గాల ప్రజల విద్యార్థుల మేలు కోసం మాట్లాడుతుందని అన్నారు. ఈ దోపిడీ విద్యా విధానం కి వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ పోరాడుతుందని శేర్లింగంపల్లి మండల కార్యదర్శి తేజ అన్నారు.

సంక్షేమాభివృద్దే ధ్యేయం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ పరిధిలో రూ.5 కోట్ల 42 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణమ పనులకు, స్ట్రాం వాటర్ డ్రెయిన్ లైన్ నిర్మాణం పనులకు గౌరవ గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి, పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి శాసన సభ్యులు ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. తొలుత గుల్మోహర్ పార్క్ కాలనీలో రూ.1కోటి 23 లక్షలతో సీసీ రోడ్లు,లక్ష్మి విహార్ ఫేజ్ 1 కాలనీ లో రూ.85 లక్షలతో సీసీ రోడ్లు, నల్లగండ్ల హుడా కాలనీలో రూ.58 లక్షలతో సీసీ రోడ్లు, స్ట్రాం వాటర్ డ్రెయిన్ లైన్,గోపనపల్లిలో గల మంజీర డైమండ్స్ హైట్స్‌లో రూ.75.00 లక్షలతో సీసీ రోడ్లు,టీఎన్జీవోస్ కాలనీలో రూ.40 లక్షలతో సీసీ రోడ్లు,నానక్ రామ్ గుడాలో రూ.35 లక్షలతో స్ట్రాం వాటర్ డ్రెయిన్ లైన్, ఖజాగుడలో రూ.12 లక్షలతో సీసీ రోడ్లు, రాయదుర్గంలో రూ.1కోటి 14 లక్షలతో స్ట్రాం వాటర్ డ్రెయిన్ లైన్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. కాలనీ వాసులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి, పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి శాసన సభ్యులు ఆరెకపూడి గాంధీని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి గారు మాట్లాడుతూ శరవేగంగా విస్తరిస్తున్న గచ్చిబౌలి డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రతీకగా నిలుపు తున్నామని అన్ని అన్నారు.మన నగరాభివృద్ధి మన చేతుల్లోనే ఉందని, రానున్న రోజుల్లో మౌలిక సదుపాయాల కోసం మరిన్ని నిధులు కేటాయించి, గచ్చిబౌలి డివిజన్‌లోని అన్ని ప్రాంతాలను వేగవంతంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, అభివృద్దే ధ్యేయంగా గత నాలుగు సంవత్సరాలుగా కోట్లాది రూపాయల నిధులతో గచ్చిబౌలి డివిజన్‌ను మోడ్రన్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దామని, రానున్న రోజుల్లో కూడా అన్ని విధాలుగా అభివృద్ధి చేసి జిల్లాలో ఆదర్శవంతమైన డివిజన్‌గా మారేందుకు కృషి చేస్తానని తెలిపారు.

సీఎం సహాయనిధి పేదలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-దుండిగల్: ముఖ్యమంత్రి సహాయనిధిని పేదలు సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలను హన్మంత్‌రెడ్డి పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పలువురు పేదలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చికిత్సకు సరిపడా స్థోమత లేక కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించగా వెంటనే స్పందించి గౌరవ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం రూ.60,000 ముఖ్యమంత్రి సహాయనిధిని మంజూరు చేయించి మంగళవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 125 డివిజన్ గాజులరామారం వాసులు లాకోటి విజేందర్ కి రూ -60,000, ముహమ్మద్ ఇలియాస్ రూ 18,500,యాస్మిన్ సుల్తానా రూ.20,000, 130 డివిజన్ అంజి రెడ్డి బస్తి వాసులు తెల్ల రామకృష్ణ రూ .27,000, 132 డివిజన్ రంగారెడ్డి వాసులు కావడి బల్ రెడ్డి రూ.30,000 ల చెక్కులను అందజేశారు. అనంతరం కొలను హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల ద్వారా ఎంతో మేలు చేకూరుతుందని,అలాగే అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,పేద ప్రజల సంక్షేమ ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి,కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముత్యం రెడ్డి, సంజీవ రెడ్డి,గాగిలాపూర్ మాజీ సర్పంచ్ బల్ రాజ్, డివిజన్ అధ్యక్షులు ఎండి లాయక్,గణేష్,సోమన్నగారి శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ నగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేయాలి

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ నేతాజీ నగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డికి నేతాజీ నగర్ కాలనీ అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భేరి రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ నేతాజీ నగర్ కాలనీలో అండర్ డ్రైనేజ్ పైప్ లైన్ సాయిబాబా గుడి కమిటీ హాల్ నుండి నల్లగండ్ల చెరువు నాలా వరకు లేదు. కాబట్టి తొందరగా ఆ పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డికి వినతి పత్రం అందించారు ఇంకా కాలనీలో పలు చోట్ల సిసి రోడ్లు ఓపెన్ నాలాలు భారీ వర్షాలకు శిథిలావస్థకు చేరుకున్నాయి. అవి తొందరగా మరమ్మత్తులు చేయించాలి. కాలనీ నుండి మురుగునీరు వెళ్లడానికి అవుట్ లెట్ కూడా లేదు. ఔట్లెట్ కూడా ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో గుల్మోర్ పార్క్ అధ్యక్షులు షేక్ ఖాసిం, మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్ నేతాజీ నగర్ కాలనీ ఉపాధ్యక్షులు రాయుడు, జయ రెడ్డి రాధా రాణి రెడ్డి, గంగమ్మ, చిట్టెమ్మ లాల్ రెడ్డి, మౌలానా, అసోసియేషన్ సభ్యులు పాల్గొని వినతిపత్రం అందించారు.

ఎబియన్స్ ఇంటర్నేషనల్ స్కూల్ అఫ్ మ్యూజిక్ ప్రారంభం

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్‌లోగల స్ప్రింగ్ వ్యాలీలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఎబియన్స్ ఇంటర్నేషనల్ స్కూల్ అఫ్ మ్యూజిక్'ను శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని మ్యూజిక్ స్కూల్‌ను ప్రారంభించారు. నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. నిర్వాహకులు కార్పొరేటర్‌ని శాలువా కప్పి బోకే ఇచ్చి సత్కరించారు. కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ మ్యూజిక్ స్కూల్‌ను ఏర్పాటు చేసుకోవడం ఎంతో సంతోషదాయకం అని అన్నారు. ఇలాంటి మ్యూజిక్ స్కూల్స్ మరిన్ని బ్రాంచ్ లుగా ప్రారంభించుకోవాలని అందుకు కస్టమర్లకు అన్ని సదుపాయాలు కల్పంచి వారి మన్ననలు పొందాలని సూచించారు. నిర్వాహకులు జరీన్, బలేష్ యాదవ్ మ్యూజిక్ స్కూల్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్ బాక్స్ అందజేయడం అభినందనీయం

విశాలాంధ్ర - మొయినాబాద్: పాఠశాలకు సౌండ్ సిస్టమ్ అందజేయడం అభినందనీయమని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి ఉన్నారు. మంగళవారం పెద్ద మంగళారం గ్రామానికి చెందిన బాబు జగ్జీవన్ రామ్ యూత్ అసోసియేషన్ సభ్యులు పాఠశాలకు సౌండ్ బాక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దాతల సహకారంతోనే పాఠశాలల అభివృద్ధి జరుగుతుందన్నారు. పాఠశాలకు సౌండ్ బాక్స్ అందజేసిన బాబు జగ్జీవన్ రామ్ యూత్ అసోసియేషన్ సభ్యులను ఆమె అభినందించి సత్కరించారు. అనంతరం యూత్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.... పాఠశాలలో ఏ సమస్య తలెత్తిన తమ దృష్టికి తీసుకొస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మి, బిబి హజ్రా, అలివేలు, ఉమాదేవి, యూత్ అసోసియేషన్ సభ్యులు అరుణ్, చెన్నయ్య, యాదగిరి, ఉపేందర్, సింహాద్రి, సురేష్, ప్రవీణ్, బాలకృష్ణ, మిట్టు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమ కారులకు 250 గజాలు 25వేల ఫించని ఇస్తానన్న హామీ వెంటనే నెరవేర్చేవిధంగా చూడాలని ప్రభుత్వ ఉద్యమకారులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు అనుమగల్ హయత్ నగర్ ఎస్వీఎస్ ఫంక్షన్ హాల్లో కలిసి ఉద్యమకారుల పక్షాన మాట్లాడవలసిందిగా కోరుతూ మెమోరండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు టియుఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జెనిగె విష్ణువర్ధన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొంతం యాది రెడ్డి, హయత్ నగర్ మండల ఉద్యమకారుడు బట్టీల రవీందర్, ఎర్ర రవీందర్ మాదిగ, పెద్ద అంబర్పేట్ మున్సిపల్ అధ్యక్షులు జోర్క రామ్ ముదిరాజ్ ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు

విశాలాంధ్ర-మేడిపల్లి: ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం స్థానిక ఉప్పల్ డిపో కార్యాలయం వద్ద అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ హాజరై శ్వేతా అరుణ పతాకాన్ని ఎగురవేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....స్వాతంత్ర్యం రాకపూర్వమే దేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘంగా ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో మహానగరంలో భగత్ సింగ్, రాజ్ గుర్, సుఖ్ దేవ్, ఆజాద్‌ల ఇంకా ఎందరో వీరుల ఆశయ సాధన కోసం బబ్రుద్దీన్ బాసు, ప్రేమ్ నారాయణ భార్గవ్ ల నాయకత్వాన 1936 ఆగస్టు12 న అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆవిర్భవించింది.బ్రిటీష్ సామ్రాజ్యవాదుల బానిసచెర నుంచి మాతృభూమి విముక్తి కై సాగిన వీరోచిత స్వాతంత్ర్య ఉద్యమంలో పొత్తిళ్లలోనే పిడికిళ్లు బిగించి స్వాతంత్ర్యము మా జన్మ హక్కుఅని మా అంతం చూసిన - స్వాతంత్ర్యోద్యమ పంతం వీడం అంటూ నినదించి భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని, భరతమాత బానిస సంకెళ్ల నుంచి విముక్తి కావాలని ఎందరో విద్యార్థుల విప్లవ కిశోరుల బలిదానం చేసిన ఘనమైన చరిత్ర కలిగిన దేశములోనే ఏకైక విద్యార్థి సంఘం అని అన్నారు. విద్యార్థి ఉద్యమాల నిర్మాణంలో నిమగ్నమైన అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 89 వసంతాలు పూర్తిచేసుకుని 90వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. భవిష్యత్తులో పాలకులు అవలంబిస్తున్న విద్యావ్యతిరేక విధానాలపై ఏఐఎస్ఎఫ్ గా పోరాడుతామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, ఉపాధ్యక్షులు హరీష్, మహేష్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

ఏఐ ఆధారిత ఎలక్ట్రిక్ థింక్స్

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : భారతదేశంలో టెక్నాలజీ కంపెనీలలో ఒకటైన పీపుల్ టెక్ ఎంటర్‌ప్రైజ్, తమ ఆధునిక వేదిక మాస్ యొక్క ప్రధాన ఉత్పత్తిగా ఏఐ ఆధారిత ఎలక్ట్రిక్ రెండు చక్రాల వాహనం థింక్స్‌ను ప్రారంభిస్తున్నట్లు ఈ రోజు ప్రకటించింది. ఈ ఏఐ ఆధారిత థింక్స్ ఉత్పత్తి తయారీకి రూ.800 కోట్ల అంచనా పెట్టుబడితో ప్రారంభమవుతుంది. వచ్చే 5 ఏళ్లలో 1,000ం మెషీన్ లెర్నింగ్ ఆపరేషన్స్ ఉద్యోగాలు, 400ం ఇన్ఫోటైన్మెంట్ డెవలప్‌మెంట్ ఉద్యోగాలు, అలాగే బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఆర్ అండ్ డి బృందం సహా) లో 200 అదనపు ఉద్యోగాలు సృష్టించబడతాయి. ఈ కంపెనీ ఇప్పటికే తమ ఆర్&డి సెంటర్, థింక్స్ ఎక్స్పీరియన్స్ కేంద్రాన్ని మాధాపూర్‌లోని పీపుల్ టెక్ ఎంటర్‌ప్రైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఈ యూనిట్లలో 100 మంది పని చేస్తున్నారు. కంపెనీ ఇప్పటికే ప్రోటోటైప్ మోడల్‌ను సిద్ధం చేసింది. ఏఐ ఆధారిత రెండు చక్రాల వాహనం యొక్క ప్రాథమిక మోడల్‌ను అభివృద్ధి చేసి, పరీక్ష, మూల్యాంకనానికి సిద్ధంగా ఉంచింది. ఈ ప్రోటోటైప్ ద్వారా ఉత్పత్తి యొక్క ఫంక్షనాలిటీ, డిజైన్, సామర్థ్యాన్ని పూర్తి స్థాయి ఉత్పత్తికి ముందే అంచనా వేసుకోవచ్చు. హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో తయారీ యూనిట్ కోసం కొన్ని ప్రదేశాలను గుర్తించగా, 2026 చివరినాటికి యూనిట్‌ను పూర్తిచేయాలన్న లక్ష్యంతో ఉంది. 2027 చివరినాటికి ఉత్పత్తిని ప్రారంభించాలన్న ప్రణాళిక ఉంది. థింక్స్ తో, కేవలం ఒక వాహనాన్ని ఆవిష్కరించడం కాదు, ఒక ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నాం. ఈవి ఆవిష్కరణ, తయారీ, మొబిలిటీ ఇంటెలిజెన్స్ కోసం భారతదేశపు మొదటి సంపూర్ణ ఏఐ సమగ్రీకరించిన మొబిలిటీ విప్లవాన్ని నిర్మించడానికి కట్టుబడి ఉన్నాం అని పీపుల్ టెక్ ఎంటర్‌ప్రైజ్ వ్యవస్థాపకుడు సీఈఓ టి.జి. విశ్వ ప్రసాద్ అన్నారు. హైదరాబాద్‌లోని ఆధునిక సాంకేతికతలతో నిర్మించిన సంస్థ క్యాంపస్‌లో జరిగిన బ్రాండ్ ఆవిష్కరణ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, ఇండస్ట్రీస్ అండ్ కామర్స్, లెజిస్లేటివ్ ఫైర్స్ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఇండస్ట్రీస్, కామర్స్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సివిల్ సప్లైస్, ఫుడ్ - కన్స్యూమర్ అఫైర్స్ శాఖ మంత్రి నదెండ్ల మనోహర్ హాజరయ్యారు .

నియోజకవర్గ అభివృద్దే లక్ష్యం

విశాలాంధ్ర - ఆమనగల్లు: ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు మానుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులను స్వాగతించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు. సోమవారం ఆమనగల్లు మున్సిపాలిటీలో అమృత్- 2 పథకం కింద మంజూరైన రూ.32 కోట్లతో నిర్మించనున్న వాటర్ ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పథకాలను అమలు చేస్తుంటే చూసి ఓర్వలేని వారు పథకాలు అందడం లేదని, హామీలు అమలు చేయడం లేదని ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గంలో రూ.600 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టిం దని, ప్రజల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే బిజెపి నాయకులు కేంద్రం నుండి నియోజకవర్గ అభివృద్ధి కోసం వెయ్యి కోట్ల నిధులు తీసుకురావాలని సవాల్ చేశారు. మున్సిపాలిటీలో తాగునీటి సమస్య నివారణకు మరో 15 కోట్ల రూపాయలను త్వరలో మంజూరు చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి అంగీకరించినట్లు ఆయన చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి తన లక్ష్యమని అభివృద్ధికి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతిపక్షాలు సలహాలు, సూచనలు చేసి కలిసి రావాలని పిలుపునిచ్చారు.

కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి హౌస్ అరెస్ట్

విశాలాంధ్ర -రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డిని బీజేపీ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు డివిజన్ బీజేపీ నాయకులతో కలసి ఛలో బంజారా హిల్స్ పెద్దమ్మ తల్లి దేవాలయంకి బయల్దేరే క్రమంలో పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడం జరిగింది. కార్పొరేటర్ మాట్లాడుతూ హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను ఆయన తీవ్రంగా ఖండించడం జరిగింది. అధికార పార్టీ నాయకుల ఆదేశాలతో పోలీసులు ఇలా దౌర్జన్యంగా బీజేపీ నాయకులను అడ్డుకొని హౌస్ అరెస్ట్ చేయడం సమంజసం కాదన్నారు. రాష్ట్ర ప్రజలందరూ అన్ని గమనిస్తున్నారని త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని ఆయన పేర్కొన్నారు. డివిజన్ అధ్యక్షుడు పాండు యాదవ్, మాజీ అధ్యక్షులు అడిగే జనార్ధన్, రావుల భాస్కర్, బబ్లూ, బుచ్చిరెడ్డి మధు సూదన్ రెడ్డి, ఎన్నూ శంకర్ రెడ్డి పాపట్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE XIII ADDITIONAL DISTRICT JUDGE CUM MACT AT GAJUWAKA

M.O.P. 361/2024

Between:
Malla Jagga Apparao @ Jaggarao and another ... Petitioners
And
Ram Yagy Maurya and 2 Others .... Respondents.

NOTICE

To:
2nd Respondent
Sandeep Kumar Tiwari, S/o. Uma Prakash Tiwari, aged not known but major, residing at D.No. 1-84/2, 2nd Floor, Hafeezpeta, Miyapur, Mittal Roadways, Opposite Bharat Petrol Pump, Hyderabad-500050.
(Owner of the Crime vehicle Container Lorry Beg. Regd. No. DN 09 U 9723)

Please take notice that the above MOP filed by the petitioners against you & 2 others for grant of compensation of Rs. 8,14,000/- on account of death of Malla Mani, W/o. Malla Jagga Apparao @ Jaggarao, due to accident on 16-04-2024 at about 11.30 Hours, at opposite S-Convention Function Hall, Vadlapudi, Visakhapatnam, caused through your vehicles Container Lorry bearing No. DN 09 U 9723, Stands posted to 25-08-2025 for your appearance. If you have any objection you may attend either personally or through an advocate before the above said court on 25-08-2025 at about 10.30 A.M. failing which the matter will be decided expartie in your absence.

(By order of the court)

R. GANESWARA RAO
Advocate,
Kurmannapalem,
Visakhapatnam-46
Cell : 9000663664

Gajuwaka
Dt:11-08-2025

దొంగ నోట్లతోనే ఎన్డీయేకి అధికారం

- 11 ఏళ్లుగా దేశాభివృద్ధి శూన్యం
- వ్యవస్థలన్నీ మోదీ గుప్పెట్లో
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం: వ్యవస్థలన్నింటినీ గుప్పెట్లో పెట్టుకొని మోదీ సర్కారు పాలన సాగిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా దొంగ ఓట్లు... దొంగ నోట్లతో అధికారాన్ని కైవసం చేసుకుంటుందని మండిపడ్డారు. అనంతపురం జిల్లా కేంద్రంలో సీపీఐ జిల్లా 25వ మహాసభలు జిల్లా కార్యదర్శి సి.జాఫర్ అధ్యక్షతన జరిగాయి. అంతకముందు అనంతపురం నగరంలో సప్తగిరి ఆర్ట్స్ కళాశాల మైదానం నుండి ర్యాలీ ప్రారంభమై కేఎస్ఆర్ కళాశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతపురం జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల నుండి భారీస్థాయిలో పార్టీ శ్రేణులు తరలిరావడంతో అనంతపురం జనసంద్రమైంది. ర్యాలీలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఏఐటీయూసీ, వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సమాఖ్య, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడుతూ 140 కోట్ల జనాభా గల భారతదేశంలో వేలాది కులాలు, మతాలు, భాషలు ఉన్నాయని, కానీ మతోన్మాదులు మాత్రం హిందుత్వాన్ని పాటించాలని ప్రజలను బెదిరిస్తున్నారన్నారు. దేశంలో ఆర్ఎస్ఎస్ అజెండా పాలన సాగుతోందని నిందించారు. ఎన్నికల కమిషన్‌ను తమ చెప్పుచేతల్లో పెట్టుకొని... ప్రతిపక్ష పార్టీల ఓట్లు తొలగిస్తోందన్నారు. బీజేపీకి తొత్తుగా వ్యవహరించడం ఈసీకి అలవాటుగా మారిందని ఆరోపించారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు, పక్షపాత ఎన్నికల నిర్వహణపై ప్రశిస్తుంటే సమాధానం చెప్పడానికి బదులు ఈసీ బెదిరింపులకు దిగుతోందని విమర్శించారు. గతంలో రిగ్గింగు జరిగితే...ఇప్పుడు ఏకంగా ఓటర్ల జాబితానే మార్చివేస్తున్నారన్నారు. బీహార్‌లో 65 లక్షల ఓట్లు తీసివేయడానికి నిరసనగా పార్లమెంటును విపక్షాలు స్తంభింపచేస్తున్నా ప్రధాని మోదీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. దొంగ ఓట్లపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బయటపెట్టిన ఆధారాలకు ఈసీ సమాధానం చెప్పాలని నిలదీశారు. కమ్యూనిస్టులుగా రాబోవు రోజుల్లో ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ రాష్ట్ర, జాతీయ మహాసభల్లో అనేక తీర్మానాలు చేసి... ఉద్యమాలకు శ్రీకారం చుడతామన్నారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రజలకు ఒరిగిందేమీ లేదని రామకృష్ణ అన్నారు. 164 సీట్లు ఇచ్చిన ప్రజలకు కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయకుండా మొండిచేయి చూపుతోందన్నారు. అమరావతి పేరుతో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. 151 సీట్లు కలిగిన జగన్ కనీసం ప్రతినెలా బటన్ నొక్కి జనానికి డబ్బు పంచాడని, చంద్రబాబు అలాంటిది కూడా చేయడం లేదన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రత్యేక ప్యాకేజీకి డబ్బులు తీసుకురాని చంద్రబాబు... మోదీకి వంత పాడుతున్నాడని ఆరోపించారు. జగన్ హయాంలో మద్యం కుంభకోణానికి సంబంధించిన డబ్బు వెలికితీసి... ప్రజలకు పంచి పెట్టాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1.75 లక్షల కోట్లు అప్పు తెచ్చిందని, గతంలో జగన్ అప్పు తెస్తే రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందని ఎద్దేవా చేసిన చంద్రబాబు... అంతకుమించి పోయాడని మండిపడ్డారు. రాజధాని పేరుతో రూ.78 వేల కోట్ల అప్పు తీసుకువచ్చి ఏం సాధిస్తారని నిలదీశారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఏ కార్యాలయానికి వెళ్లినా లంచం ఇవ్వనిదే పని జరగడం లేదని, అనంతపురం ఎమ్మెల్యే లాంటి వాళ్లు భూకబ్జాలకు పాల్పడుతుంటే కూటమి ప్రభుత్వం ఏం చేస్తుందని నిలదీశారు. అనంతపురం నగరంలో లేఅవుట్లు, షాపింగ్ మాల్స్, సైకిల్ స్టాండు, చివరికి చికెన్ సెంటర్ వాళ్లను కూడా బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి ఎమ్మెల్యేలపై విచారణ చేపట్టాలని చంద్రబాబుకు సూచించారు.

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ కర్నాటకలోని ధర్మస్థలలో వందలాదిమంది మహిళల శవాలు బయటపడుతుంటే ఎన్డీఏ ప్రభుత్వం నోరు మెదపడం లేదని మండిపడ్డారు. గడిచిన 30 సంవత్సరాలుగా అక్కడ అనేక ఉద్యమాలు జరుగుతున్నా ధర్మస్థల ఆలయ ట్రస్ట్ సభ్యులపై పోలీసులు, ప్రభుత్వం ఈగ వాలనీయడం లేదన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ మాట్లాడుతూ అత్యధిక ఎమ్మెల్యేలను గెలిపించి అధికారం కట్టబెట్టిన ప్రజలకు చంద్రబాబు ఊహాప్రపంచాన్ని చూపిస్తున్నారని ఆరోపించారు. పి4తో పేదరిక నిర్మూలన చేస్తానని నమ్మబలుకుతున్నాడని, అదో పిచ్చి వ్యవహారమన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేయడానికి స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా కాలువ వెడల్పు చేసిన గుత్తేదారులకు బిల్లులు చెల్లించలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో విలువైన భూములను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నాడని, విజయవాడలో ఆర్టీసీ స్థలాన్ని లూలూ మాల్స్‌కి ఇవ్వడానికి తప్పు పట్టారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి అతిథులకు స్వాగతం పలుకగా మరో సహాయ కార్యదర్శి సి. మల్లికార్జున వందన సమర్పణ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజినేయులు, జాన్సన్ బాబు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్, నాయకులు ఎండీ సంజీవప్ప, జె.రాజారెడ్డి, బి.కేశవరెడ్డి, ఎన్.శ్రీరాములు, జి.గోపాల్, పి.రామకృష్ణ, సి.లింగమ్మయ్య, ఎ.పద్మావతి, మల్లికార్జున, టి.రంగయ్య, టి..నారాయణస్వామి, బి.రమణ, వైఎల్ రామాంజనేయులు, నాగార్జున, సంతోష్ కుమార్, చిరంజీవి, పెద్దయ్య, వీరభద్రస్వామి, రాజేష్, నాగరాజు, కుళ్లాయస్వామి, చెన్నప్ప యాదవ్, హనుమంతు రాయుడు, కె.కొంట్రేష్ తదితరులు పాల్గొన్నారు.

అనిశెట్టి రజిత కన్నుమూత

వరంగల్: ప్రముఖ కవి, ప్రజా గాయని, రచయిత, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక (ప్రరవే) జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత కన్నుమూశారు. గుండెపోటుతో ఆమె సోమవారం రాత్రి 9 గంటలకు వరంగల్‌లో తుదిశ్వాస విడిచారు. గుండెపోటు రావడంతో సన్నిహితులు ఆమెను హుటాహుటిన ఆసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. రజిత మరణంతో తెలుగు సాహితీలోకం దు:ఖసాగరంలో మునిగింది. గతేడాది శరీరాన్ని దానం చేసేందుకు అంగీకరించడంతో సదాశయ ఫౌండేషన్ అధ్వర్యంలో నేత్రదానం, ఆమె భౌతికకాయాన్ని కాకతీయ మెడికల్ కాలేజీకి అప్పగించారు. అనిశెట్టి రజిత 1958, ఏప్రిల్ 14న వరంగల్‌లో జన్మించారు. విద్యార్థి దశ నుంచే ఆకాశవాణిలో ప్రసారమయ్యే తెలంగాణ ఉద్యమ సంఘర్షణలు, కవి సమ్మేళనాలు, దాశరథి, ఆరుద్ర తదితరుల ఉపన్యాసాలకు ఆకర్షితురాలయ్యారు. 1969లో తొమ్మిదో తరగతిలోనే తెలంగాణ తొలి దశ ఉద్యమంలో పాల్గొన్నారు. మలి దశ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ ప్రోత్సాహంతో అనేక బహిరంగ సభల్లో ప్రజలను ఉద్యమం వైపు ఆకర్షితులయ్యేలా ప్రసంగాలు చేశారు. 1973లో ఇంటర్ చదువుతున్న సమయంలో 'చైతన్యం పడగెత్తింది' అనే తొలి రచనతో సాహితీ విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. 1980 నాటి ఉద్యమ అనుభవంతో 'గులాబీలు జ్వలిస్తున్నాయి', స్త్రీవాద ఉద్యమ ప్రభావంతో 'నేనొక నల్లమబ్బునవుతా', 'చెమట చెట్టు', 'ఓ లచ్చవ్వ', 'ఉసురు', 'గోరంత దీపాలు', హైకూల సంపుటి, 'దస్తఖత్', 'అనగనగా కాలం', 'మట్టి బంధం', నన్నే ఓ నన్నే', 'మార్కెట్ స్మార్ట్ శ్రీమతి', 'నిర్భయాకాశం కింద', ఆచార్య పాకాల యశోదా రెడ్డిపై మోనాగ్రాఫ్ రాశారు. అలా దాదాపు 500కి పైగా కవితలు, 100కి పైగా వ్యాసాలు, 30కిపైగా కవితలు, 30కిపైగా పాటలు రాశారు. తన సాహిత్యంతో సామాజిక అంశాలను స్పృశించిన అనిశెట్టి రజితను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక అవార్డులతో సత్కరించాయి. 2014లో తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ప్రతిభా పురస్కారం, 2016లో తెలుగు రచయితల వేదిక వారి అలిశెట్టి ప్రభాకర్ పురస్కారాన్ని ఆమె అందుకున్నారు.

శోకంలో సాహితీలోకం

సామ్రాజ్యవాదంపై, దోపిడీపై, లింగ వివక్షపై అలుపెరగని పోరాటం చేసిన అనిశెట్టి రజిత మృతి సాహితీలోకానికి తీరని లోటని, సామాజిక న్యాయం కోసం జీవితాన్ని అంకితమిచ్చారని అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ పల్లేరు వీరాస్వామి, డాక్టర్ రాపోలు సుదర్శన్, కేవీయల్ తదితరులు పేర్కొన్నారు. ఆమె మృతికి సంతాపం తెలిపారు.

ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం?

- ప్రత్యేక పథకం యోచనలో సీఎం
- సమగ్ర అధ్యయనానికి ఆదేశం
- ఉచిత బస్సు పథకంతో ప్రభావం తగ్గించే యత్నం
- స్త్రీ శక్తి సన్నద్ధతపై సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో ఈనెల 15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం పథకం అమలుతో ఆటో డ్రైవర్ల నుంచి వ్యతిరేకత రాకుండా, వారికి ఉపశమనం కలిగించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. 'స్త్రీశక్తి' సన్నద్ధతపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆటో డ్రైవర్లకు నష్టంపై చర్చించారు. సహజంగా మహిళలే ఆటోలు ఎక్కుతుంటారని, పురుషుల్లో చాలా మంది బైక్‌లు వాడతారని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటోలపై ప్రభావం ఎక్కువగానే ఉంటుందన్నారు. కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఆటో డ్రైవర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడం, పెద్దఎత్తున నిరసనలు జరగడాన్ని గుర్తుచేశారు. దీంతో ఆటో డ్రైవర్లకు అక్కడి ప్రభుత్వాలు ఆర్థిక సాయం అందించే కార్యక్రమాలు చేపట్టాయన్నారు. ఏపీలోనూ ఆటో డ్రైవర్లకు ఉపశమనం కల్గించేలా ఆర్థిక సహాయం అందించే ప్రత్యేక పథకాన్ని అమలు చేయడం అవసరమని సీఎం భావించారు. ఇందుకోసం సమగ్ర అధ్యయనం తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలులో ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రద్దీ పెరిగే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ నిర్వహణ సమర్థంగా చేయాలని, అందుకు తగ్గట్టు సామర్థ్యం పెంచుకోవాలని, భద్రత కూడా ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని, ఎక్కడా ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. ఈ పథకం అమలుపై ప్రయాణికుల అభిప్రాయాలు తెలుసుకుంటూ, తదనుగుణంగా పథకాన్ని మెరుగ్గా అమలుచేయాలని సీఎం నిర్దేశించారు. సర్వీస్ ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా సేవలు అందించాలన్నారు.

సమస్యలకు సత్వరమే పరిష్కారాలు...

'ఈపోస్ మిషన్లకు జీపీఎస్ తప్పనిసరి, ట్రాకింగ్ ద్వారా ప్రయాణికులకు సమాచారాన్ని అందించాలి. ఆర్టీజీఎస్‌తో అనుసంధానమై పనిచేయాలి. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా వ్యవస్థ ఉండాలి. బస్ స్టేషన్లు పరిశుభ్రంగా ఉండాలి. ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలి. టాయిలెట్లను రెండు గంటలకు ఒకసారి శుభ్రం చేయాలి, అధికారుల పర్యవేక్షణ ఉండాలి. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా అన్ని బస్ స్టేషన్లలో తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలి. రూ.30 కోట్లతో చేపట్టిన బస్ స్టేషన్ల మరమ్మతులు, పెయింటింగ్ పనులు డిసెంబర్ నాటికి పూర్తి కావాలి. అవసరమైన చోట్ల కొత్త ఫ్యాన్లు, కుర్చీలు ఏర్పాటు చేయాలి. 24 గంటలు ఆర్టీసీ సిబ్బంది అందుబాటులో ఉండాలి' అని ముఖ్యమంత్రి సూచించారు. కాగా, స్త్రీశక్తి పథకాన్ని 15వ తేదీ మధ్యాహ్నం విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో చంద్రబాబు ప్రారంభిస్తారు.

అభద్రతాభావం ఇంకెన్నాళ్లు?

అక్కినేని వనజ సూటి ప్రశ్న

విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం: ఎన్డీయే హయాంలో దేశ ప్రజలకు భద్రతలేదని, వారిలో అభద్రతా భావం పెరుగుతోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. ప్రపంచంలో ఘర్షణ వాతావరణం ఉందన్నారు. ప్రైవేట్ రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలను వనజ డిమాండ్ చేశారు. సీపీఐ అనంతపురం జిల్లా మహాసభలు పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జె.రాజారెడ్డి, పద్మవతి, రమణ, నాగార్జన అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రతినిధుల సభలో సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ సంజీవప్ప సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం అక్కినేని వనస ప్రసంగిస్తూ కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు దొందూ దొందేనని, ప్రభుత్వరంగ సంస్థలైన, బీమా, బీఎస్ఎన్ఎల్ తదితర సంస్థలను అంబానీ, అదానీలకు కట్టబెట్టేస్తున్నాయని విమర్శించారు. బీజేపీ పాలనలో కుల–మతాల ఘర్షణలతో ప్రజల్లో అభద్రతా భావం పెరుగుతోందన్నారు. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో ప్రజలు అన్ని విధాలా నష్టపోతున్నారని వ్యాఖ్యానించారు. అడవి సంపదనంతా ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టేందుకే నక్సలైట్ల ఏరితేత దుయ్యబట్టారు. దేశం–రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయన్నారు. దేశంలో ప్రతి పౌరుడు లక్షా34 వేల రూపాయాల భారం మోస్తున్నారన్నారు. రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉంటే కుట్రపూరితంగా పడగొట్టి బీజేపీ గద్దెనెక్కుతోందని విమర్శించారు. ప్రజల్లో అభద్రతా భావం పోవాలంటే ప్రజా ప్రభుత్వాలు రావాలని అక్కినేని వనజ నొక్కిచెప్పారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్, కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, జాన్సన్ బాబు, జిల్లా కార్యదర్శి జాఫర్, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్యక్షుడు చంద్రనాయక్, జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, కార్యదర్శివర్గ సభ్యులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బోగస్ ఓటింగ్ హబ్‌గా త్రిస్సూర్

ఎన్నికల మోసాలపై సమగ్ర దర్యాప్తు: వినయ్ విశ్వం

తిరువనంతపురం: కేరళలోని త్రిస్సూర్ బోగస్ ఓటింగ్‌కు హబ్‌గా మారిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వం విమర్శించారు. ఒకప్పుడు రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు నిలయంగా ఉండే ఈ ప్రాంతం ఇప్పుడు బీజేపీ ద్వారా రాజకీయ మోసాలు, నకిలీ ఓటింగ్‌కు కేంద్రంగా మార్చబడిందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ఏజెంటుగా ఎన్నికల సంఘం ఉందంటూ దేశ నలుమూల నుంచి నివేదికలు అందుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితి అత్యంత ఆందోళనకరమని, ప్రజాస్వామ్య మూలాలకే ప్రమాదకరమని ఆయనన్నారు. బీహార్‌లో రాజకీయ పార్టీలను సంప్రదించకుండా జరిగిన ఓటర్ల జాబితాల సవరణ ద్వారా 65 లక్షల మంది ఓటు హక్కును కోల్పోయారు. ఇది పూర్తిగా రాజకీయ ప్రేరేపిత చర్య. కర్నాటకలో ఎన్నికల మోసాలు జరిగనట్లు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై స్పష్టతివ్వకుండా ఎన్నికల సంఘం తప్పించుకుంటోంది. త్రిస్సూర్‌లోనూ నకిలీ చిరునామాలు సృష్టించి పెద్దఎత్తున మోసాలు చేసినట్లు ఇటీవల వెల్లడైంది' అని వినయ్ విశ్వం అన్నారు. ఎన్నికల ప్రక్రియను స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించాలన్న కొద్దిపాటి చిత్తశుద్ధి అయినా ఎన్నికల సంఘానికి ఉంటేగనుక ఓటర్ల జాబితాల్లోని మోసాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగాల కల్పనలో ఎంఎస్ఎంఈలు కీలకం: మంత్రి కొండపల్లి

విశాలాంధ్ర – సచివాలయం: ఉద్యోగాల సృష్టిలో ఎంఎస్ఎంఈలు కీలకపాత్ర పోషించేలా ప్రణాళికలు రూపొందించామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా 2024–25లో 7,43,826 యూనిట్లు నూతనంగా ప్రారంభమయ్యాయన్నారు. 2021–24 మధ్య ప్రారంభమైన యూనిట్లు 7,91,445 (94 శాతం) అని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న వినూత్న చర్యలు ఫలితంగా ఈ అభివృద్ధి సాధ్యమైందని తెలియజేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 1500 ఎంఎస్ఎంఈ యూనిట్లు మూతపడ్డాయని, ఇది గత నాలుగేళ్లలో ప్రతి సంవత్సరం మూసివేసినా యూనిట్ల సంఖ్యకు రెట్టింపు అని పేర్కొనటం అసత్యమన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని 20 లక్షల ఉద్యోగాల సృష్టి లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తుందని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, ఉపాధి అభివృద్ధి విధానం 4.0 లో భాగంగా ఒక కుటుంబానికి ఒక ఉద్యోగం అనే నినాదంతో వివిధ ప్రోత్సహకాలు ప్రారంభమయ్యాయని, ఇరవైకి పైగా కొత్త పాలసీలు అమలు జరుగుతున్నాయని వివరించారు. ర్యాంప్ పథకం ద్వారా ఈఎస్‌డీపీ, రివర్స్ బయ్యర్స్ సెల్లర్స్ మీట్, వెండర్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

కార్గో ఎయిర్‌పోర్టుపై పోరు ఆగదు

కార్పొరేట్ సంస్థలకు పాలకులు దాసోహం

సీపీఐ నేత నారాయణ

విశాలాంధ్ర–పలాస–మందస (శ్రీకాకుళం జిల్లా): భారత దేశ విప్లవోద్యమ చరిత్రలో శ్రీకాకుళం జిల్లాకు ప్రత్యేక పోరాట చరిత్ర ఉందని, చిక్కోలు ప్రాంతం అగ్గి రవ్వ వంటిదని, నమ్మితే ఈ ప్రాంత ప్రజలు ప్రాణాలు ఇస్తారని, మోసం చేస్తే శత్రువు అంతు చూసే వరకు వదలరని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. శ్రీకాకుళం జిల్లా మందస మండలం ఉద్దానం ప్రాంతం రాంపురం పంచాయతీ కేంద్రంలో కార్గో ఎయిర్ పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ అధ్వర్యంలో మంగళవారం జరిగిన సభలో నారాయణ మాట్లాడారు. దేశం మొత్తం గుర్తించదగిన ప్రాంతం ఉద్దానమని, సముద్ర తీరానికి ఆనుకుని ఉన్న ఉద్దానం ప్రాంతాన్ని శ్మశానవాటికగా తయారు చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని నారాయణ విమర్శించారు. ప్రజల సంక్షేమం కోసం పాటుపడాల్సిన ప్రభుత్వం ప్రజా భక్షకురాలిగా మారిందన్నారు. గతంలో జరిగిన సోంపేట, కాకరపల్లి ఉద్యమాలలో తాను భాగస్వామిగా ఉన్నానని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సోంపేట ఉద్యమం తీవ్రతరమైందని, తనను పిలిచి థర్మల్ పోరాటం నుంచి తప్పుకోవాలని రోశయ్య సూచించారని తెలిపారు. ఉద్దానం ప్రాంతం అంటే తెలుసా అని రోశయ్యను ప్రశ్నించినట్లు చెప్పారు. ఇక్కడ మే నెలలో కూడా నీరు నిండుగా ఉంటుందని చెప్పానన్నారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అయితే, కల్లబొల్లి మాటలతో ఈ ప్రాంత రైతాంగాన్ని ప్రభుత్వం వంచనకు గురి చేస్తోందని విమర్శించారు. కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా గ్రామాల్లో ప్రచారం చేస్తామన్నారు. కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో పచ్చటి ఉద్దానం ప్రాంతాన్ని సర్వనాశనం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్దానం ప్రాంతంలో కేవలం 1394 ఎకరాలు మాత్రమే సేకరిస్తామని ప్రభుత్వం చెబుతోందని, అయితే, 6000 ఎకరాల్లో గల జీడి, కొబ్బరి తోటలను ధ్వంసం చేయడానికి, రైతుల జీవనాధారాన్ని దెబ్బతీయడానికి ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న, కింజరాపు ఎర్రన్నాయుడు కుటుంబాలకు ప్రత్యేక రాజకీయ చరిత్ర ఉందని, దీనిని పోగొట్టుకునేందుకు విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష కార్గో ఎయిర్‌పోర్టు కోసం అర్రులు చాస్తున్నారని విమర్శించారు. విమానాశ్రయాలు ఉన్న ప్రాంతంలోనే కార్గో విమానాశ్రయాలు ఏర్పాటు చేయాలని, దీనికి భిన్నంగా ఉద్దానం ప్రాంతంలో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మించడానికి ప్రయత్నాలు జరుగుతున్న తీరు ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా ఉద్యమించడానికి ప్రజలు, రైతులు నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఉద్యమానికి కమ్యూనిస్టు పార్టీలు, పజాసంఘాలు అండగా ఉంటాయని ఆయన ప్రకటించారు. ఈ పోరాటంలో తాను భాగస్వామిగా ఉంటానని అన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అంబానీ, అదానీకి దాసోహమయ్యాయని నారాయణ అన్నారు. ప్రభుత్వాలను కార్పొరేట్ కంపెనీలు శాసిస్తున్నాయని, ప్రజా సంక్షేమం కోసం పాటుపడాల్సిన రెవెన్యూ, పోలీస్ యంత్రాంగాలను ప్రభుత్వ పెద్దలు దుర్వినియోగం చేస్తున్నారని, ఒత్తిడితో పనిచేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు రాజధాని అభివృద్ధి పేరుతో 40 వేల ఎకరాల భూములు సమీకరించిందని, మరో 45 వేల ఎకరాల కోసం ప్రయత్నిస్తుందని, భూ సేకరణ కోసం కోట్లాది రూపాయల ప్రజాధనం వెచ్చించి... కార్పొరేట్ కంపెనీలకు ఎకరా 99 పైసలకు ఇస్తుందని తీవ్రంగా విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయన్నారు. అత్యంత పొడవైన తీర ప్రాంతం, అమూల్యమైన అటవీ సంపదపై కార్పొరేట్ శక్తుల కన్ను పడిందని ఆరోపించారు. దీనికోసం నక్సల్స్ పేరుతో గిరిజనులను హతమారుస్తున్నారన్నారు. 2026 మార్చినాటికి మావోయిస్టులను తుడిచిపెడతామని ప్రగల్భాలు పలుకుతున్నారని, ఇది ఎవరితరం కాదని నారాయణ స్పష్టంచేశారు. కాగా, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావును నారాయణ, కార్గో వ్యతిరేక పోరాట కమిటీ ప్రతినిధులు సన్మానించారు. సీపీఐ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీపీఐ నాయకులు చాపర సుందర్‌లాల్, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవింద్, వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు బత్తిని లక్ష్మణ్, పోతనపల్లి అరుణ, మద్దిల రామారావు, తాండ్ర ప్రకాష్, కె.రమేష్, సాలిన వీరాస్వామి, పి.కుసుమ, కోనారి మోహనరావు, తెప్పల అజయ్ కుమార్, కె.నీలకంఠం, వంకల మాధవరావు, పోరాట కమిటీ నాయకులు కొమర వాసు, జోగి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విద్యా విధానం రద్దు చేయాలి: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల: ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేశ్ సి.రంగరాజ్ అన్నారు. సమాఖ్య 90వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పద్మావతి నగర్ సెంటర్ నుంచి రామకృష్ణ డిగ్రీ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కార్యదర్శి సూర్య ప్రతాప్ అధ్యక్షతన దినేశ్ జెండా ఆవిష్కరించారు. దినేశ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. విద్యాభివృద్ధి కోసం నిరంతరం పోరాడుతుందన్నారు. దేశంలో శాస్త్రీయ విద్యా విధానం అమలు కావాలని, అందరికీ సమాన హక్కులు, చదువుకోవడానికి అవకాశాలు కల్పించాలని పోరాటాలు కొనసాగిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో హిందీ ప్రథమ భాషగా తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యా విధానంలో సంస్కరణలు కావాలని, విద్యా వ్యవస్థను నాశనం చేసే విధంగా నిర్ణయాలు తీసుకోరాదన్నారు. వైద్య విద్య... పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు అందకుండా ప్రభుత్వాలు అడుగులేస్తున్నాయని మండిపడ్డారు. తక్షణమే జీవో 107, 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. వసతి గృహాలకు నూతన భవనాలు నిర్మించాలని, వార్డెన్, కామాటీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మాజీ జాతీయ అధ్యక్షుడు మురళీధర్, రాష్ట్ర కార్యదర్శి నాసర్ జీ, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎన్.రంగనాయుడు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫకృద్దీన్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగ రాముడు, సీపీఐ నాయకులు సోమన్న, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు రామసుబ్బయ్య, బెనహర్, పులికొండన్న, భార్గవ్, శ్రీనివాసులు, జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి, ఉదయ్, శశిధర్ రెడ్డి, చందు, చంద్రశేఖర నాయక్, గోపి, ప్రదీప్, షాషా పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.